ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఈవారం: సినిమాలో నృత్యాలు–సచిత్రవ్యాసం



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

25 నయాపైసలు
6-5-59.



కీరసందేశం

చిత్రకారుడు : ఎ. వి. ఎస్. ఆర్. జోస్యులు—మంగళగిరి.



అంతకొద్ది సన్‌లైట్ చాలా బట్టలను ఉతికింది
-అట్లు చేసినట్టిది దాని అధికమైన నురగ:
ఆ! కనిపించింది అతని షర్టు! ఆ పెద్ద బట్టల దొంతర్లో ప్రతీ బట్టయున్నూ మెరుస్తున్నది! అమ్మ ఈ బట్టలన్నీ కొద్ది సన్‌లైట్ సబ్బుతో ఉతికింది. ఆ అధికమైన సన్‌లైట్ నురగ పూర్తిగా మురికి నంతా తొలగించివేసింది... చాలా ఎక్కువ బట్టలను ఎంతో తెల్లగాను, కాంతివంతముగాను ఉతికింది! మీరు సన్‌లైట్‌తో బట్టలను ఉతుకునప్పుడు వాటిని బాద పక్కర్లేదు.
సన్‌లైట్ సబ్బు బట్టలను తెల్లగాను,
కాంతివంతముగాను ఉతుకును
SUNLIGHT SOAP
Rs. 10,000 Reward!
LESS LABOUR GREATER COMFORT
SUNLIGHT SOAP
హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి తయారీ
S. 259-X52 TE

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సంవత్సర చందా
రు 13—0—0
విడిప్రతిక 25 న.పై

Founder: K. NAGESWARA RAO

వికారి చైత్ర బహుళ చతుర్దశి బుధ వారం


సంపుటము 53
సంచిక 32
6-5-59

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'ఇల్లరికం' లో
జమున

గవ్వలతో బొమ్మలు—	—	3
రాజధాని కబుర్లు—"ప్రవీణ్"	—	4
న్యూఢిల్లీ—శ్రీ కృష్ణ	—	6
ఆద్యంతాలు—ప. గోపీచంద్	—	8
భద్రాద్రిలో సీతారాముల కల్యాణం—పి.వి.ఆర్.శర్మ	—	12
కర్నూలు కబుర్లు—సౌజన్య	—	16
ప్రేమదాసు—జి. రామకృష్ణ	—	17
బంగారం; సింగారం—బాపు బొమ్మలకథ	—	20
సమర్పణ (సీరియల్) కందుకూరి లింగరాజు	—	22
ఏడుకొండలవాడా! వేంకటారమణా!-తాళ్లూరు నాగేశ్వరరావు		25
తొందరపాటు నిర్ణయం—ఆకుండినారాయణమూర్తి	—	29
సినీమాలో నృత్యాలు—	—	32
సమస్య తీరింది—"సవ్యశ్రీ"	—	34
ఆంధ్రమహాభారతం—	—	35
నక్షత్ర ఫలితాలు—బి. నరసింగరావు	—	37
వనితాలోకం—టి. రామలక్ష్మి	—	40
వనితావాణి—	—	45
సహవాసిని—సోమంచిసూర్యనారాయణశర్మ	—	48
అతనికంటె ఘనుడు—పోరంకి ఆనందం	—	49
సినిమా—	—	55
పుస్తకసమీక్ష—	—	64





పరికిణీ తొడిగినపాప



కట్టెల బొమ్మ



చంకలో కడవ


గవ్వలతో బొమ్మలు

ఈ విశాల ప్రపంచములో ప్రతీవస్తువు ఉపయోగకరమైన దన్నమాట సాధారణమైన గవ్వకూడా నిరూపిస్తుంది. సముద్ర తీరాన ఎక్కువపడితే అక్కడ విస్తారముగ పడివుండే గవ్వలతో ముచ్చటైన బొమ్మలు చేయవచ్చు.


గవ్వలు పోగుచేసి వాటిని బాగాకడిగి శుభ్రము చేయాలి. కొద్దిగ సున్నముకలిపిన నీటితో కడిగితే గవ్వలు తెల్లగా కళకళలాడుతాయి. కడిగిన గవ్వలను తడిపోయేట్టు బాగా ఆరపెట్టి ఆయా రకాలగవ్వలను వేరు చేయాలి. శంకులవలె పొడుగ్గాఉండే గవ్వ చేతులకు ఉపయోగింపవచ్చు. గుండ్రముగా ఉన్నవాటిని తలకు, శరీరమునకు వాడుకోవచ్చు. ఇట్లు ఆయా అంగములకు తగినట్లు గవ్వలను సిద్ధపర్చుకోవాలి. ఏ బొమ్మ చేద్దామనుకుంటామో అనగా ఒక స్త్రీ గడ్డిమోపుతల మీద పెట్టుకొని నిల్చున్నట్లో, లేక బిందె చంకలో పెట్టుకొని నిల్చున్నట్లో, మనకు ఏ విధంగా కావలెనో దానిని ముందుగనే ప్లానుచేసి, బొమ్మకు కావలసిన గవ్వలను సేకరించుకోవాలి. గవ్వలను సేకరించిన తరువాత బజారులో అమ్మే క్విక్ ఫిక్స్ అనే జిగురుమందుతో గవ్వలను అతికింప వచ్చు. ఈ జిగురు ప్రభావమేమిటంటే గవ్వలను ఒక దానికొకటి గట్టిగా అతికించితే, మళ్లీ కదిలింపజాలము. ఇట్లా గవ్వలను అతికించిన తరువాత ఆయిల్ పెయింట్ చేసి వాటికి కన్నులు, ముక్కు పెట్టితే నిజంగా గవ్వలతో చేసిన బొమ్మలేనా అని ఆశ్చర్యపడతారు.

రకరకాలైన గవ్వలతో చిన్ని చిన్ని బొమ్మలుచేసి డ్రాయింగ్ రూములలో అలంకరింపవచ్చును. రంగురంగు బొమ్మలను చూస్తుంటే పిల్లలకు వుత్సాహము తరంగములవలె వుప్పొంగుతుంది. ఈ గవ్వ బొమ్మలు చేయటం మన కుటీర పరిశ్రమలలో ముఖ్యమైనదానిగా ఎన్నుకోవచ్చును. దేశంలో అన్నవస్త్రములకు యిబ్బంది పడే స్త్రీలు యీ గవ్వబొమ్మలుచేసి బజారులో విక్రయించినయెడల కొంత ధనసంపాదన కూడా చేయవచ్చును. తీరిక వేళలలో కాలక్షేపానికి కూడా ఈ బొమ్మల తయారీ తోడ్పడుతుంది.

ఒకతె తబలా, ఒకతె వీణ, ఒకతె నాట్యం.



గవ్వలగువ్వలు; తాబేలూ; కుందేలూ.



రాజధాని కబుర్లు

ప్రవీణ్

విశ్వదాతకు శాశ్వత చిహ్నం

సొంత లాభం కొంత మానుకొమ్మన్నాడు గురజాడ అప్పారావు; కొంత మానుకు పొరుగువానికి సాయపడమన్నాడు. లాభం సొంతం సంపాదించి, చాలా మానుకు పొరుగువాళ్ళందరకూ సాయపడిన వ్యక్తి నాగేశ్వరరావు పంతులు. అందుకే 'విశ్వదాత' అంది ఆయన్ని విశ్వం; 'దేశోద్ధారకుడు' అంది దేశం.

నాగేశ్వరరావుగారు కన్నుమూసిన తర్వాత, ఆంధ్రదేశంలో ఇరవై ఒక్క సంవత్సరాలు బరువుగా నడిచాయి. ప్రజల ప్రమేయం లేకుండా జర్మనీపై యుద్ధం ప్రకటించింది ఆనాటి ఇండియా ప్రభుత్వం; నిరసనగా రాజీనామా లిచ్చాయి కాంగ్రెసు మంత్రి వర్గాలు. 1942 లో కాంగ్రెసు నాయకులు కారాగార ప్రవేశం చేశారు; పత్రికలు అజ్ఞాతవాసం చేశాయి. ఒక సంవత్సరం వెలిగి ప్రకాశం ప్రభుత్వం ఆరిపోయింది. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది; వెనువెంటనే విశాలాంధ్రం ఏర్పడింది. పరిస్థితు లెంత భారంగా హృదయాలపై నిలిచినా, దేశోద్ధారకుని మరచిపోలేదు ఆంధ్ర ప్రజలు; వారిని మరచిపోలేరు ఆంధ్రప్రజలు.

ఈ ఇరవై ఒక్క సంవత్సరాలలో ఏటేటా చైత్రశుద్ధ ద్వాదశి నాడు ఆంధ్రప్రజలు దేశోద్ధారకుని స్మృతికి అంజలి ఘటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానినగరంలో గత మంగళవారంనాడు ఆరు సాహిత్య సాంస్కృతిక సంస్థలు దేశోద్ధారక వర్ధంతి జరుపుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్ర రచయితల సంఘం, నవ్యసాహితీ సమితి, ఆంధ్ర యువతీమండలి, ఆంధ్ర బాలానంద సంఘం—ఈ ఆరు సంస్థల సమష్టి ఆధ్వర్యాన జరిగిన సభకు ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ పలగాని చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు.

ప్రధాన న్యాయమూర్తి అన్నారు: "లోకంలో తెలుగుభాష జీవించి ఉన్నంతకాలం దేశోద్ధారకుని పేరు మరచిపోలేదు లోకం. ఐనా—వారికి శాశ్వత స్మృతిచిహ్నం నెలకొల్పవలసిన బాధ్యత మనది."

ఆ సభలో ఉపన్యసించిన ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అన్నారు: "పంతులుగారిని గురించి ఏదో పెద్దగా మాట్లాడాలని ఉద్దేశ్యం కాదు; వారి వర్ధంతి సభలో పాల్గొని భక్తితో వారి నామాన్ని సంస్మరించటంకంటె కర్తవ్యం వేరలేదు మనకి."

"చనిపోయినవారి ఆత్మలు తిరిగి మరోశరీరంలో ప్రవేశించే ముందు కొన్ని సంవత్సరాలు ఆకాశంలో తిరుగుతూ ఉంటాయిట. నేను ఒక వేదాంత గ్రంథంలో చదివాను. అదేనిజమైతే—ఈ వర్ధంతి సభలో పాల్గొంటూన్న మనపైన ఆనందబాష్పాలు రాలుస్తూంటారు పంతులుగారు" అన్నారు శ్రీమతి నాయని కృష్ణకుమారి. "కళారంగంలో అభినివేశం పంతులుగారికి. వారి స్మృతి చిహ్నంగా ఏటేటా ఉత్తమకళాకారులకి బహుమతులు ఏర్పాటుచేయాలి ఆంధ్రపత్రిక" అన్నారు శ్రీ పోతుకూచి సాంబశివరావు. "నాగేశ్వరరావు తాత ఇప్పుడు బ్రతికుంటే, ఎంతబావున్ను?" అన్నది ఆరు సంవత్సరాల బాలిక కుమారి పి. వి. కామేశ్వరి. "పిల్లలకోక గ్రంథాలయం కావాలని అడిగేవాళ్ళం. నాగేశ్వరరావు తాత ఇచ్చేవాడు. రోజూ అక్కడికి వొచ్చేవాడు. మాతో ఆడుకొనేవాడు" అంటూ కళ్లు తెరిచి, ఆకాశంలోకి చూసింది ఆ బాలిక.

"పంతులుగారి జీవితచరిత్ర రచించిన ఉత్తమ రచయితకి రెండు వేల రూపాయలు బహుమానం ప్రకటించింది అకాడమీ. వచ్చే డిసెంబర్ నాటికి నిర్ణయం పూర్తౌతుంది. వచ్చే వర్ధంతి నాటికి గ్రంథం సమర్పిస్తాం" అన్నారు వందన సమర్పణ చేస్తూ, అకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు.

*　　*　　*　　*

దేశోద్ధారకునికి శాశ్వత స్మృతి చిహ్నం నెలకొల్పబడాలన్న ప్రధాన న్యాయమూర్తి శ్రీ చంద్రారెడ్డి అభిప్రాయంతో ఎల్లరూ అంగీకరిస్తారు. కాని—ఈ స్మృతి చిహ్నం స్వరూపం ఎలాఉండాలి? నవనీత హృదయుడైన ఆయనకు శిలావిగ్రహం స్మృతిచిహ్నం ఔతుందా? కనకవర్షం కురిపించినవ్యక్తి కంచువిగ్రహం నెలకొల్పి, తృప్తి పడగలమా?

వర్ధంతి సభలో ప్రసంగిస్తూ ఆంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం అన్నారు: మహోద్యమా లన్నీ మన తెలుగుసంస్కృతికి చిహ్నమైనగోదావరినదివలె, అల్పారంభాలు ఒక ఉద్యమం ఒకింత ముందుకు సాగినతర్వాత నలుగురు నాలుగు చోట్లచేరి ప్రోత్సహిస్తారు. శూన్యంలో దీపం వెలిగించడం కష్టం. ఆంధ్రదేశంలో ఏ ఉద్యమం ప్రారంభించినా, దాని వెనుక నాగేశ్వరరావుగారు ఉన్నారు. కాగు! ఏ ఉద్యమం ప్రారంభమైనా, దాని ముందు వారున్నారు. ఆంతరంగిక శాఖామంత్రి శ్రీమందుముల నర్సింగరావు అన్నట్టు వారి సహాయం పొందనిసంస్థ, కోరి సహాయంపొందని విద్యార్థి, అడిగి లేదనిపించుకున్న వ్యక్తి ఆంధ్రదేశంలో ఆనాడు లేరు.

నాగేశ్వరరావుగారి దాతృత్వం నిర్జీవమైనది కాదు. అదొక సజీవప్రవంతి. వారి సహాయం పొందిన సంస్థలు, వ్యక్తులు, ఉద్యమాలు చలన రహితంగా నిలిచిపోలేదు. నానాటికి పెరిగి ఆంధ్ర దేశపు సంస్కృతికి చిహ్నాలయ్యాయి.

వారిపేరిట ఏ స్మృతి చిహ్నం నెలకొల్పినా...అది వారి పరిపూర్ణ జీవితాన్ని ప్రతిబింబించాలి. కళాప్రపూర్ణులు వారు అన్న విషయాన్ని మనం విస్మరిస్తే ఎలా?

రాజధాని నగరంలో నాగేశ్వరరావుగారి పేరిట ఒక మందిరాన్ని నెలకొల్పి, రాజధానిలోని సాంస్కృతిక కార్యక్రమాలకు దాన్ని నిలయంచేస్తే, ఆకాశంనుంచి నిజంగా ఆనంద బాష్పాలు రాలుస్తారు పంతులుగారు. ఏటేటా కాదు వారిని సంస్మరించవల

20-5-59 నుంచీ కొత్త సీరియల్

అన్వేషణ

తెలుగు భాషాసమితి బహుమతిపొందిన నవల

[ఆంధ్ర రాజధాని కథాస్థలం]

రచన: పోతుకూచి సాంబశివరావు

సింది; ఏడాదిపొడుగునా సంస్మరించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు రావాలి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంస్థలు తాము ముందుకువచ్చి, ప్రదేశ్ప్రభుత్వాన్ని ముందుకు తేవాలి.

ప్రభుత్వానికి జ్ఞానోదయం

ప్రభుత్వానికి జ్ఞానోదయం ఐందని నేనంటే మీరు నమ్మరు. "ప్రభుత్వానికి జ్ఞానమేమిటి? ఉదయించడ మేమిటి? మేము నమ్మం" అంటారు. కాని వినండి. మూడు సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జ్ఞానదంతా లొస్తున్నాయో లేదో మీరే చెప్పండి.

రాజధాని నగరంలో 'చాదర్ ఘాట్' అనే ప్రదేశముంది. ఉందని అంటారు. కాని అది ఎక్కడఉందో రూఢిగా చెప్పడం కష్టం. ఎందువల్ల నంటారా? చాదర్ ఘాట్ వంతెన నగరంలో మూసీనదిపై మలక్ పేట వెళ్ళేదారిలో ఉంది. చాదర్ ఘాట్ బాలికల ఉన్నత పాఠశాల అదే ప్రాంతంలో ఉంది. చాదర్ ఘాట్ కళాశాల దానికి కొన్ని మైళ్ళదూరంలో బొగ్గులకుంటలో ఉంది. చాదర్ ఘాట్ ఉన్నత పాఠశాల దానికి మరో ఫర్లాంగుదూరంలో జనరల్ పోస్టాఫీస్ కి ఎదురుగా సందులోఉంది. చాదర్ ఘాట్ ప్రాథమిక పాఠశాల దానికి మరిరెండు ఫర్లాంగుల దూరంలో చిరాగల్లీ గల్లీలోఉంది. చాదర్ ఘాట్ ఆసుపత్రి మరిరెండు మైళ్ళ దూరంలో నాంపల్లిలో ఉంది.

'ఇంగుగలపంగులేదని సందేహము వలదు. చాదర్ ఘాట్ సర్వోపగతమ్ము. ఎందెందు వెదకి, వెదక్కుండా చూచిన అందందే గలదు. ప్రాక్రగణి! వింటేః'

ఇట్టి పరిస్థితుల్లో చాదర్ ఘాట్ ఆసుపత్రికి బేరమాడుకొని రిక్షాపిలిస్తే, దానికి నాలుగుమైళ్ళ దూరంలో వంతెనవద్దకు తీసుకుపోవడం కద్దు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాదర్ ఘాట్ ఆసుపత్రికి నాంపల్లి ఆసుపత్రి అని పేరుపెట్టి, ఉత్తర్వులు జారీచేసింది ఇప్పుడు. ఆసుపత్రిలో జ్ఞానదంతం రావడంలో ఔచిత్యంఉంది.

మరి- నారాయణ గూడాలోఉన్న 'హిమాయత్ నగర్ పోలీస్ స్టేషన్' పేరు మార్పించాలి ప్రభుత్వం. లింగంపల్లి నారాయణగూడా వెనకఉందో, కాచిగూడా ముందుఉందో తేల్చాలి ప్రభుత్వం. మరేమీ చేయలేకపోతే మానె- రాజధాని నగరంలో వీధుల, స్థలాల, ప్రభుత్వసంస్థల పేర్లయినా సరిగా ఉంచుకో లేకపోతే ఎలా?

జాతీయం చేయబడిన అజ్ఞానం

అవినీతికి, అజ్ఞానానికి నిలయం ఆర్. టి.డి. ఒకప్పుడు.


ఇప్పుడు ఆర్. టి. సి. పేర పిలవబడే స్వతంత్రసంస్థ రాజధానిలో బస్సురూట్లలాగే, అవినీతిపై అజ్ఞానంపై ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తూన్న సంస్థ.

ఆర్. టి. సి. సామంత ప్రభువుల్ని పిలిచి, 'ఏమండీ! ఫలానాది ఫలానా విధంగా ఉందేం?' అని ప్రశ్నిస్తే, 'నేనేం చేయను?' అని సమాధానం ఇస్తారు ఆ ప్రభువులు. ఆ సంస్థ నిర్వహణకి నియమాలు ఉన్నాయి, అవి ప్రయాణీకుల అసౌకర్యానికే గాని వారికి సౌకర్యాలు కలిగించడానికి కాదు.

ఉదాహరణకి: హైదరాబాదు-బెజవాడ-బందరు మార్గం తీసుకోండి. బస్సెన్నింటికి బయలుదేరుతుందని అడిగితే, ఒకటిన్నరకి అని టెలిఫోనులో చెబుతారు. డిపోకి వెళ్ళిచూస్తే బోర్డుమీద 'మచిలీపట్నం-14.00 గంటలు' అని ఉంటుంది. బస్సులో స్థానం రిజర్వు చేసుకుంటే, బందరువరకు చేస్తారు. రిజర్వేషన్ టికెట్ వెనుక ఆ బస్సులోకాని, ఆ బస్సులో ఆ స్థానంకాని, మరే బస్సులో ఏ స్థానంకాని కేటాయించబడుతుందని హామీలేదని రాసిఉంటుంది. నలభైరెండు నయాపైసలు సరదాకు చెల్లించుకుంటారు కాబోలు ప్రయాణీకులు!

రిజర్వేషన్ టికెట్ (బందరువరకు) పట్టుకొని, బస్సువద్దకు పోతే, బస్సు బందరు పోదని, విజయవాడలో ఆగిపోతుందని చెబుతాడు కండక్టరు. 'పోనీ-విజయవాడలో కనెక్షన్ దొరుకుతుందా!' అంటే, ఈ బస్సు-టైమ్ టేబిల్ ప్రకారం-విజయవాడ చేరిన క్షణంలోనే, బందరు బస్సు అక్కడనుంచి బయలుదేరుతుంది. ఇది ఆలస్యమైతే-అది అందుతుందని హామీలేదు.

ఈ విధంగా 'ఏ' నుంచి 'జడ్' వరకు అజ్ఞానాన్ని జాతీయం చేసింది మన ప్రభుత్వం. ★



న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ

పండిట్ పంత్ అస్వస్థత

కేంద్ర హోంశాఖామంత్రి పండిట్ గోవింద వల్లభపంత్ ఈమధ్య జబ్బు పడ్డారు. జబ్బు ప్రమాదకరమైనది కాక పోవటం సంతోషకరమైన విషయం.

కాని ఈ అగ్రశేణి నాయకుణ్ణి వార్ధక్య భారం క్రుంగతీస్తోందనేది మాత్రం ఇప్పుడు వచ్చిన గుండెపోటు స్పష్టంచేస్తోంది. రెండు వైపులా అంటించిన కొవ్వొత్తి ఎక్కువ వెలుగిస్తుంది నిజమేకాని, ఎంతకాలం అలా నిలబడి ప్రకాశించగలదు! అంచేత శ్రీ పంత్ ఊరికే హైరానపడి పనిచెయ్యటం ఇక ఏమాత్రమూ క్షేమంకాదు. అందులో ఈమధ్య కొన్ని నెలల్నించీ ఆయన మరీ నిర్విరామంగా పనిచేస్తూ ప్రాణాన్ని శోషింప జేసుకుంటున్నారు. ఈ మధ్యనే ఉక్కు కర్మాగారాలలో పర్యటించి వచ్చారు. ఏప్రిల్ 18న ఢిల్లీకి తిరిగివచ్చి వెంటనే మళ్ళా ఇంకో కార్యక్రమంమీద బయల్దేరారు.

పనికి సంబంధించినంతవరకూ పండిట్ పంత్ ఉపప్రధానిగానే వ్యవహరిస్తున్నారనేది రహస్యంకాదు. అందులో ఆయన తమకుముందు ఆ పదవిలో పనిచేసిన వారిలా కాకుండా, ప్రతిఫైలులోని ప్రతి పేజీ, ప్రతివాక్యం శ్రద్ధగా చదువుతారు.

కాంగ్రెసు నాయకులు ఈపాటికి భారత దేశ పరిపాలనంలో ఆరితేరారు. వారి మాట ఎల్లావున్నా, పండిట్ పంత్ మాత్రం గొప్పపరిపాలనా దక్షత గడించారు. కాని బ్రిటన్‌లో ఆయన హోదాలాంటి హోదాలో నేవున్న మంత్రులూ, వాళ్ళు ఎలా పని చేస్తారో, ఎలావిశ్రాంతి తీసుకుంటారో ఆపద్ధతిమాత్రం ఆయన నేర్చుకోలేదు.

28 ఏళ్ళక్రితం ఆయన ఉత్తరప్రదేశ్ పరిపాలనాబాధ్యత స్వీకరించి నప్పటినుంచీ ఏదోరకంగా, ఆయన్ని బాధ్యతలు వదిలి పెట్టడంలేదు. ఒక్కరోజుకూడా విశ్రాంతి లేకుండా పనిచేస్తూవచ్చారు. సెలవు సంగతి సరేసరి. ఆమాటే ఆయ నెరగరు. అంతలా పని చేస్తుంటే మంచమెక్కక తప్పుతుందా!

ఇకనుంచి అయినా, దేశ యస్సుశ్రే దృష్టిలో పెట్టుకునైనా ఆయన కొంతపని తగ్గించుకోవటం మంచిది. ఆస్పత్రిలోంచి బయటకొచ్చేసరికి మరికొన్ని రోజులైనా పడుతుంది. మళ్ళీ పనిలో చేరేముందు ఆయన విశ్రాంతి తీసుకొనేటట్లు ఒత్తిడిచేసి ఒప్పించాలి. ఆయన నరోనాలుగు కాలాలపాటు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండటం దేశాని కిప్పుడవసరం.

* * *

అనుభవజ్ఞుడైన ప్రముఖ పత్రికారచయిత సర్ ఉపానాథ్ సేన్ ఇటీవల తమ 79వ ఏట మరణించారు. 1912లో ఆయన పాతఢిల్లీ, కాశ్మీర్ గేట్ దగ్గర చబీగంజ్ లోకి మారినప్పటినుంచీ ఆయన్ని నేను బాగా ఎరుగుదును. ఆరోజుల్లోనే భారతరాజధాని ఢిల్లీకిమారింది. అప్పట్లో సర్ ఉపానాథ్ ఇంకా దారితెన్నూ దొరక్క అవస్థపడుతుండేవారు. నేను కాలేజీలో చదువుతుండేవాణ్ణి.

ఆరోజులే వేరు. ఆ జీవితమే వేరు. ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో అప్పుడులేదు. అసలు పార్లమెంటేలేదు. పెద్ద అధికారులంతా బ్రిటిష్‌వారు. ఏమంత పెద్దపోటీకూడా ఉండేదికాదు. భారత రాజధానిలో విలేఖరులను పెట్టుకుని ప్రత్యేకంగా వార్తలు తెప్పించుకో గలిగినంత స్తోమత ఏ భారతీయ పత్రికకూ ఉండేదికాదు. బ్రిటిష్ వారి చేతుల్లోఉండే పయనీర్, స్టేట్స్‌మన్, టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలకి మాత్రమే ఢిల్లీలో విలేఖరులుండేవారు.



అమెరికన్ మాజీ విదేశాంగమంత్రి డలెస్, తాజా విదేశాంగ మంత్రి క్రిస్టియన్ హెర్టర్.

మా అందరికీ గురువైన శ్రీ కె. సి. రాయ్‌లాగానే సర్ ఉపానాథ్ సేన్ కూడా వార్తలు సేకరించటంలో ఎన్నో కొత్త దారులు తొక్కి, కొత్త పద్ధతులు కనుక్కున్నారు. శ్రీ కె. సి. రాయ్ పద్ధతులనే సర్ ఉపానాథ్ అభివృద్ధి చేశారు. కూడాను అయితే ఇవన్నీ ఒక ఎత్తూ, ఆయన మంచితనం ఒక ఎత్తూ.

కాంగ్రెసు అధికారంలోకి రావటంతో పాత విలువలు తారుమారయ్యాయి. ఆయన

ఆరోగ్యమూ చెడిపోయింది. పత్రికలకి రాయటం మానేసినా, అలాగే ఆయన కాలక్షేపం చేస్తూ వచ్చాడు. అనేక సంస్థల కమిటీలలో ఆయన సభ్యుడుగా ప్రజా జీవితంలో ప్రముఖపాత్ర వహించాడు. ఆయన పోవటం న్యూఢిల్లీ సాంఘికజీవితానికి తీరనిలోటు.


* * *

పాకిస్థాన్ మాటిమాటికి భారత దేశం మీద ఒంటికాలుతో లేస్తోంది. ద్విముఖంగా భారతదేశాన్ని చికాకు పెడుతున్నది. ఒకవేపు, అస్సాం సరిహద్దులమీద దాడులు జరిపిస్తోంది. ఈ మధ్యే పశ్చిమ బెంగాల్ లో ఒక గ్రామంమీద కత్తులు కటార్లు ధరించిన మురా ఒకటి దాడిచేసి ఇళ్ళు తగలపెట్టి, పశువుల్ని ఎత్తుకుపోయింది.

మరో వేపు సరిహద్దులు అతిక్రమించి విమానాల్ని పంపించటం జరుగుతోంది. ఒక విమానం న్యూఢిల్లీకి రాగలిగినంత దగ్గిరిగా వచ్చింది కూడాను. అయినా మనం ఊరుకున్నాము. కాని పొరపాటున దారి తెలియక పాకిస్థాన్ సరిహద్దులు దాటివెళ్లిన ఒక భారతీయ విమానాన్ని పాకిస్థాన్ వారు కూల్చి పడగొట్టారు.

తూర్పు సరిహద్దులలో దాడులకు సంబంధించినంతవరకూ ఒక కథ వినిపిస్తోంది. పాకిస్థాన్ మురావాళ్ళని మన సరిహద్దులలో ఉన్న భారతీయ ముసల్మానులే ఆహ్వానించుతున్నారట. ఇది నిజమోకాదో తెలియదుగాని, సాయుధులైన ఒకమూక దండెత్తి వచ్చి గ్రామంమీద పడి దోచుకుని సురక్షితంగా వెళ్ళిపోతున్నారంటే అది మనకు చాలా సిగ్గుచేటైన విషయం. ఈదాడుల్ని దారిదోపిడీల్లాంటివని ప్రధాని అన్నారు. అయితే కావచ్చుగాని, ఈ పాకిస్థానీ దాడిమూకలు భారతదేశమన్నా, భారతీయ ప్రజలన్నా మరి కాస్తభయభక్తులతో మెలిగేలా చేయవలసిన ఆవశ్యకత ఎంతేనా వుంది. అటువేపున్న పాకిస్థానీల వద్ద కత్తులూ కటార్లు ఉంటున్న పక్షంలో, ఇటువేపున్న భారతీయులకు కూడా కత్తులూ కటార్లూ ఇవ్వాలి.

పూర్వం దేశంలో మతకలహాలు చెలరేగే రోజుల్లో మహాత్మాగాంధీ అనేవారు: హిందువు పిరికివాడనీ, మహమ్మదీయుడు కజ్జాకు కాలు దువ్వేవాడనీ. భారతదేశపు సరిహద్దు సంఘటనలకు సంబంధించినంతవరకూ ఇప్పుడు కూడా ఇది నిజంగానే కనిపిస్తోంది. సరిహద్దు ప్రాంతంలో ప్రతి అంగుళం మేరా గస్తీ తిరగటం, జాగ్రత్తగా కాపాడుకోవటం ప్రభుత్వానికి సాధ్యం కాదని ప్రధానమంత్రి చాలాసార్లు అన్నారు. అలాంటప్పుడు సరిహద్దు ప్రజలే తమ ధనమాన ప్రాణాల్ని కాపాడుకోవలని



బీహారులో, మోకామేవద్ద గంగానదిపై కట్టిన రైల్వేవంతెన. 16 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఈ వంతెనవల్ల ఉత్తరదక్షిణబీహారులకు, అస్సాం బెంగాలులకు మధ్య రాకపోకలు సులభమవుతాయి.

వుంటుంది. ఆత్మరక్షణకు వారికి కనీసం ఆయుధాలైనా ప్రభుత్వం సప్లయిచేయాలి.

* * *

ఇటీవల వార్తావరణంలో ప్రముఖంగా కనిపిస్తున్నవారు వాణిజ్యమంత్రి శ్రీలాల్ బహదూర్ శాస్త్రి 'పంజాబ్ వాణిజ్యమండలి వార్షిక సమావేశంలో మాట్లాడుతూ, ఆయన కేంద్ర సచివాలయంలో అస్తమానం గడియారాలకేసి కళ్ళుపెట్టుకుని "కష్టపడి పనిచేసే" గుమాస్తాలను గూర్చి ప్రస్తావించారు. సాయంత్రం అయిదు అవుతోందనగానే పని అంతా ఎక్కడిదక్కడ స్తంభించిపోతుంది. ఉద్యోగులు సైకిళ్ళమీదికి ఉరికి ఇళ్ళకు అర్జంటుగా బయల్దేరి పోతారు. న్యూఢిల్లీ రోడ్లమీద వీరి సైకిల్ బ్రిగేడ్ చూడవలసిన దృశ్యం.

శ్రీ శాస్త్రి ఈ ముక్కలు చెప్పాల్సింది వాణిజ్యమండలి సభలో కాదని, ప్రధాన మంత్రితోనో, అది వీలుపడకపోతే కార్మిక మంత్రి లాలా గుల్జారీలాల్ నందాతోనో చెప్పివుండాల్సిందనీ ఒకరన్నారు.

ఎగుమతులను ప్రోత్సహించడానికి నిర్బంధ చర్యలను అవలంబిస్తామని శ్రీ లాల్ బహదూర్ తమ పాత బెదిరింపునే పునరుద్ఘాటించారు. ఈ బెదిరింపును ఆయన ఆచరణలో పెడితే చూడాలనివుంది. విదేశాలనుంచి దిగుమతిచేసిన కార్లలో సగం మన్నికతో,

(62-వ పేజీ చూడండి)

ఆద్యంతాలు



కాలేజినుంచి ఇంటికి వచ్చిన మధు, లోపల నుంచి రెండు కీచుగొంతులు కలిసి నవ్వుకోడం విని ఆగిపోయాడు.

వీధితలుపు కంతలో నుంచి తొంగి చూశాడు. మనుష్యులు ఇంకో గదిలో వున్న అలికిడి, కాస్సేపు చేతి గాజులు సన్నగా గల గలాడిన చప్పుడు. మూడో వ్యక్తి రాక పసిగట్టేసి సంభాషణ ఆపేసిననిశ్శబ్దత. ఆలోచనలో పడ్డాడు. వీధి తలుపులు దభీమని తెరుచుకుని, మల్లెపువ్వుల వాసనంతా మూట కట్టి బరువుగా విసిరేసినట్లయింది మధు ఉలికి పడ్డాడు. తను గేటు చప్పుడు చేస్తూ తీసుకు రావడం "పొరపాటైందిస్మీ" అనుకుని లోపలికి అడుగు పెట్టాడు.

రాధ నవ్వుతూ లోపల ద్వారబంధానికి రెండు చేతులూ అడ్డం పెట్టి, తను అడ్డంగా నిలబడింది. లోపలి వ్యక్తులు కనపడ్డం లేదు.

మధు ఈ సస్పెన్సులో వుండగానే, "అమ్మ పిన్ని" అని కేకేసుకుంటూ "చిట్టి" పరిగెత్తుకుంటూ వచ్చేసింది. చిట్టిని పరికించి చూశాక అర్థమైపోయినట్టనిపించింది. ఇంజనీరుగారి పోలికలు వెతకక్కర లేకుండానే దొరికిపోతున్నాయ్.

"మీ అక్కయ్య భిలాయ్‌నుంచి పొద్దున వచ్చినట్టు ఎలాగూ తెలుస్తూనేవుంది కాబట్టి ఎవరొచ్చారని అడగడం అనవసరమనుకుంటాను."

"మహా-సంతోషించారు లెండి. ఎగురూగా పిల కనిపించింది కనక చెప్పేశారు అంతేగా?" అని లోపలి వ్యక్తిని ఉద్దేశించే గొంతుతో గట్టిగా దీర్ఘాలు తీస్తూ అంది: "చూశావా, అక్కాయ్, మీ మరిదిగారి దర్పాలూ?"

లోపలి గదిలోని స్త్రీ లేచినట్టు, రెపరెపలాడుతూ చీర నలిగిన చప్పుడు.

"మా మరిది ఉట్టి అమాయకుడనుకుంటూండేదాన్ని! ఇప్పుడు రాధ చెప్పిందాంతో అభిప్రాయం మార్చుకుంటున్నాను. ఏమయ్యా మరిదీ, కులాసాయేనా?" అంటూ హేమ ప్రవేశించింది. రథం నడుస్తున్నట్టుంది.

మధు తెల్లబోయి ఆమెను పరీక్షగా చూశాడు. రాణివాసంలోని రీవీ, హుందా ఆమె నడకలో, ఆమె ఉచ్చారణలో ఉట్టిపడుతున్నాయి. ఆరేళ్ల క్రితం చూసిన ఆమెకూ, ఈమెకూ ఎంత భేదం! రిమ్‌లెస్ కళ్ళజోడు మొహానికి నిండిచ్చింది. ఇవి బహిరంగంగా కనపడే మార్పులు.

భిలాయ్‌లో భర్త ఇంజినీరనీ, అత్తవారు చాలా సిరిపరులనీ ఆమెలో ఒక గంభీరత, గొప్పింటి యిల్లాలిననే ఒక ఆత్మాభిమానం

ప్రతి కదలికలో, ప్రతిమాటలో తూచినట్టు పట్టిఇవ్వడమే ప్రస్తుతం తను గమనిస్తున్నాడు. చూపు మార్చాడు.

ఆమె ప్రక్క రాధ మునిపల్లెలోని అమాయకత్వంఅంతా కళ్ళల్లోనూ, మాటల్లోనూ ప్రతిఫలించే అనసూయా, ప్రియంవదా లాగుంది!

హేమ ఒక పర్వత శిఖరం. రాధ ఒక అగాధం. హేమజీవితం గర్వంగా, తృప్తిగా రొమ్ము విరుచుగుని శిఖరంమీద నడుస్తుంటే, రాధ జీవితం ఏవో చెప్పగోలేని మూగబాధలతో అగాధాల్లోకి కుంచించుకుపోతోంది.

"ఏంటే రాధా? ఇతనికి ఇంత పరధ్యానం ఎక్కువై పోయిందీ? ప్రొఫెసర్లు పరధ్యానానికి పెట్టింది పేరని ఒక వాడుక వుందిలే. అది నిజమేనని నాకు బాగా తెలిసిందిస్మా" అంది హేమ బరువుగా నవ్వి. లోయలోకి పడిపోతున్న జలపాతం లాగుంది ఆ నవ్వు.

తన స్థితికి తనూ నవ్వుకున్నాడు.

"అమ్మపిన్నీ, ఎవరీవళ?" అని రాధ చెవిలో మెల్లిగా అడిగాననుకుని, రహస్యం కాస్తా అందరూ వినేశారని తెలిశాక సిగ్గుపడిపోయి రాధ భుజాలమీద మొహందాచేసుగుంది చిట్టి.

"బాబాయే, పిల్లా", అంది రాధ సాగదీస్తూ.

వ్యక్తులమీద కాలం విచిత్రంగా ముద్ర వేసి గతంలోకి తప్పుకుంటుంది. ఎంతో నాజూగ్గా, అమాయకంగా తన పెళ్ళిలో చలాకీగా తిరుగుతూన్న హేమలో కళ, స్వాతిశయం, చమత్కార సంభాషణా— ఇవికాక శారీరకంగా కాస్త లావూ! చిట్టిని చూడ్డం ఇదే మొదటిసారి. తండ్రి పోలికలూ, తల్లి రంగూ కలిసి చాలా ముద్దుగా ఉంది. బాబ్డ్ హేర్, సాక్సుతో కూడా చిన్న చిన్న బూట్సు— ఇవి పూర్తిగా ఇంగ్లీషువాళ్ళపిల్లగా మార్చేశాయి.



★ ఆద్యంతాలు ★

చిట్టి విపరీతంగా అల్లరి చేసేస్తోంది.

"అమ్మపిన్నీ! మా కాన్వెంట్‌లో ఎంత ఎంచక్కటి కథలు చెప్తారనుకున్నావ్? మరి నువ్వూ ఒక మంచికథ చెప్పవ్?" అని బతిమాలుకుంటున్నట్టు రాధ మొహాన్ని తన వైపుకి తిప్పుకుంది.

"ఈ పిల్లకి నా దగ్గిరకన్నా, దీని పిన్ని దగ్గిర ఊ-హూ-చనువు. ఈ రాధమ్మ కన్నతల్లీ, నేను పెంపుడు తల్లీనూ దీని దృష్టికి." హేమ స్వగతం చెప్పుకుంది. ఆమె గొంతులో కాస్త అసూయ నీడగా ధ్వనించడం మధు గమనించాడు.

వెంటనే రాధ అమాయకంగా,

"మరేనే అక్కాయ్! పోనీ దీన్ని మా యింట్లో అట్టే పెట్టెయ్యరాదు టే? 'మా' పిల్లకి ఏ లోటూ రానివ్వంలే," అంది హామీ యిస్తున్నట్టు.

బగులుగా హేమ నవ్వింది. కచ్చితంగా సమాధానం ఇవ్వాల్సినసమయంలో తప్పించుగోడానికి వేసే గడుసు ఎత్తుగడల్లో ఈనవ్వు ఒకటి.

ప్రపంచంలో తనను మానవస్వభావాలు ఆశ్చర్యపరిచేటంత గాఢంగా మరేవీ కదలించలేవు. ఆ రోజు దాకా ముక్కూ, మొహంకూడా సరిగ్గా తెలీని రాధకి చిట్టి అంత ప్రాణం ఇవ్వడమేమిటి? 'పూర్వజన్మ సంబంధం' అని తలనెరిసిన పెద్దవాళ్లు తేలిగ్గా ఒక మాటతో కొట్టిపారేస్తారు. కాని తార్కికంగా ఆలోచించే తనలాటి వ్యక్తి ఆ సమాధానంతో తృప్తిపడడు.

రాధ సృష్టికి ఒక పుష్పాన్ని సమర్పించింది. మూడేళ్ళలోనే ఆ పుష్పం తొడిమ నుంచిరాలి పంకుటాకుల్లో పడిపోయింది. ఇప్పుడు చిటిని చూడగానే ఆమెలోని పూర్వపు మాతృత్వం అగ్నిపర్వతంలా బ్రద్దలవుతోంది. లోపల్నించి 'లావా' అంతా అలావస్తూనే ఉంటుంది, 'అయిపోవడ' మంటూ లేకుండా.

రాధ చిట్టిని ఎత్తుగుని కబుర్లు చెబుతూ ఆడిస్తోంది. అంతకన్నా ఎక్కువే ఆ రెండు హృదయాలూ లిపీ, భాషాలేని మూగబాధలతో ఏమిటేమిటో చెప్పుకుంటున్నాయ్. చిట్టి రాధ పచ్చటికంఠానికి, ఆమె పెద్ద కోడెత్రాచులాటి జడని చుట్టేసి, ఆ కంఠాన్ని గట్టిగా కావిలించుకుంది. రాధ పెదాలు చిట్టిబుగ్గల్ని స్పృశిస్తున్నాయ్. చంద్రుణ్ని రాహువు పెనవేసుకున్నట్టు జడ—మాధవిలత సుకుమారంగా అల్లుకుపోయినట్టు 'చిట్టి'. మధుకి యీ విచిత్ర సౌందర్యం, యీ అన్యోన్య మమకారం వ్యాఖ్యానంలేని ఒక కఠినపద్యంలా, పరిష్కారం కనిపించని ఒక చిక్కుసమస్యలా మిగిలిపోయాయి. సృష్టిని 'నీ విశ్వరూపం చూపించవ్?' అని అడిగితే ఆమె నవ్వేసి ఊరుకున్నట్టుంది.

హేమ జడవేసుగోడం ముగించుకునివచ్చి చిట్టికి స్నానం చేయించడానికి తీసుకువెళుతోంది. మధు గుడ్డలు మార్చుకుని వచ్చాడు.

"అమ్మపిన్నే! నాకు నీళ్లు పొయ్యాలి. చూడు అమ్మపిన్నీ", అంటూ హాఠం వేసింది చిట్టి.

"అమ్మపిన్నిని చూడ్డానికిముందు నాచేత నీళ్ళు పోయించుగోలేదూ? ఎప్పుడూ 'అమ్మపిన్నీ', 'అమ్మపిన్నీ' అని తెగగోలచేస్తావ్. మాట వినకపోతే ఇవాళే ఇక్కణ్నించి బయల్దేరడం." బలవంతంగా 'చిట్టి'ని పొదివి పట్టుకుంది హేమ. తల్లిననే అధికారాన్ని తను నిరూపించుకోడంలో శక్తులన్నీ కలిసి పెనుగులాడుతున్నాయి ఆమె ప్రయత్నాల్లో. దాంతో చిట్టి మరీ రెచ్చిపోయింది.

"ఒద్దు. అమ్మపిన్ని దగ్గిరే ఉండిపోదాం" అని ఏడుస్తూ తల్లి కాళ్ళని చుట్టేసుకుంది. హేమ ఉద్రేకాన్ని అగుపులోకి పెట్టుగోలేకపోయింది. టపటప లెంపకాయలు వాయించేసింది. చెవులు రెండూ పట్టుకుని గుంజేసింది. అందమైన బాబ్‌డ్ హేరంతా లంకించుకుని వంగదీసి వీపుమీద గుద్దేసింది. రాధ గబగబ వెళ్ళి చిట్టిని దగరకిలాక్కుని, ఎత్తుకుని బిగువుగా గుండెలకు ఒత్తుకుంది. సృష్టిపడే ప్రసవవేదన ఆమె నాడిలో స్పందిస్తోంది.



ఆలోచనాలోచన

చిత్రం: చక్రవర్తుల వెంకటనారాయణ
-పార్వతీపురం.

హేమ మొహం కోపంతో జేవురించుకుపోయింది—అస్తమిస్తున్న సూర్యుడి వెంపు ఆకాశంలాగ.

సానుభూతిచూపే వ్యక్తి కనపడ్డంతో, చిట్టిలో భాషలేని దుఃఖం చెలియలికట్ట దాటిపోయింది. రాధ కళ్ళొత్తుగుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఈ వ్యక్తులూ, విచిత్రమైన అసూయలూ కోపాలూ, దుఃఖాలూ, జాలీ, సానుభూతీ చూస్తూ ఆలోచనలోపడ్డాడు మధు. ప్రపంచంలో తనకింకా అర్థంకానిది ఒక్కటే—అది 'మానవస్వభావాలు'.

'ఎన్ని సంఘర్షణలైనా, అంతకుమునుపు ఏమీ జరగనట్టే స్త్రీలు మళ్ళీ యథాప్రకారంగా కలుసుకుపోతారు' అనుకుంటూ వీధితలుపు తీసుకుని బయటపడ్డాడు.

* * *

రాత్రి భోజనాలయాక అందరూ బయట గుడ్డివెన్నెట్లో కూచున్నారు. సాయంత్రం వచ్చిన తుఫాను వెలిసి ప్రశాంతంగా ఉందనుకుంటూ పచార్లు చేస్తున్నాడు మధు. చిట్టి 'అమ్మపిన్ని' ఒళ్లో ముడుచుకుని పడుకుని రాధ జడకోసలు కొస్నెపు మీసాలు లా చుట్టుకుంది. కొస్సేపు తనలో తను మాట్లాడుకోవడం, కూనిరాగాలు తియ్యడం సాగించింది. హేమ 'కేన్ సోఫా'లో విశ్రాంతిగా కూచుని తాంబూలం వేసుకుంటోంది.

"బావకూడ ఒచ్చివుంటే ఎంతో బావుండేదే అక్కాయ్" అంది రాధ-ఎంత బావుండేదో ఆలోచిస్తూ.

"ఎక్కడ తీరికుంటుందమ్మా? పనితో ఊపిరి తిరగదు. ఏవయ్యా ప్రొఫెసర్, ఈ దిక్కుమాలిన బడిపంతులు పనిమానేసి వేరే ఏదేనా చూసుగోకూడదూ? ఎంతకాలమని ఉన్నచోటే ఉంటం?"

రెండువజ్రాలికి విలువకట్టి భేదాన్ని పరీక్షించేవజ్రాలవర్తకుడిమున సత్యం అందులో కనిపించి మధుబాధపడ్డాడు. వ్యక్తినిజంగా జీవించే వ్యక్తిత్వానికీ, అబద్ధంగా జీవించే ఉద్యోగ జీవితానికీ ముడిపెట్టి ఆ వ్యక్తి విలువనికొలిచి చూస్తుంది సంఘం!.

రాధ నిట్టూర్చింది.

"ఏమిటోనమ్మా ఏం చేస్తాం? అందరూ ఇంజినీర్లే కాలేరు. అందరూ హేమఒదిన్లూ కాలేరు. అర్హతవున్నవాళ్లని అదృష్టం వరించదు. అదృష్టం వరించిన వాళ్ళకి అర్హతవుండదు" అనేసితనమాటల్లోఎక్కడో వ్యంగ్యం దాక్కుని ఉందనుకున్నాడు.

"అయ్యోరాత. ఎంతసేపూ యీ మిట్ట వేదాంతమేనే!—పోని బావ ఏదేనాచూస్తా

లేమో!" రాధ అమాయకంగా అడిగింది.

మధు ఫక్కుని నవ్వేడు.

"ఏమిటది రాధా! మనింట్లో అతిథిగా వున్నందుకు కోరే ప్రత్యుపకారమా! బావుందికదూ! మాటాడ్డం చేతకాకపోతే ఊరుకోవాలిగాని"—.

"పోన్లెండి. అయినా మీతో ఎవరూ అనేదులెండి." అంది రాధ బుంగమూతి పెట్టి. మసకవెన్నెట్లో ఆమె బుగ్గలమీద కన్నీటిచార అతను చూశాడు.

హేమ కళ్ళజోడు తీసేసి, పమిటి కొంగుతో కళ్ళు తుడుచుగుంది. దంపతుల మధ్య కలహానికి తను నారదుడైనట్టు గ్రహించడానికి ఆట్టేసేపు పట్టలేదు.

ఇందాకా తను వ్యంగ్యంగా అన్నమాటకి హేమ నొచ్చుగుందేమోనని మధు పశ్చాత్తాపపడ్డాడు. దాని విరుగుడుకోసం ఆలోచిస్తూ.

"ఒదినా! ఆయన్ని కూడా తీసుకురానందుకు నీకు విధించే శిక్షేవిటో తెలుసా? నువ్విక్కడే ఉండిపోవాలి. అప్పుడాయనే నిన్ను వెదుక్కుంటూ యిక్కడికి ఒస్తారు. అలాగేనా మీ దంపతులు పిల్లలతో యిక్కడ వుండడం జరుగుతుంది."

"బావుంది. పూర్వం నలుణ్ని వెతుక్కుంటూ దమయంతి బయల్దేరినట్టు ఇప్పుడు నాకోసం ఆయన!" మనస్ఫూర్తిగా విరగబడి నవ్వింది హేమ. రాధకూడా యిందాకటి గాయాన్ని మరిచిపోయి నిర్మొహమాటంగా నవ్వేసింది. హేమ తృప్తికోసం మధు చాలాసేపు దాకా నవ్వు ఆపలేదు.

"అసలు నేను రావల్సిన సమయంకాదు బాబూ! ఆయన తరఫు చుట్టాల్లో ఒక అమ్మాయి పెళ్ళికి ఆయనకూడా రాలేక నన్ను పంపించారు. మళ్ళీ ఖిలాయీవెళుతూ తోవలో నేకదా, మీఅందర్నీ చూద్దామని దిగాం.

"మాసినెళ్లడం కొదమ్మోయ్. మరి నాలుగురోజులు యిక్కడేవుండి యీ బీద భక్తులు ప్రేమలో సమర్పించే పత్రం, పుష్పం, ఫలం, తోయం స్వీకరించి మరీ వెళ్ళాలి."

"అబ్బ! పేద్ద! ఎల్లాగతేనేం నాలుగు రోజులుండమన్నారు." అంది రాధ.

"బావుందర్రా మీ కీచులాట! అయినా ఉండదల్చుకున్న వ్యక్తి సమ్మతం మీదగాని ఏ నిర్ణయం జరగదుకదా!"

"పోన్లేవే అక్కోయ్. కాని చిట్టిని మాత్రం ఒదిలేసి వెళ్ళు."

"అబ్బ. ఎక్కడా ఒక్క ఆకేనా కదలడంలేదు బాబూ." జడ విప్పేసి ముడి చుట్టుగుంది హేమ.

"జవాబు చెప్పవేంవే? ఇష్టంలేదా ఏవిటి?"

"చిట్టిని ఒదిలిపెట్టి నేను వెళ్ళడంకన్నా నువ్వే మాతో ఒచ్చెయ్యకూడదూ?" ఈ ప్రసక్తి తేవడం యిష్టంలేనట్టు కంఠధ్వనిలో వ్యక్తమౌతోంది.

"బావుందే. అక్కడికదా అని ఆశపడ్డందుకు ఇదిటే నీ జవాబూ? పోనీ అచ్చంగా ఒద్దులే. కొన్ని రోజులు అట్టే పెట్టుగుని మళ్ళీ నీ కూతుర్ని నీకే పదిలంగా ఒప్పచెబుతాలేవే తల్లీ!" ప్రవాహంలో సుడిగుండంలోకి జారిపోతూ, మధ్యలో చేతికి తగిలే చెట్టుకొమ్మ, గడ్డిపోచో ఆశగా పట్టుగోడానికి చేసే ప్రయత్నం ఆమె గొంతులో గమనించాడు మధు! 'హేమ ఒక పర్వత శిఖరం, రాధ ఒక అగాథం' అనే సత్యం ఎంతనిజం! మొత్తానికి ఈ విరుద్ధశక్తుల సంఘర్షణకి తను ప్రేక్షకుడైనందుకు లోలోపల తమాషాగానే ఉన్నా, సంఘర్షణ ఎవరి మనస్సుల్లో అశాంతిని రేపుతుందో అని భయంగానేవుంది. పిల్లలంటే ప్రాణమిచ్చే స్త్రీ మరో స్త్రీని ప్రాధేయపడ్డం తన ఆత్మాభిమానాన్ని త్యాగం చేసుగోడం! అందులో, శాంతని చిట్టిలో చూసుగుంటూ మళ్ళీ జీవించడం ప్రారంభిస్తోంది రాధ. ఈ స్వల్పకాలంలోనే యిద్దరికీ మమకారం ఒక లతలాగ అల్లుకుపోయింది. ఆధారాన్ని తీసేస్తే లత నిలవలేనట్టు, ఆ ఆలంబనాన్ని తీసెయ్యొద్దని జాలిగా మొరపెట్టుగుంటూ కాళ్ళని పెనవేసుగుంటోంది యీ మమకారం! రాధ కోరే హక్కు హేతువాదాన్ని మించిపోయింది. కాని మాతృత్వంలోని 'కడుపు తీపి' ననుభవించిన ఈ రాధే తన స్థానంలో నిలబడి అడిగే హేమకో, మరో స్త్రీకో తన కూతుర్ని యివ్వగలదా? దానికి వచ్చే జవాబు హేమ ప్రవర్తనే! పోతే, ఎంత తోబుట్టువైనా చిట్టిని రాధకి ఒప్పజెప్పడం మాతృత్వానికి అసాధ్యమైన త్యాగం కనక హేమలో నేరంలేదు. చిట్టి ఎంతో అమాయకంగా, పసి హృదయంతో రాధని ప్రేమించడం మరో స్త్రీలో కన్నతల్లిని మాడ్డం, తనను తృణీకరించడం కొబట్టి తను చూసి సహించలేక పోతోంది. ఇదీ ఆమె దౌర్బల్యం. ఈ లత పెరిగి పెద్దదైతే చెట్టునుంచి విడదియ్యడమే అసాధ్యం.



"నవ్వుతూనే వున్నామయ్యా మహానుభావా; దబ్బున తియ్యి!"

విడదీసినా అది మనసు దక్కదు కూడా హేమకి ఈ ఆలోచన ఉండడం సహజమని రాధ గ్రహించి తన కోరికని చంపుగోలేదు. పోనీ, రాధ చెప్పినట్టు కనీసం కొంత కాలమైనా చిట్టిని ఒడిచిపెట్టగల త్యాగమైనా హేమ చెయ్యలేదు! ఇద్దరూ యీ సంఘర్షణలో పడి కొట్టుగుంటున్నారు.


మధు ఆలోచిస్తున్నాడు. చూస్తున్నాడు. ఈ ఆలోచనకి, తను చూస్తున్నదానికీ సమన్వయం కుదురుతోంది.

"చలిగాలిలో పడుకుంటే జబ్బు చేస్తుందమ్మ. లోపల పడుకుందూగాని," అని చిట్టిని లేవనెత్తుగుని బరువుగా అడుగులేసుగుంటూ రాధ లోపలికి వెళ్ళింది. మాగన్ను వేసిన ఒదినగార్ని లేపి మధు లోపలికి వెళ్ళాడు.

*　　*　　*


ఆ సాయంత్రానికి హేమ ప్రయాణం పెట్టుగుంది. హేమనిశ్చయాన్ని మార్చడం అసాధ్యమని తెలిసినా, ఆమెను మరోరోజు

(52-వ పేజీ చూడండి)



భద్రాద్రిలో సీతారాముల కల్యాణం

(పి. వి. ఆర్. శర్మ)



(1) కల్యాణోత్సవం అయినతర్వాత వేదికపై సీతారాములు.

(2) సీతారాముల ఆభరణాలు: రవ్వల పతకం, బిళ్ళల మొలత్రాడు, మంగళసూత్రాలు వగైరా.

సామాన్యంగా కల్యాణ మహోత్సవమంటే సర్వ జనులకు ఆనందదాయకంగా వుంటుంది. అందులోను లోకోత్తములు, అవతారమూర్తులు అయిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవవైభవాన్ని చూసేవారి ఆనందానికి అవధి వుంటుందా? అట్టి పుణ్య దంపతుల కల్యాణోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర దేశం నలుమూలలనుంచి, ఇతర ప్రాంతాలనుంచి ఈఏడాదిగూడా వేలకొలదీ భక్తులు శ్రీ రామనవమికి భద్రాచలం వచ్చారు. భక్తులకు ఎండబాధ తగులకుండా నదిలో ప్రవాహం వున్న కొద్దిమేర వదిలేసి ఇసక వున్నచోట దాదాపు ఒక మైలుపొడవు పందిరి వేశారు. భద్రగిరిపైన, కల్యాణ మండపంలోను, మండపంక్రిందగూడా విశాలమైన పందిళ్లు వేసి చక్కగా అలంకరించారు. కొండపైన, కొండక్రింద మండపంలోను గూడా మామిడి తోరణాలు కట్టారు.

భక్త బృందాలు: ఎదుర్కోలు ఉత్సవం

మారుమూల గ్రామాలనుంచీ గూడా భక్త బృందాలు భజన చేసుకుంటూ, "హరిలో రంగ హరీ", "భద్రాచలవాస గోవిందో హరి" "తక్కువేమి మనకు రాముండొక్కడుండువరకు", "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి" అని భగవన్నామ సంకీర్తనం చేసుకుంటూ శ్రీరామనవమికి ఒకరోజు ముందుగా చేరుకున్నారు. అష్టమినాడు రాత్రి తాతగుడికి కొంచెం ఇవతలగా ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. సీతారామ లక్ష్మణులు ఊరేగింపుతో అక్కడే వేంచేశారు. జనక మహారాజు పక్షంవారు, దశరథ మహారాజు పక్షంవారు, ఆడపెళ్లి వారు, మగపెళ్లి వారు ఉభయపక్షాలవారు కలుసుకున్నారు. ఉభయ చక్రవర్తుల వంశగౌరవాలను, ఉభయుల సంప్రదాయ మర్యాదలను, గొప్పతనాన్ని పురోహితులు ఏకరువు పెట్టి రెండు కుటుంబాలు వియ్యం పొందవలసిన నిశ్చయాన్ని ఖరారు చేశారు. సీతారాములకు, ప్రభుత్వ పక్షాన దేవాదాయ కమిషనరు శ్రీ పైడి లక్ష్మయ్య నూత్న వస్త్రాలు సమర్పించారు. అక్కడ చేరిన జనసమూహాలు సీతారాములకు యథాశక్తిన కట్నాలు చదివించారు. అనంతరం స్వామి గరుడ వాహనంపై గిరిపైకి వేంచేశారు.

శ్రీ రామనవమినాడు ఉదయం నిత్యార్చనలు జరిగాక శ్రీరామచంద్రమూర్తి సీతా లక్ష్మణ సమేతుడై ఊరేగింపుతో కల్యాణ మండపం వరకు బయలుదేరారు. మార్గమధ్యములో భక్తులు హారతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఉదయంనుంచే రు 10/- 5/- చెల్లించిన భక్తులు వరుసగా మండపంలో ముందు స్థానాల్లో కూర్చున్నారు. గోసవీడు బృందం కమ్మని మంగళవాయిద్య గీతం వినిపించారు. గుంటూరు శ్రీ రామనామ క్షేత్రం వారు, బందరు సాంబమూర్తి బృందం వారు రామనామ సంకీర్తనం చేశారు. స్వామి కల్యాణ వేదికపైకి వేంచేసేసరికి భక్తుల జయధ్వానాలు మిన్నుముట్టినయి. విష్వక్సేనుని పూజించి భక్తులకు అక్షతలు పంచిపెట్టారు. పౌరాణికులు శ్రీ సీతాకల్యాణ ఘట్టాన్ని వాల్మీకి రామాయణంనుంచి వినిపించారు.

కల్యాణ ఘట్టం

"ఇయం సీతా మమ సుతా, సహధర్మచరీ తవ, ప్రతీచ్ఛ చైనాం భద్రంతే, పాణిం గృహ్ణీష్వ పాణినాం" "పతివ్రతాం మహాభాగా, ఛాయే వానుగతా సదా, ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా, మంత్రపూజతలం తగా."

ఈశ్లోకాలను భద్రాచలక్షేత్ర కళ్యాణ మండపంలో అర్చకులు పఠిస్తూ ఉండగా, వేదపండితులు వేదపఠనం చేస్తూండగా, జనకమహారాజు శ్రీ రామచంద్రమూర్తికి సీతామహాసాధ్విని కన్యధార పోశాడు.

మాంగళ్యధారణ: తలంబ్రాలు

అంతకుముందు వధూవరులిద్దరికీ కంకణ ధారణ జరిగింది. శ్రీ రామునికి యజ్ఞోపవీత ధారణ, సీతమ్మవారికి మోకుబంధం చేశారు. శ్రీరామునిచే మాంగళ్యపూజ చేయించారు. భక్తులు పవిత్రమైన ఆ మంగళసూత్రాలను చేత్తో తాకి కళ్లకు అద్దుకున్నారు సీతారాములచే జీలకర్ర బెల్లం ఒకరి శిరస్సుపై మరొకరిచే పెట్టించారు. శ్రీరాముడు సీతాసాధ్వికి మాంగళ్య ధారణ చేశారు. నూతన దంపతులకు భక్తులు మధుపర్కాలు కట్నాలు చదివించారు. సీతారాములను ఒకరికొకరిని ఎదురుగా

కూర్చోబెట్టి తలంబ్రాలు పోయించుకొని బుక్కా చల్లించారు. ఆ సమయంలో మేఘుడు పుష్పవృష్టి కురిపించాడు. ఆ పవిత్ర మూర్తుల తలంబ్రాలను నెత్తిమీద వేసుకునేందుకు భక్తులు అహమహమిక చూపారు. ఆ వస్తీల నాపడానికి రక్షకభటులు కొంచెం దండాన్ని చూపించారు. దొరికిన తలంబ్రాలతో యాత్రికులు గృహోన్ముఖులయ్యారు.

కట్నాల చదివింపులు


స్వామివారికి ఈ ఏడాది వచ్చిన కట్నాల్లో ముఖ్యంగా చెప్పదగినది రామభక్త గెంటాల నాంచారి రావు సమర్పించిన బంగారుపళ్ళెం. అది వేల రూ||లు విలువ చేస్తుంది. రామదాసు చేయించిన పంచపాత్రలను ఈ పళ్ళెంలో అమర్చారు. దేవాదాయ కమిషనరు శ్రీ లక్ష్మయ్య రు. 116 చదివించారు. సీతారాములకు బంగారు కిరీటాలు ఉన్నాయనీ, వచ్చే కల్యాణం లోపల లక్ష్మణుడికికూడా బంగారుకిరీటం లేని వెలితి తీర్చాలనీ, లక్ష్మయ్య ఈ కల్యాణ సమయంలో సంకల్పించారు. స్వామివారి గోపుర ప్రాకారాదులు బాగుచేయడానికి యాత్రికులకు అధిక సౌకర్యాలు చేయడానికి భక్తులకు విరాళాలు అధికంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేయబడినది. కొత్తగూడెం వాస్తవ్యులు శ్రీ సచ్చిదానందకేశవనర్గుండకర్ కల్యాణోత్సవం జరిపించి, ఇదివరకు ప్రభువులకే ఉండిన అధికారాన్ని ఈ ఏడాదినుంచి ప్రజలకు గూడా దఖలుపరచుకున్న గౌరవాన్ని సంపాదించారు. ఒక భక్తుడు ఒక ఎకరం భూమి స్వామికిచ్చారు. బంగారు ఆభరణాలు కొందరు చదివించారు.

యాత్రికులకు వసతులు

యాత్రికులకు కొత్తగూడెంనుంచి గుమ్మూరుదాకా బస్సులు తగినన్ని వేశారు. గాని గోదావరి దాటటానికి తగినన్ని పడవలు వెయ్యలేదు. ఇకముందు పడవలు ఎక్కువ వెయ్యాలి. అయిదు నయాపైసలు దాటటానికి రావు రేవుకేవు కంట్రాక్టర్లు చీటిపై వేసి నాల్గణాలు వసూలుచేశారని ఆక్షేపణలు వచ్చాయి. వచ్చేఏడాదికి హైదరాబాదు రాజధానీనగరంనుంచీ, బెజవాడ, ఏలూరు, కొవ్వూరు, ఖమ్మం, ఓరుగల్లులనుంచి భద్రాద్రికి సరాసరి బస్సులువేస్తే బాగుంటుంది. శ్రీశైలం, తిరుపతిల్లోవలె భద్రాచల శ్రీరామచంద్రమూర్తివారి దేవస్థానం బస్సుసర్వీసు ఒకటి ప్రారంభించవచ్చు. భద్రాచలంనుంచి పర్ణశాలకు, ఉష్ణగుండాలకుగూడా దేవస్థానం బస్సులు నడపవచ్చు.

సత్రాలు

భద్రాచలంలో దాదాపు పన్నెండు సత్రాలు ఉన్నాయి. అందులో కొద్ది



సీతారాముల కల్యాణ విగ్రహాలు.

వాటిలో భోజనాలు, మిగతా వాటిలో వసతిసౌకర్యాలుమాత్రం ఉన్నాయి. వీటిలో కొన్ని సక్రమంగా పనిచెయ్యడంలేదు. ఉత్సవాల్లో వేసేపాకలు ఇంకా వృద్ధిచెయ్యాలి. దేవస్థానంవారే భక్తుల విరాళాలతో ఒక వందగదుల సత్రం ఒకటి కట్టాలి. తిరుపతిలోవలె చిన్నచిన్న విశ్రాంతి మందిరాలుగూడా కట్టవచ్చు. కల్యాణ మండపం దగ్గిర చలువపందిళ్లు ఇంకా విస్తృతంగా వెయ్యాలి.

జీర్ణోద్ధరణ కార్యక్రమం

తమ్ములదమ్మకు, రామదాసు, సింగరిదాసు, నరసింహదాసు, వరద రామదాసు మున్నగు భక్తులు భద్రాచల రాముడికి యథాశక్తిన కైంకర్యాలు చేశారు. ఇప్పుడు మళ్ళీ గోపుర ప్రాకారాదులనిర్మాణం యాత్రికులకు వసతి సౌకర్యాలఏర్పాటు జీర్ణోద్ధారణ కార్యక్రమం ప్రారంభమైంది. 25 వేల రూపాయలువసూలైనాయి. ఆలయానికి కొత్తశోభ వచ్చింది. భక్తులైనవారు విరివిగా ఈ కార్యక్రమానికి విరాళాలిచ్చి ఈ కార్యక్రమం శరవేగంతో నెరవేరేట్టు చెయ్యాలి. ఒక్క రామదాసు ఆరులక్షల రు|| లు వెచ్చిస్తే ముక్కోటిమంది రామభక్తులైన ఆంధ్రులు పదిలక్షల రూ|| లైనా ఈ జీర్ణోద్ధారణ కార్యక్రమానికి ఇచ్చి తోడ్పడలేరా?

పూర్వం రామదాసు భద్రాద్రిలో నివసిస్తూ వుండిన యిల్లు ఇప్పుడు శిథిలావస్థలోనే వున్నదనవచ్చు. ఆ యింటిని ప్రభుత్వము వారు సేకరించి బాగు చేయించి యాత్రాస్థలముగా చేయాలి. రామదాసు ప్రతిష్ఠించిన శ్రీ రామలింగేశ్వరాలయం, కాశీ విశ్వనాథుని గుళ్ళస్థితి కూడా బాగాలేదు. వాటిని కూడా బాగు చేయించాలి. తరువాత తాతగుడిలో కొన్ని దూలాలు కూలేస్థితిలో వున్నాయి. అవి కూడా మరమ్మతు చేయించి గుడిఆవరణ పరిశుభ్రంగావుంచాలి.

భద్రాద్రి సీతారామ లక్ష్మణుల మూలవిరాట్టుల ఉత్సవరుల ఛాయాచిత్రపటాలు, రామమాడలు దేవస్థానము వారే తయారుచేయిస్తే దేవస్థానానికి తగు ఆదాయము రాగలదు. రామదాసు చరిత్ర, కీర్తనలుకూడ దేవస్థానంవారు ప్రచురించాలి. దేవస్థానం పరిపాలకోద్యోగి శ్రీ కొండపల్లి రామచంద్రరావు ఆంధ్రపత్రికలో ప్రచురించిన భద్రాచల క్షేత్ర చరిత్ర ప్రతులు అయిపోయినందున దేవస్థానం వారే ఆ పుస్తకాన్ని త్వరలో అచ్చువేయించి ప్రచురిస్తే బావుంటుంది ★

మరిది తెచ్చిన మార్పు

కొత్తపేట

చి॥ సౌ॥ చెల్లెలు కాంతమ్

అక్క ఆశీర్వదించి వ్రాయునది.

నీ ఉత్తరం అంది నాలుగు రోజులయింది. అప్పటినుంచి జవాబు వ్రాద్దామనుకుంటూనే వున్నాను, కాని నేటివరకూ తీరుబడి కాలేదు. మీ బదిలీ ప్రయాణం క్షేమంగా జరిగిందని తెలుసుకొని సంతోషించేను. పెనుగొండ నీళ్లు నీకు కొత్త చేస్తాయేమోనని భయపడ్డాను. కాని మీరంతా కులాసాగా ఉన్నారని చదువుకొని ఆనందించేను. నన్నొకసారి చూడ్డానికి రమ్మనమని వ్రాశేవు. అక్కడ మీకింకా స్థిరపడ్డానికి కొన్నాళ్లు పట్టుతుంది కదా. ఈ లోపులో మా పిల్లల పరీక్షలు కూడా పూర్తవుతాయి. అప్పుడు తప్పక వస్తాను.


మీ ఆయన మమ్మల్ని మరచిపోకుండా ఈ ఆహ్వానం పంపినందుకు సంతోషించేమని చెప్పు. మరీ మరీ అడిగేనని కూడా చెప్పు. కొత్త ఊళ్లో ఉద్యోగాన్ని గురించి ఆతనేమంటున్నారు? ఆ వూరి విశేషాలు కూడా వ్రాయి.


బుజ్జాయికి నా ఆశీర్వచనాలు. అన్నప్రాశన ఎప్పుడు చేస్తారు? వాడికెన్ని నెల్లు వచ్చాయి? మా చిట్టి కిప్పుడే పళ్లు



వస్తున్నాయి. బోసి నోట్లో వియ్యపు గింజల్లాగ కొద్దిగా కనిపి స్తున్నాయి. అది చేసే అల్లరి ఇంతా అంతా కాదు. అందర్నీ నోట్లో వేలుపెట్టమని మారాము చేస్తుంది. మొన్న మా మరిది కాలేజీ సెలవులకి ఇంటికి వచ్చినప్పుడిల్లానే వేధించుకు తింది. 'మేము వద్దంటున్నా వినకుండా అతను నోట్లో వేలుపెట్టే టప్పటికి మామూలు ప్రకారం కటుక్కున నొక్కింది అసలే విసుగు మనిషి, అతనే మంటాడో అని మేం భయపడ్డాం. కాని అత నెంతగా మారిపోయాడో. ఎంత విజ్ఞానవంతుడయ్యాడో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది నీకు తెలుసుకదా, ఎప్పుడూ పెంకితనంగా చిరాకుగా ఎల్లా వుండేవాడో! ఇప్పుడంతావేరు. చిట్టిని ఒళ్లో కూర్చోబెట్టుకొని బోలెడంత సేపు ఆటలాడేడు. చిట్టికి ఆహారంలో తగినన్ని విటమినులు లభించడం లేదనీ పెరుగుదల రోజులలో విటమినులు శరీరానికి ప్రత్యేకించి అవసరమనీ అన్నాడు "ఇంకా పట్టా పుచ్చుకోవడానికి ఏడాది వుండగానే డాక్టరులాగ మాట్లాడకోయ్" అని నేను వేళాకోళం చేసేను.

మరునాడు నాకు కొంచెం నుస్తీగావుంది వంట చెయ్యలేక పోయాను. మీ బావగారు హోటలు భోజనం తెప్పించమని తమ్ముడికి పురమాయించేరు. "నేనుండగా హోటలు భోజనమా?" అంటూ అతను వంటకి పూనుకొన్నాడు. పట్నంలో భోజనం





పడక అతనూ కొందరు కాలేజీ కుర్రాళ్లూ కలసి "మెస్" ఏర్పాటు చేసుకొని వాళ్లకు కావలసిన వంటకాలు కావలసినట్లు చేసు కొంటున్నారట.

షర్బీదు బాగానే అయ్యేదేమో, వాళ్ల అన్నగారు అతని వంటని ఒకటే మెచ్చుకోవడం.

మర్నాడు మా మరిది వంటింట్లో నా దగ్గరే వుండి వంటలో తాను అనుభవం మీద నేర్చుకున్న అనేక విషయాలు చెప్పేడు. నాకు చాలా చిన్నతనం వేసింది. చెప్పొద్దూ! మరిది చెప్పడం, నేనలా చేస్తూండడం, మీ బావగారు మధ్య మధ్య నన్ను వేళాకోళం మాటలంటూండడం! — అల్లా నడిచిందా వేళ వంటింటి వ్యవహారం. అతను ప్రతిదానికి 'డాల్డా' వాడడం చూస్తే నాకుమల్లే మా వారికీ ఆశ్చర్యం వేసింది. మా ఇంట్లో అంతవరకూ 'డాల్డా' పిండి వంటలకి మాత్రమే వాడే వాళ్లం. మా మరిది, మన రోజూ ఆహారంలో తగినంతగా పోషక పదార్థాలుండాలనీ, 'డాల్డా' శరీరారోగ్యానికి అవసరమైన పోషక పదార్థమే కాక దానిలో చేసిన వంటకా లెంతో స్వాదిష్టంగా వుంటాయనీ చెప్పేడు, ప్రతి ఔన్సు 'డాల్డా'లోనూ 700 అంతర్జాతీయ యూనిట్ల విటమిన్ 'ఎ' 56 అంతర్జాతీయ యూనిట్ల విటమిన్ 'డి' కలుపుతారనీ అందుచేత 'డాల్డా' వంట నూనెల కంటె శ్రేష్ఠమని అన్నాడు. అటువంటి 'డాల్డా' పిండివంటలకే గాక నిత్యకృత్యాలలో వంటలన్నిటికీ మహారాజులాగ వాడుకో వచ్చునని తన అనుభవం అని కూడా చెప్పేడు.

ఆహారాన్నీ, శరీర పోషణనీ, బిడ్డల పెంపకాన్నీ, గురించి కూడా బోలెడు విషయాలు చెప్పేడు. అన్నీ తెలిసియున్న మనిషి డాక్టరులాగ మాట్లాడేడంటే ఆశ్చర్యమేముంది? "ఏడాది ఆగక్కర్లేకుండానే నీకు డాక్టర్ పదవి ఇచ్చెయ్యొచ్చునోయ్" అన్నాను నేను.

ఈ సంఘటన వ్రాసేక నువ్వుకూడా రోజూ వంటలన్నిటికీ 'డాల్డా'నే వాడమని వేరే వ్రాయాలా? కాని ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో: విడిగా దొరికే వనస్పతిని 'డాల్డా' అని అమ్మజూపుతారు, జాగ్రత్త. అల్లాంటి వనస్పతిలో మురికి కలవడానికీ, ఈగలు వాలడానికీ, అవకాశం వుంటుంది. 'డాల్డా' మాత్రం పరిశుద్ధంగా సీలువేసిన డబ్బాలలో దొరకుతుంది. ఖర్జూరపు చెట్టు బొమ్మ వేసిన పసుపు పచ్చటి డబ్బాని గుర్తుంచుకో.

మా మరిది నేర్పిన కొత్త వంటకాలు ఈసారి వ్రాసి పంపు తాను. పెనుగొండ విశేషాలూ, మీ అందరి క్షేమం త్వరలో వ్రాయి,

మరి ఉంటాను!

ప్రేమతో మీ అక్క కమల

కర్నూలు కబుర్లు:

మేలుకొలుపులు

మండువేసవిలో కూడా మంచు కురిసే రాత్రిళ్ళూ, నిండుగా కనుపించే కొండారెడ్డి బురుజూ, తీయని నీళుల తుంగభద్రా స్రవంతీ, దాని ఒడ్డునే చక్కటిసాయిబాబా మందిరమూ, కడప-కర్నూలు కాలువ, దానిప్రక్కన సలక్షణ మయిన లక్ష్మీనారాయణస్వామి ఆలయమూ, అధునాతన రీతులలో గృహవసతి గల ఎ,బి,సి, క్యాంపులూ, దక్షిణభారతంలో కెల్లా మిన్నయన్న ఆసుపత్రి భవనమూ, భోగలాలసతలో ఆఖరి మెప్పనిపించే సర్కారువారి 'అతిథిభవనమూ, ఆంధ్రప్రదేశంలో కెల్లా ఒక్కటే అయిన వనస్పతి కర్మాగారమూ—ఇవి ఆకర్షణలు.

మసిపూసి మారేడుకాయచేసిన రోడ్లూ, మురికికాల్వల ప్రక్కనే ఫలహారశాలలు,

> రెండు బొద్దింకలు మురికిగుంట దగ్గర కూచుని భోంచేస్తున్నాయి. భోంచేస్తూ అతి శుభ్రంగావుండే అవతలవీధి ఇంటినిగురించి చెప్పుకుంటున్నాయి. ఒక బొద్దింక ఆ ఇంటిని వర్ణించడం మొదలెట్టింది—
>
> "అబ్బ - ఎంతశుభ్రంగా వుంటుందనుకున్నావ్ ఆ ఇల్లు. గోడలు తెల్లగా ధగధగలాడిపోతూవుంటాయి. గచ్చు తళతళలాడిపోతూ వుంటుంది. వంటిల్లు ఇహ చెప్పనే అక్కర్లేదు. పాత్రలన్నీ అప్పటికప్పుడు కొట్లోంచి తెచ్చినట్టుంటాయి. ఇహ ఆ అలమారాలు—"
>
> రెండో బొద్దింక అడ్డు తగిలింది. "నీకు పుణ్యముంటుంది- బాబ్బాబు - భోంచేస్తున్నపుడు అలాంటి విషయాలు మాట్లాడకు—"

జమీందారుల్లా జబర్దస్తీ చేసే ప్రభుత్వ వైద్య సిబ్బందీ, ఏస్ కావాలంటే భాగ్యనగరం వైపూ, మంచి కాయగూరలు కావాలంటే బెంగుళూరువైపు ఎదురు చూడవలసి రావడం ఇల్లాటివెన్నో వికర్షణలు.

ఈ ఆకర్షణ వికర్షణల సంఘర్షణా రంగం కర్నూలు. 1953 సంవత్సరం అక్టోబరులో

"సౌజన్య"

ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ పీఠమయి కూచుంది. 1956 నవంబరుదాకా రాజధానీ రమతాలూకు షోడశకళలతో విరాజిల్లింది. ఆ గడచిపోయిన స్వర్ణయుగపుటాదిలో ఆంధ్ర ప్రభుత్వం వారు తమ సిబ్బంది నివసించడానికని ఆరు వందల డేరాలను, పదకొండువందల గృహాలనూ నిర్మించారు. ఆవిధంగా డేరాలనూ, గృహాలనూ నిర్మించడంతో క్రొత్త కర్నూలు ఉదయించింది; నెమ్మదిగా విస్తరించింది.

కర్నూలు మధ్యలో 'హంద్రి' నామధేయం కల్గిన రజక సంతతిపాలిట కల్పస్రవంతి ఒకటి పారుతుంది—అనడంకన్న పేరుకునివుంటుందనడం సమంజసమేమో. తెనుగువారి పౌరుషంలా వర్షాకాలంలో ఏ నాలుగు రోజులపాటో పొంగి, పొరలి హడావిడి చేసేసి మళ్ళీ సంవత్సరకాలం మారుమాటాడకుండా వుంటుంది హంద్రినది. చాకలివారు బట్టలుతుక్కోవడానికి, కావలసినవారు ఇసుకను త్రవ్వి తీసుకు వెళ్ళడానికి, వేసవిలో కర్బూజా, దోసవగైరా పళ్ళను పండించడానికి ఈ ఉపనదీగర్భ ముపయోగపడుతుంటుంది. రమారమిగా, ఈ హంద్రీనదికి ఉత్తరంవైపంతా పాతకర్నూలుగా, దక్షిణవైపంతా కొత్త కర్నూలుగా చెప్పుకోవచ్చు.

ఈసారికి కొత్త కర్నూలు కబుర్లు కొన్ని విన్నవిస్తున్నాను.

రాజధాని వచ్చినసందర్భంలో ప్రభుత్వం వారు కట్టించిన ఇళ్ళు 'ఏ' క్యాంపు, 'బి' క్యాంపు, 'సి' క్యాంపులన్న మూడు వేర్వేరు గుంపులకింద నిర్మించబడ్డాయి. పాత కర్నూలునుండి వస్తే మొదట వైద్యకళాశాల, దానిప్రక్కనే "సర్వజన వైద్యశాల" (జనరల్ ఆస్పత్రి కిది తెనుగు తర్జుమా అట!) కన్పడతాయి. ఈ వైద్యశాలకు ఎదురుగా 'ఏ' క్యాంపుంది. ఆసుపత్రికీ, ఇటీవలే ఏర్పడిన వైద్యకళాశాలకూ సంబంధించిన డాక్టర్లు, నర్సులు మొదలయిన వారికి మాత్రమే 'ఏ' క్యాంపులోని ఇళ్ళన్నీ కేటాయించారు. తదితర రాష్ట్ర కేంద్రప్రభుత్వోద్యోగులందరికీ 'బి' 'సి' క్యాంపులలో ఇళ్లు ఇచ్చారు. అంటే ఆస్పత్రిలోనూ వైద్యకళాశాలలోనూ పనిచేసేవారికి వారి పని చోటుల నుండి ఫర్లాంగు దూరంలో బసలు ఏర్పాటు చేశారు. బాగానే వుంది. కాని వైద్యసిబ్బందికి మాత్రమే అని ప్రత్యేకించబడిన ఈ 'ఏ' క్యాంపు ఇళ్లు ఒకటి రెండిటిలో కలక్టరాఫీసు గుమాస్తాలు, తదితరులు కొందరు నివసిస్తుండడం ఎలా సంభవించిందో??

'ఏ' క్యాంపుకు ఒక ఫర్లాంగు తర్వాత కడప-కర్నూలు కాలువ వుంది. దానికి దక్షిణంగా ఒక ఫర్లాంగు దూరంలో 'సి' క్యాంపు, దానినంటి పెట్టుకుని 'బి' క్యాంపు వున్నాయి. ఈ మూడు క్యాంపులలో కలిసి రమారమిగా 1100 ఇళ్ళున్నాయి. సరాసరిగా చూస్తే ఈవూరి జనాభాలో పదోవంతు అంటే దాదాపు ఏడు వేలమంది ఈ క్యాంపులలో వున్నారని చెప్పవచ్చు.

1957 ఏప్రిలులో పెద్ద గాలివానవచ్చింది. అపుడు 'ఏ' 'బి' క్యాంపులలో డేరాలన్నీ ముక్కలు ముక్కలుగా చినిగి ఎగిరిపోయి చాలమంది బుర్రలు బద్దలయి, ఒకరిద్దరు మరణించిన తర్వాత—అధికారులు నిద్రమేల్కొని అప్పటిదాకా తాళాలు వేసివున్న ఇళ్ళన్నిటిని గబగబా కేటాయించేశారు. డేరాల అధ్యాయానికి ఆవిధంగా గాలివాన భరతవాక్యం పాడింది. ఈడేరాలు ఒక్కొక్కదాని వైశాల్యం 25' × 30' వుండేది. ఈ వైశాల్యం మేరకు డేరాక్రింద సిమెంటు కాంక్రీటు చేయబడిన నేల వుండేది. డేరాలు వెళ్లిపోయి రెండేళ్ళయింది. కాని అడుగు ఎత్తుకల్గిన ఆసిమెంటు కాంక్రీటు అరుగులు మాత్రం ఈనాటికీ వందలకొలదీ అలాగే వున్నాయి. అంట్లుతోము కోడానికి మట్టి కావలసివచ్చినా, పొయ్యి ఏర్పాటు చేసుకోవడానికి రాళ్ళు కావలసివచ్చినా ఎవరికి చిత్తం వచ్చినట్లు వాళ్ళు వాటిని పగలగొడుతుంటారు. 'ఏ' 'బి' క్యాంపుల ఇళ్ళ మధ్య వున్న విశాల ప్రదేశమంతా ఈ విధంగా పాడువడిన కాంక్రీటు భాగాలతో రాతి గుట్టలతో, ముళ్ళ కంచెలతో నిండి నానాటికి జుగుప్సాకరంగా తయారవు

(53-వ పేజీ చూడండి)

ప్రేమ దాసు

అతడు పార్కులో ప్రవేశించాడు.

మామూలు ప్రకారం నాలుగువైపులా గాలిస్తూ తిరుగుతున్నాడు. పార్కు కళకళ ఛరవాలేదని అతని అంచనా. కళకళ అంటె అతని నిర్వచనం వేరు. చెట్లన్నీ చక్కటి పూలతో శోభాయమానంగా వున్నంత మాత్రాన కళకళకాదు. పిల్లలూ పెద్దలూ తప్ప తిప్పలుగావచ్చి పార్కు నేత్ర పర్వంగా వున్నంత మాత్రాన కళకళకాదు. అతని నిర్వచనంలో 'కళకళ' అంటె ఎక్కువమంది యువతులు స్వేచ్ఛగా రావడం అన్నమాట. స్వేచ్ఛగా అంటే పురుషులెవరూ తైనాతీగా వెంటలేక పోవడం అని అతని భావ్యం.

ఒకచోట బల్లమీద ఒక యువతి ఒంటరిగా కూర్చుంది. ఆమె వయస్సు ఇరవై సంవత్సరాలుండవచ్చు.

అందంగావుంది. ఇక అంగ ప్రత్యంగ వర్ణన అవసరం లేదనుకుంటాను. మరి 'అందం' అంటే అతనికేమైనా ప్రత్యేక నిర్వచనం వుందేమో నాకు బాగా తెలియదు. అయితే అందంగావున్న యువతులతో అతను పరిచయంకోసం తంటాలు పడుతుంటాడు. 'పరిచయం' అనే పదానికి కూడ అతని నిఘంటువులో వేరే అర్థం వున్నట్లు తోస్తుంది. అయినా ప్రతి పదానికి అతని నిర్వచనం ఎలా వుంటుందో చెప్పడం కష్టసాధ్యం. ఆ నిర్వచనాలు మీరే గ్రహించుకో గలగాలి.

అతని దృష్టిలో కూడా ఆమె అందకత్తె అని తెలుస్తోంది. ఎందువల్లనంటే అతడు ఆమె కూర్చున్న బల్లవైపే వెళ్తున్నాడు.

ఆమె ఒంటరిగా వున్నదని వేరే చెప్ప నవసరంలేదు. ఆమెవైపు వెళ్తున్నాడంటేనే ఆమె ఒంటరి అని అర్థం. ఆమె ఏదో మాగజీన్ చూసుకుంటోంది.

అతడు బల్ల సమీపించి 'ఎక్స్‌క్యూజ్ మి మేడం, మే ఐ సిట్ హియర్?' అని అతి వినయంగా ఆమె అనుమతి కోరారు.

ఆమె ఒక ప్రక్కకు జరిగి 'కూర్చో వచ్చు' అని ముక్తసరిగా జవాబిచ్చింది.

పార్కులో ఖాళీగావున్న బల్లలు చాలా వున్నాయి. కాని ఇక్కడ పరిస్థితులు అతనికి అనుకూలంగా వుండటంవల్లనే ఇటు వచ్చాడు.

అతడు బల్లకు ఒక ప్రక్కగా కూర్చున్నాడు. కొన్ని క్షణాలు మౌనంగా గడిచి పోయాయి.

జి. రామకృష్ణ

అతనికి ఆ సాయంకాలపు ప్రతిక్షణమూ చాలా విలువయిందే ఎలా వుపక్రమించడమా అని ఆలోచిస్తున్నాడు. ఒక నిర్ణయానికి వచ్చాడు.

'ఎక్స్‌క్యూజ్ మి మేడం, మే ఐ స్మోక్?' అని అడిగాడు రెట్టించిన వినయంతో.

ఆమె మరికొంచెం ప్రక్కగా జరిగి 'కాల్చుకోండి,' అంది.

అతను సిగరెట్టు ముట్టించాడు. విలాసంగా పొగ వదులుతున్నాడు. మూడు నాలుగు దమ్ములుపీల్చి అవతల పారేశాడు.

అప్పటికి ఆమె మాగజీన్ చూడడంపూర్తి అయింది.

ఆమెతో మాట్లాడాలని అతని తహతహ.

'మేడం! ఒకమారు అది చూడనిస్తారా?' అని చేయి చాచాడు నాటకంలో యాక్టరు మాదిరి.

ఆమె ముభావంగా మాగజీన్ అతని చేతి కిచ్చింది.

అతడు ఆమె ముఖంలోకి, కళ్ళలోకి ఒక్క చూపు చూచాడు. ఆ చూపు సుమబాణంగా పనిచేయాలని అతని వుద్దేశం. మాగజీన్ అందుకుని గబగబా బొమ్మలు చూస్తున్నాడు, క్షణాలు పరుగెత్తుతున్నందుకు

చిక్కు ప్రశ్న

హోస్టలు కెడుతూంటే సుబ్బారావుకి అప్పారావు తగిలాడు.

అప్పారావు: ఒరేయ్ ఒక చిక్కు ప్రశ్న ఇస్తా—సమాధానం చెప్పచూదాం. మా అమ్మ ఓ బిడ్డను కన్నది—అది మాఅన్నా కాదు, అక్కా కాదు, చెల్లీ కాదు, తమ్ముడూ కాదు—ఎవరు చెప్పుకో—

సుబ్బారావు:— ఏమో— నువ్వే చెప్పు.

అప్పారావు:—నేనే!

సు: హాహాహా. బలేవుంది రా. వస్తా.

సుబ్బారావు అక్కడినుంచి హోస్టలు కెళ్ళి అక్కడ ఇదే మళ్ళీ చెప్పాడు.

"ఒరేయ్ రూం మేట్లూ—ఈ చిక్కు ప్రశ్న విడదీయండి చూదాం—మాఅమ్మ ఓ బిడ్డను కన్నది. అది మా అన్నా కాదు -అక్కా కాదు - చెల్లీ కాదు తమ్ముడూ కాదు. ఎవరు చెప్పుకోండి—ఏం లాభం లేదూ— చెప్పలేరూ ?"

"మాకు తెలీటం లేదు— నువ్వే చెప్పు"

"హాహా! ఈమాత్రం తెలీదురా—అప్పారావు"

★ ప్రేమదాసు ★

అతనికి ఆవేదన ఎక్కువవుతోంది.

మధ్యలో ఒకసారి ఆమెవైపు చూచాడు. ఆమె ప్రక్కనున్న నైట్‌క్వీన్ చెట్టుకొమ్మ అందుకుని చిన్నగ త్రికోన వాసనచూస్తోంది. ఆభంగిమచూసి అతడు వికలచిత్తుడయ్యాడు. తాను కాలం వ్యర్థం చేస్తున్నట్లు చింతించాడు. మాగజినమీద దృష్టిలేదు.

ఆమెవైపు తిరిగి 'మేడం!' అని పిలిచాడు తెచ్చిపెట్టుకున్న మర్యాదతో.

ఆమె అతని వైపు చూసింది ఎందుకు పిల్చాడోనని. కాని అతడేమీ మాట్లాడలేదు. పెరిగిపోతున్న ఆశతో ఆమె నేత్రాల్లోకి చూచాడు.

అమె ప్రక్కకు తిరిగింది. నిశ్శబ్దం మరో నాలుగయిదు నిమిషాలు ప్రింగేసింది. సూర్యుడస్తమించాడు. చల్లగాలి హాయిగా వీస్తోంది.

అతనిలో ఆశలు రెపరెప కొట్టుకుంటున్నాయి.

'మేడం!' అన్నాడు మరోసారి.

ఆమె తిరిగి అతడివైపు చూసింది పిలిచిన కారణం తెలుసుకుందామని.

అతడు అదే ధోరణిలో చూస్తూ 'మేడం! ఎక్స్‌క్యూజ్ 'మి. మీ పరిచయ భాగ్యంనాకు కలుగజేస్తారా? నాపేరు మూర్తి. ఎం. ఏ. చదువుతున్నాను. మా ఫాదరు ఇండస్ట్రియలిస్టు'అని అన్నాడు పెద్ద సంస్కారంవున్న వాణ్ణే సుమా అని అర్థం వచ్చేటట్లు.

ఏమి సమాధానం ఇవ్వాలో ఆమెకుతోచలేదు. కాని తనపేరన్నా చెప్పకపోతే మర్యాదకి భంగంకదూ! అందుకని 'నాపేరు సుధ అంటారు. మెడిసిన్ చదువుతున్నాను,' అని చెప్పింది.

ఆమె పలికినందుకు అతడు సంతోషించాడు. జయానికి నాంది పలికినట్లు మురిసిపోయాడు.

'మీది ఏ వూరండి?' అని ప్రశ్నించాడు సంభాషణ సాగించడానికి.

'ఈ వూరే. మా ఫాదరు ఎడ్వకేటు' అని జవాబిచ్చింది,

సహజంగా అతడు ఆడవాళ్ళతో మాట్లాడే చొరవలో ఇప్పుడు ఆమెతో మాట్లాడలేకపోతున్నాడు. అయినా ప్రయత్న లోపం చేయడంలేగు.

'సుధగారూ!' అని పిలిచాడు. ఆమె వైపు కొంచెం జరిగి మాగజిన్ ఆమెచేతికందిచ్చాడు.

ఆమె బల్లమీదనుంచిలేచి ప్రక్కనున్న పచ్చగడ్డిమీద కూర్చుంది.

అది తనకు అపజయం సూచకమా అని ఒక క్షణం ఆలోచించాడు. అలా అయ్యేందుకు వీలు లేదని మరుక్షణంలో కృతనిశ్చయుడయ్యాడు.

రెండు మూడునిమిషాలు గడిచాయి. అతడుకూడ బల్లదిగి ఆమెకుకొంచెంఎడంగా గడ్డిమీద కూర్చున్నాడు.

'సుధగారూ! నేను మీమనస్సు నొప్పించానా, ఇక్కడకొచ్చి కూర్చున్నారు?'అని నెమ్మదిగా అడిగాడు.

'లేదు' అంది ఆమె.

తిరిగి ప్రారంభించాడు: "అదేమిటో నాకే విచిత్రంగా వుందండి. ఇతరులునాతో పరిచయం చేసుకుందామని ఎంతగా ప్రయత్నించినా నేనే విముఖంగా వుంటాను. కాని ఇవ్వాళ మిమ్మల్ని చూస్తుంటే మీతో ఎక్కువ పరిచయం చేసుకోవాలనే కోర్కె ప్రబలుతోంది.'

ఎఫెక్టు బాగా రావడానికి కొన్ని క్షణాలు విరామం వదిలి 'సుధగారూ!' అని పిలిచాడు గొంతులో తియ్యదనం మేళవించేందుకు శ్రమపడుతూ.

ఆమె అతనివంక చూడక తప్పిందికాదు.

జాలిచూపులు చూస్తూ 'నామీదకోపమా మీకు!' అని అడిగాడు.


'కోపమెందుకు? మీరెవరో నేనెవరో! అంది ఆమె ప్రశాంతంగా.

'అలా అనకండి సుధగారూ!...అబ్బ ఎంత చక్కటిపేరు. అమృతం చిలుకుతూ పలుకవలసిన మీరు అంత మానంవహిస్తూ మన పరిచయాన్ని భంగంచేయడం కోపం కాక ఏమిటి చెప్పండి' అన్నాడు.

ఆమె జవాబివ్వలేదు. తిరిగి అందుకున్నాడు: మిమ్మల్ని చూసిన తొలిక్షణంలోనే అప్రయత్నంగా మీకు వశున్ని అయిపోయాను, దాసుణ్ణిగా మారిపోయాను. కరుణించినా, కోపించినా. '

ఆమె అడ్డుతగిలి "విచిత్రధోరణిలో మాట్లాడుతున్నారే మీరు' అనడంతో అతడు ఆగాడు. తమాయించుకున్నాడు.

"సుధగారూ! మీతో పరిచయంకొద్దినిమిషాలక్రిందనే ఏర్పడినా ఎన్నో సంవత్సరాల



"బిలియర్డ్స్ ఆట"

[చిత్రకారుడు : ఎస్. వి. రామారావు. ఢిల్లి, నేషనల్ గాలరీ ఆఫ్ మోడరన్ ఆర్టువారు తీసుకున్న చిత్రం.]

పరిచయంవున్నట్లుగా వుంది. నన్ను అన్ని విధాలా లోబరచుకున్నారు. మనసులోని మాట ఒకటి నివేదించుకుంటే నాపైన ఆగ్రహిస్తారా?' అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"అసలు సంగతి అర్థంకాకుండా మాట్లాడుతున్నారు" అంది ఆమె.

తాను జయంపొందడానికి ఇదే మంచి అదను అనుకున్నాడు. అదీగాక చీకటికూడ పడింది. లైట్లువేశారు. ఆమె అక్కడనుంచి వెళ్ళిపోయే ప్రమాదంకూడవుంది. అందుకని త్వరపడుతున్నాడు.

అతడు ఆమెకు దగ్గరగా జరిగాడు.

ఆమె చేతివ్రేళ్ళను తాకుతూ 'మీ ప్రేమదాసుణ్ని కనికరించరా' అన్నాడు మెల్లగా వూపిరిబిగపెట్టి.

ఆమె తన చేతిని వెనక్కు లాక్కుంది. అవతలకు జరుగుతూ "క్షమించండి" అంది.

నైట్‌క్వీన్‌చెట్టు వుండటంవల్ల వచ్చేపోయేవాళ్ల కళ్ళలో వెంటనే పడకుండా వున్నందుకు అతడు సంతోషిస్తున్నాడు.

కాని సదవకాశం జారిపోతోందేమోనని ఆత్రుతపడుతున్నాడు. ఆమె ముఖభంగిమ వుత్సాహకరంగా లేదు. కాని అతడు నిరుత్సాహం చెందలేదు.

ఆమెకు బాగా దగ్గరగా జరిగాడు.

ఈసారి ఆమెచేతిని గట్టిగా పట్టుకున్నాడు. 'నన్నే మీరు క్షమించాలి. నాపైన కృప చూపాలి. మీ ప్రేమకు పాత్రుణ్నిగా చేయండి నన్ను'అన్నాడు ఆవేశంతో తగ్గు, స్వరంలో.

ఆమె అతినిచేతిని గట్టిగా విదిలించింది. లేచి నుంచుంది.

వానిటీబాగ్ తెరిచింది.

లోపలినుంచి చిన్న విజిల్ తీసి గట్టిగా వూదింది.

అదడు దిగ్భ్రాంతి చెందాడు. ఏమీ అర్థంకాలేదు. భయంతో కంపించాడు. పారిపోదామా అనుకున్నాడు.

అప్పటికే పార్కులో కొందరు జనంతమవైపు వస్తున్నారు. వారి వెనుకనుంచి సబ్ ఇన్‌స్పెక్టరు, కానిస్టేబిలు వస్తున్నారు. అతని మొహం వివర్ణమైపోయింది.

ఇన్‌స్పెక్టరు ఆమె దగ్గర్నుంచి విజిల్ అందుకుంటూ, 'ఎక్స్‌క్యూజిమీ మాడం ఫర్ ది ట్రబుల్' అన్నాడు.

'ఇతన్ని స్టేషనికి తీసుకుపదవోయ్' అని కానిస్టేబులుకు పురమాయించాడు.

*   *   *

ఆమర్నాడు స్థానిక పత్రికల్లో 'బాక్సు' కట్టి ప్రచురించినవార్త:'ఈమధ్యపట్నంలో యువతులను కొందరు యువకులు నానా ఇబ్బందులపాలు చేస్తున్నట్లు, వంచిస్తున్నట్లు పోలీసువారికి చాల ఫిర్యాదులు వస్తున్నాయి. రోడ్డు వెంబడిపోయే యువతులను కవ్వించడం, గుర్భావలాడడం, పార్కుల్లోగాని యితరత్రాగాని ఒంటరిగా కన్పించే యువతులవద్దచేరి అనవసరప్రసంగం చేయడం, మాయమాటలతో వారిని వలలో వేసుకోవడం జరుగుతోంది. పోలీసువారు వీటిని అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలన్ని తీసుకుంటున్నారు.

'నిన్న సాయంత్రం స్థానిక పార్కులో పోలీసువారు 'ట్రాప్' వేసి యీకోవకు చెందిన వెంకటప్పయ్య అనే పాతికేళ్ళ యువకున్ని పట్టుకున్నారు. సంక్షేమశాఖకు చెందిన ఒక వుద్యోగస్తురాలు పోలీసువారికి ఈ విషయంలో తోడ్పడింది. ఇలాంటి యువకులను పట్టుకోవడంలో ప్రజలు తమకు తోడ్పడవలసిందిగా పోలీసువారు కోరుతున్నారు.' ★



బంగారం సింగారం
బాపు బొమ్మలకథ 5
ఇదిగో అబ్బా- ఈ కబుర్లు కుదరవు- మూడు రూపాయలిస్తా- ముగ్గురూ బైస్కోపుకి పొండి!
బంగారు తండ్రి కాదూ! మూడు వందలకి తక్కువైతే, అప్పుచేసి, మీ లంకె బిందెల గురించి దండోరా వేయించేస్తా- పోలీసువాళ్ళొచ్చి అంతా లాక్కుంటారు అప్పుడు తెలుస్తుంది హెహ్హెహ్హె-హె
నాయనా- నీకూ నీ పెద్దలకి బహునమస్కారం- ఇంత- తగలడు-
వాడు- ఆ వెధవ- ఆ శనిగాడు మటుకు రాకుండా- అసలు ఊరు కదలకుండా కట్టిపడేసే పూచీ నీది- నేను అడంగె నింపి వచ్చాక నీకు నా పెరటిల్లో కాతాయిస్తాను-
ఆ సాయంకాలమే బంగారం బండి కట్టుకుని కాకినాడ రేవు వచ్చాడు- రాండో కంటికి తెలీకుండా జావా పోవాలి కాబట్టి ప్రత్యేకం ఓ స్టీమరు కిరాయికి బేరం చెయ్యబోయాడు-
జావాకి స్టీమరు కడతావోయ్- పత్తేకం? కేవెంత?
జావాకి స్టీమరు కట్టడమేటయ్యా- ఇదేం గుర్రబ్బండనుకున్నావా- ఎల్లెల్లు- అల్లదిగో ఆడున్న డొక్కు స్టీమరు తీసుకో- కేవొద్దులే-
అలాగషోయ్- పూరికే ఇస్తారూ- సర్కారువారు మంచివారా-
దీనికేం- భేషుగ్గా ఉంది!


. అయితే దారవాడూ - ఈ నౌక తమరి దేనా - దన్ని తోలేందుకు జనాన్ని కూడా ఇప్పిస్తారా?
వెయ్యి రూపాయలు కిరాయి కేఉంది - జనంసంగతి మన్కి తెలవద్ - నువ్వు లచ్చ ఇచ్చినా ఎవడూ రాడు
అయినా ఓటి పడవ - యిదే జ కెల్తదయ్యా
ఏమో! నాకళ్ళకి. నిక్షేపం లా వుంది స్మీ -
నిక్షేపం - బలే!
అంతవరకూ బంగారానికి తెలీకుండా అతన్ని వెంబ డించి. కూడా వచ్చిన సింగారం అండ్ కో ఓ పడవ చాటు నుంచి ఇదంతా చూశారు.
ఒరేయ్ - మా మావకి సరంగులు కావాలిటరోయ్! సంచితీసి గడ్డాలూ మీసాలూ తగిలించండి -
హొహొ
హుహు
హొహొహొ హా హా
వరాలూ - నువ్వేమో కెప్టెనువట - నిన్నయితే చప్పున గుర్తుపట్టడు మా మావ -
రైట్హో! పదండి
ఈ పగటి వేషాలేవిటోయ్! దేవుడోయ్!

సమర్పణ

కందుకూరి లింగరాజు

17

త్రాచా తప్పకుండా తండ్రి ఆదేశించి వచ్చే ఆస్తులపంపకం విషయంలో వసుపతి నడిచేడు. అది పైకి ఒక్క చలపతి కోరకే అన్నా ఎందుకో మనస్సు నిలబడ లేదు. ఇది నాంది. దీనివెనుకగానే అంత కాగితాలమీద లేకపోయినా, ఇక భావన అయింది రూపొందించడం తర్వాయి అన్నట్లు వ్యక్తీకరణ కనిపించింది.

ఈనాడు కాకపోయినా, మరోనాడు అయినా అవధాని పెళ్ళి పెట్టి తీరుతాడు అన్న ఊహ వ్యర్థం కాదేమో అనీ తోచింది.

కొన్ని సంవత్సరాలక్రితం...

ఈ ఇంటికి నడిపెండెం తండ్రిగారు. వారి పంచలో, ఆదేశంలో తనూ, శ్రీపతి ఉండి పోయేరు. ఎదగలేని సంసారంలో శ్యామలా, కాంతమ్మలు గడపదాటకుండా ఉండి పోయేరు. ఊళ్ళోనా!

ఆయన ప్రతికక్షి లేకుండానే చెలాయించేడు. ధర్మాలు చెప్పేడు. ఆంక్షలు విధించేడు. ఆ వంశపారంపర్యా వచ్చిన గురుత్వం త్రాసుమీదతూచి సరిదిద్దేడు.

వెర్రిగా ఒక్కొక్క పర్యాయం ఆయన తర్వాత తనేనేమో ఆ గద్దెనెక్కేది అని ఒక్కొక్క అంశం మననంచేసుకుంటూనే, పావుల్ని ఏ గడిలోవుంచాలి, శకట్లను ఎట్లా దూకించాలి, ఎప్పుడు త్రోసిరాజు, ఆటకట్లూ అనాలి అన్నవి పరవరాల్లోనూ పోసుకున్నాడు. ఆ పుంజా నిలబెట్టుకున్నాడు. అందులోని చతురతలు, మెలకువలు వల్లె వేసుకున్నాడు.

కాని,

అవన్నీకూడా ఇప్పుడు, ఈ మారిన పరిస్థితుల్లో తారుమారైనాయి. వాట్ల స్థలం ఏమిటి అనే తలంపు మనసును ఆక్రమించింది.

లోకం నడవడి, పురోగమనమే అయితే ఆ యుగాలనాటి ధర్మాలు, పన్నాలు, ఆచరణలు, అగ్రతాంబూలాలు ఇవన్నీ ఏం చెయ్యాలి? ఈ అభ్యుదయం, ఉన్నతి, ప్రతిష్ఠ ఉన్నవి. వివిధజాతుల కలయిక, పాణవిద్య, పాశ్చాత్య వ్యామోహపు వెర్రితలలే అయితే ఆ వేదాలు, ఉపనిషత్తులు కూడా చితిమీదపెట్టి దహనం చెయ్యాలి; ఖాండవదహనంలా.

ఈనాటి పరిస్థితి, ఈ జాతిసాంకర్య సంకుల సమరమూ అభ్యుదయమే అని ఒప్పుకోడానికి మనస్కరించలేదు. మనస్కరించలేదని, విప్లవం లేవతీయడానికి గుండెలు తాళటంలేదు. అది చెయ్యలేని నరాలదిగతీత వళ్ళంతా పూసుకు ఉచ్చులు పన్ని కూర్చుంది.

చరిత్ర పునరావృత్తం అవుతూఉంటుందన్న సిద్ధాంతాన్ని విన్నాడు. దాని లోతుపాతులు తనకి తెలియవు. ఆ చరిత్రలు తను తడవనేలేదు. చరిత్రే పునరావృత్తం అయితే బావుండునన్న ఆశ పెట్టుకోవడంకూడా మూర్ఖత్వంలా తట్టింది.

ఇక మిగిలింది తనకే తెలియలేదు. ఒక్క నాన్నగారి హక్కులమీదుగా ద్రష్ట అవడం కన్న.

శచి పునర్వివాహం, చలపతి వర్ణాంతర వివాహం, ఇల్లు కదలడం తెలియని కాలాలు మారి రమణమ్మ దేశసేవ, చలపతివృత్తి ధర్మం మాని ఈపదవీ వ్యామోహం శాంతి దౌర్జన్య సిద్ధాంతాల వ్యత్యాసం ఆచలపతీ అవధానుల్లో మనస్సుకలచి పారేసేయి. అయినా అవన్నీ దిగమింగుకున్నాడు.

ప్రత్యేకంగా ఓ విషయంలో మాత్రం 'తనకన్న తనతండ్రే అదృష్టవంతుడు' అని భావన. ఇవే సంఘటనలు ఆయన ఈపంచ క్రింద హాయాంచెలాయిస్తున్నప్పుడే జరిగితే ఏమైయుండును? అది ఊహాతీతంగానే వుండిపోయింది. అందుకే ఆయన వెళ్ళిపోయేడు, దూరం అయిన్నీ పోయేడు.

ఇక మిగిలింది, తనూ తనభార్య; ఒదల్లేని భ్రాతృసామ్యంలో శ్రీపతీ, కాంతమ్మలున్నా; రక్తపు సంబంధంలేని ఆరంగనాయికొను.

రంగనాయిక విషయం గుర్తుకువచ్చినప్పుడల్లా ఏదో మనస్సులో బాధకల్గేది. ఈ ఋణాను బంధం గత జన్మలోది ఈజన్మలో తీరుపోందా అనుకునేవాడు.

'కాకిచేత కబురుపంపితే వాలనూ' అని వెంకటస్వామిచేత కబురు, తన ఉత్తరం అందుకుని, ఐదు వేల రూపాయలు మూటకట్టి, "ఎంత త్వరలో వీలుపడితే అంత త్వరలోనూ అన్నగారిపాదాలు కొల్చుకుందుకు వస్తానని చెప్పు. ఇంకా డబ్బు కావలిస్తే వెనక్కు తియ్యవద్దు అనీచెప్పు. అది నాపుట్టిల్లు వెంకటస్వామీ!" అనీ చెప్పడం ఒక్కపూపు పూపేసింది. మనస్సు కుమిలిపోయింది. అనురాగం, ఆరాధనా, ప్రేమా పొంగిపోనున్నా పోయేయి.

నిర్ణీతంగా తెలుసు నాన్నగారు ఇంకా ఆరేడు నెలలవరకూ రారని. ఈలోపుగా ఇంకా ఏం అభాండాలు విరిగి మీదపడడానికి సిద్ధంగా వున్నాయోకూడా తెలియనేలేదు. అవన్నీకూడా ముసుగుల్లో వున్నట్లు నల్లటికారు మెయిళ్లలాగా మెరుస్తూనే వున్నాయి.

ఇంట్లోవున్న శ్యామల లైటు వెలిగించి, గుమ్మంలో పెడుతూనే "ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అంది.

"భావి" అన్నాడు అయాచితంగా. ఒక్క నవ్వు నవ్వింది. "భావి! ఎందుకూ?"

సమాధానం చెప్పలేకపోయేడు.

"పురాతనానికి సమాధివెయ్య కలిగితే భావినిగూర్చి ఆలోచించవచ్చు" తేల్చి బోయేడు వసుపతి.

"జీవనం చిన్నది. గమనం వేగంకలది. గతాన్ని నెమరు వేసుకోక వేగాన్ని కల్పగలిగితే రథచోదనం అంత శ్రమకాదు. అదే కావాలి ఇప్పుడు."

నెమ్మదిగా అర్థం అయ్యింది శ్లేష. కృతజ్ఞతా ఆరాధన కళ్ళలో మెరిపించుకున్నాడు.

"మామగారు మారేవుండాలే ఈపాటికి" అంది సందిగ్ధంగా.

"అవును. ఆనాటి ఈపల్లెనివాసి కాగు. ఎంతో మార్పుకల్గింది. అదే ఆశ్చర్యమూ కల్గించిందినాకు. అయినా శ్యామలా! ఆయన

మాఘతారని నీకు ఏదివ్యదృష్టేనా వుందా?" అన్నాడు వసుపతి.

'ఆయనలో గొప్పతనం అది. ఆ తేజస్సే వేరు. ఆ ప్రవృత్తేవేరు. మహావేత్త ఆయన" అనేసింది.

"అయితే నేను కాంగ్రెసులో చేరాలా, కమ్యూనిస్టులో కలవాలా, రథాన్ని అందుకునేంగుకు?"

పాలచెంబు పట్టుకువస్తూనే వెంకటస్వామి "అకేమిటండోయ్! మీరూ చేరతారా?" అని ఆశ్చర్యపోయేడు.

"లేదోయ్! అమ్మగారు..."

"చాల్లెండి వూరుకోండి సడసాలు," అంటూనే లోపల్కి వెళ్ళిపోయింది.

వెంకటస్వామి నవ్వుకున్నాడు. దగ్గరగా వస్తూనే "విన్నారా?" అన్నాడు.

ఏమిటి అంటూ కనురెప్పలు పెద్దవి చేసేడు వసుపతి.

'శ్రీమాన్ శ్రీశ్రీ చక్రపాంగలి రంగాచారిగారి భార్య మంగతాయమ్మగారు మూడు వేల జవాహరీతోనూ రంగమార్తాండ శ్రీ సూర్యరాజు మహారాజులుంగారితోనూ విత్యపవళింపుసేవకు, పరారీ" అన్నాడు. అన్నప్పుడు ముఖకవళికలు మారుస్తూ, అంగన్యాస కరన్యాసాలు చేశాడు.

వెల్లువ ఉబికినట్లు వసుపతి నవ్వాపుకోలేక పోయేడు. "మొత్తంమీద కవిత్వం చెపుతున్నావే!"

"కవిత్వ మేమిటి బాబూ! ఇంకో కొన్నాళ్ళుంటే వేదాలే చదివేస్తా."

నషాళం అంటింది దెబ్బ వసుపతికి ఎంత అమాయకత్వంలోవాడు అన్నా.

పాంజేబు పట్టాలధ్వని వినపడ్డంతో వసుపతి తెల్లబోయేడు. రంగనాయిక ఇప్పుడు, ఈ అనుకోకుండా, ఉత్తరం కబురైనా లేకుండా నడచిరావడంతో క్షుభితుడయి మెట్లుదిగేడు. గొంజా దాటుతూ వుండగానే ఎదురైపోయింది రంగనాయిక.

"అన్నగారూ!"

"నడిచేవస్తున్నావా తల్లీ" గుండెలు తోడేస్తుంటేనే అన్నాడు.

తలూపి "ఏవీ పాదాలు ఓసారి," అంటూనే కళ్ళ కద్దుకుంది. నురుగులు క్రక్కుతున్న వరద మధ్యమంలో, ప్రాను దొరికినవాని అనుభూతేపొంది, ప్రీతినెరపుతున్నాడు.

"ఎప్పటికప్పుడే అనుకోవడం, యేదో ఆటంకం రావడం, నెలల్లోకే వెళ్ళిపోయింది మెట్లు ఎక్కేరు.

"శ్యామలమ్మగారు! రంగమ్మ వచ్చిందండోయ్!" అనే వెంకటస్వామి కబురు అందిచ్చేసేడు.

ఉరుకు లురుక్కుంటూనే శ్యామలా, కాంతమ్మా వచ్చి మర్యాదలు చేసేరు. అందులో మార్పుకొంచెం కన్పడితే "ఒదిన

"భ్రమవాదం"

అతన్ని ఆరోజే పిచ్చాసుపత్రిలో చేర్చారు. తోటివారంతా తలోమూలా దిగాలుగా కూచుంటే ఇతనుమాత్రం ఆనందం పట్టపగ్గాలు లేకుండా వున్నాడు. నవ్వాపుకోలేకపోతున్నాడు.

ఆస్పత్రిడాక్టరు అతనిదగ్గరకు వచ్చాడు.

"నీకు దగ్గరచుట్టం ఎవరేనా వున్నారా?"

"సోదరుడు ఉన్నాడు. మేమిద్దరం కవలపిల్లలం. ఒకేపోలిక. ఎవరెవరో ఎవరూ చెప్పలేక పోయేవారు. బళ్ళో చదువుతున్నప్పుడు వాడు అల్లరిచేస్తే మేష్టారు నన్ను తిట్టేవాడు. సైకిలుమీద స్నేహితుడితో డబుల్సు వెడుతూంటే పట్టుకున్నది వాణ్ణి—ఫైను వేసింది నాకు. నేను పెళ్ళిచేసుకుందామనుకున్న అమ్మాయిని వాడు లేవదీసుకు పోయాడు."

"అవుతే మరి ఎందుకంత ఇదిగా నవ్వుతున్నావు?" అని అడిగాడు డాక్టరు.

"పోయినవారం వాడికి అంతకంత శాస్తి జరిగింది. నేను చచ్చిపోతే వాణ్ణిపాతేశారు."

గారు! వెనకటి రంగమ్మనే నేను. ఏమిటో అల్లాగే వెళ్ళనియ్యండి నన్ను," అన్నమాటల్లో దాసోహంఅనే అనేసింది.

వసుపతి కరిగేపోయ్యాడు. మండువాలో వారగా అరటి ఆకులో భోజనంచేస్తూ రంగనాయిక, వ్యంజనాలు మారడుగుతూ శ్యామల, కాంతమ్మ నేతిగిన్నెతోనూ శ్రీపతి కవాచీ బల్లమీద ఉంటే, వసుపతి ఇటూ అటూ పచారుచేస్తూనే "విన్నావుకాదూ రంగమ్మా!" అనీ అన్నాడు.

"చలపతి తమ్ముడు ఈ విధంగా రక్తాభిషేకానికి వెళ్ళిపోతాడని కలలో అయినా నేను అనుకోలేదు. వంశంలోలేని ఈ పిపాస ఆయనలో ఎల్లా వచ్చిందా అన్నదే అర్థంకావటంలేదు" అంది రంగమ్మ.

నెమ్మదిగా నవ్వుతూనే వసుపతి "నాన్నగారినుండే..." అన్నాడు. తెల్లబోయేరు అందరూ.

"అదేమిటి. చీమకైనా హానిచెయ్యని ఆయన..." మధ్యలో శ్రీపతి.

ఆ పండరీపురంలో చేసిన, జరిగిన విషయాలన్నీ వరసగా వసుపతి చెప్పేడు. దాని.పర్యవసానం, తండ్రిగారు గుండెలు బ్రద్దలైయ్యేట్లు పాండురంగడి దగ్గర ఆక్రోశించడం ఏకరువు పెట్టేడు. "అందుకే ఆ పాపం కడుక్కోడానికే ఆయన దేశాలు పట్టేరు" అని ముగించేసేడు.

ఆశ్చర్యం, భయం, భక్తినింపుకుని కళ్లన్నీ వసుపతిమీద నింపేసేరు. శ్యామల ఆపాదమస్తకమూ, కృతజ్ఞతతో నిండిపోయి, తన పసుపు కుంకుమలు నిలబెట్టినందుకు, మనస్సులోనే మామగారికి కృతజ్ఞత తెల్పుకుంది.

ఆ మాటా, ఈ మాటావచ్చి, "శచి కొడుకుని నేను చూచేను" అంది రంగనాయిక.

"ఎల్లా వుంటాడు?" కాంతమ్మ.


"బాగానే వుంటాడు. చలాకీగా వుంటాడు" అంటూనే రంగమ్మ వసుపతి వైపు చూచింది.

ఓపెద కడుపు దేవినట్లు తను నిస్సంతు అన్నబాధ, పోనీ శ్రీపతేనా అంటే తనవతే అవడం, ఇప్పుడు ఆచారాలని అతిక్రమించి, పునర్వివాహం చేసుకున్న శచి సంతానవతి అవ్వడం జరిగింది. తన ఆశలు, శ్యామల కోర్కెలు కూడా దేవుడు వరమివ్వని కోర్కెల్లాగే వున్నాయి. వరప్రసాది శచి, చలపతి అవడం మరింత క్రుంగతీసింది.

"అదృష్టవంతురాలు అన్నాడు నెమ్మదిగా వసుపతి. శ్రీపతి తెల్లబోయేడు. ఒక్క శ్రీపతేకాదు, శ్యామల, రంగమ్మా, కాంతమ్మా కూడా అదే వరస అయ్యినీ పోయేరు.

"అన్నయ్యా!" అంది రంగమ్మ.

చిరునవ్వు నవ్వుతూనే "శచి చేసినపని



రతి దేవి
(కుంభకోణం, రామస్వామిఆలయం)

నేను హర్షించనని, దాన్ని ఈ ఇంటిగడప తొక్కనియ్యనని, మారణహోమం చేస్తానని మీరంతా అనుకుంటున్నారుకదూ! శ్రీపతి ఆ విషయంలో నిప్పున్న కర్రలా మండి పోతున్నాడు.

ఈ చూచిన దేశాలు, వ్యక్తులు, కాల ప్రకృతి అన్నీకూడా నాకే తెలియని ఓ విధమైన మార్పు నాలో ప్రవేశపెట్టేయేమో అనిపిస్తుంది. అవన్నీ నాకు తెలియకుండానే మానసిక చైతన్యం కల్గచేసేయేమోకూడా.

నిజంగా ఒప్పుకోవాలంటే మేము, నాన్నగారు, శ్రీపతి, నేను ఈలాంటి వేదజ్ఞానం, చదువు, మడి, ఆచారాలు, పూర్వ సంప్రదాయాలూ, ఆచరణల్లో కలవాళ్లం అంతా లోకాన్ని ఓవిధమైన సంకుచిత, స్వార్థ దృష్టిలో చూడ్డం, ఉగ్గుపాలతోనే అలవాటై, నరనరాలకు, కణకణాలకు పట్టిపోయింది. మా సంపూర్ణ స్వార్థంలో, కోలగమనాన్ని, మా కట్టడుల్లో అరికట్టగలమన్న అహంమహమికొకల్గి, ఓనామాలు తెలియని, వాళ్ళందరకూ ధర్మపన్నాలు అంటూ, నాల్గు ఉదాహరణలు, ఆరు పన్నాలు చదివి వాడలకొట్టితేనేకాని మా స్వార్థం నిలబడదన్న భావంలో ఉండిపోయేము.

ఉన్నస్థితిని సహజంగా ఒప్పుకోవడంలో తప్పులేదు. ఏం రంగమ్మా!" వసుపతి ఏదో ఆవేదనలో అప్రుతతగానే ప్రశ్న వేసేడు.

తలూపింది రంగమ్మ. నిజంగా నమ్మలేని సత్యనిరూపణ ఇప్పుడు వింటోంది. దాంతో నోరుకుట్టేసినట్లే అయ్యింది.

"నాగుండెలమీద చెయ్యి వేసుకుని ఈనాడు నన్ను నేనే సింహావలోకనం చేసుకుంటే ఎంతనికృష్ట, నైచ్యపుపనులు, చదువుల సరస్వతికి చేసేనో అని కుమిలిన్నిపోతున్నా. సిగ్గుపడిపోతున్నా.

ఈ ఆచారపు కట్టుదిట్టాలన్నీకూడా తరచినకొలదీ, బాహిరానికికాదు ఆత్మీయమేనన్న సత్యమూ గోచరమైపోతోంది.

ఆ నిర్ణయానికే ప్రయాణం ఇప్పుడు. అంతకంటె చేసేది ఏమీలేదేమోకూడాను.

వచ్చినప్పటినుండికూడా సతమతమైపోతున్నా. శచిని, రమణమూర్తిని పిలవాలని. ఏవంకమీదపెట్టాలి ఆ పిలుపు అన్నదే నిర్ణయంచేసుకోనలేక మతిన్నిపోతోంది. ఎందుకంటే ఇంతవరకూ ఏర్పడ్డ బలహీనతని ఒక్కసారిగా జయించే ధైర్యంలేదు." ఆగిపోయేడు.

దిగ్భ్రాంతులే అయి ఒక్కొక్కళ్ళ కళ్ళు మెరుపుకొట్టినట్లయినాయి.

రంగమ్మ వెల్లువ ఉబికినట్లు సంతోషం కరవళ్ళయితే లేచిపోయి, శుద్ధిచేసేసింది. గబాగబా సావిట్లో పనులు ముగించివచ్చేసేరు.

"అన్నయ్యా! ఇవ్వాళ ఆనందం పట్టపగ్గాల్లేకుండానే నన్ను ముంచేస్తోంది. ఎప్పుడో ఆరోజుల్లోవిన్నా. ఒక్క కృతి నీ నోటమ్మట వినాలనివుంది," అని విన్నవించి, ప్రాధేయపడింది. తంబూరా సవరించింది.

నవ్వేడు వసుపతి.

మెమ్మదిగా అలముకుంటున్న చీకట్లని మాటకట్టే వెన్నెల ముందువాచివళ్ళుపడుతోంది. సప్తఋషులు సాక్షులన్నట్లు చూస్తున్నారు. సరస్వతీ వీణావాదనం అన్నట్టే వేప, రావిచెట్ల గుబురుల్లోనుంచి, మెమ్మదిగా చిరుగాలి. ఆలసిసొలసిపోయినట్లున్న ఊరు.

చిన్నగా ఎత్తిన సారమతిరాగం, చుట్టూ ఆవరించిన ప్రకృతిలోపడి, హృదయాంతరాళాల్లోని సముద్ర మథనంతో ఏకీభవించి, శ్రుతికలిపి, మేళవింపుల్లో భావాతీతం అయ్యింది. నాగస్వరానికి పడగెత్తిన ఫణీంద్రునిలా హెచ్చనూ హెచ్చింది.

రాగాలాపనతో రసం చిందేడు వసుపతి. అందులో హృదయాలను ఏకంచేసేసేడు. వసుపతేలేడు అన్నట్టే అయిపోయింది. "మోక్షమూకలదా" ఆ కృతి ఆకృతిన్నిదాల్చింది.

రంగమ్మ రసజ్ఞురాలే అయ్యింది. ధ్వని అవగాహనా అయ్యింది. ఒక్కటే అనుభూతి. తనెవ్వరు.? ఏమిటి? ఎక్కడికి ఈదారి? వీటతో నిండిపోయింది. ఆఖరికి వేదనాతప్తయైపోయి, ఒకటే కన్నీరు మున్నీరు అయ్యిపోయింది.

ఒక్క ఉగుటనేలేచి రుద్ధకంఠంలోనే "అన్నయ్యా! పాదాలు ఓసారి ఇవ్వాండి," అంటూనే సాష్టాంగపడిపోయింది.

పాపిటమీద చెయ్యివేస్తూనే "లే! తల్లీ! నాలోఏమివుంది" అంటూనే లేవతీసి సరసనే కూర్చోపెట్టుకున్నాడు.

అంతవరకూ ప్రకృతిలో ఒకళ్ళం అవునో, కాదో తెలియని స్థితిలోవున్న వాళ్ళు వసుపతి కళ్ళమ్మట నీళ్ళుకారడం చూచి, తహతహలాడిపోయి, హృదయాన్నే బరువుచేసుకుని చాటుగా కళ్ళు ఒత్తుకున్నారు.

అందరూ వ్యక్తీకరించలేని భావభారంతో లేచేరు

అంతే.

అంతలో గొల్లునఏడుస్తూనే వెంకట్రామయ్య వెనకగా సీతమ్మ పిల్లాడితో వచ్చేసింది,

ఒక్కమారుగా ప్రపంచం, కారుమేఘాల్లో ఆవృతం అయిపోయింది.

వసుపతినిపట్టుకోలేనంతగాగోలపెట్టేసేడు.

అశౌచం పట్టమహిషే అయ్యింది.

(ఇంకా వుంది.)

ఏడుకొండలవాడా!
వెంకటరమణా!—

[గత వారం తరువాయి]


2

ఏడుకొండలవాడి చల్లని చూపువల్లనే తను కొడుకు గండం గడిచి బయట పడ్డాడనే అభిప్రాయానికి ఆదెమ్మ గాఢంగానూ, జగపతి కొద్దిగానూ గురియైనారు. ఎన్నో యేళ్లుగా ఆమెకు ఏడుకొండలవాడు - ఇష్టదైవముగనుక దేవుని మహత్తు గుర్తించటంలో ఆమె ముందజ వేసింది.

తన కొడుక్కి జబ్బు తిరుపతి వెంకటేశ్వర స్వామికి మ్రొక్కుకోగానే తగ్గడంలో- ఏమైనా ఆ స్వామి ప్రభావం వుందా! ఆ చాగ్లు యిచ్చిన మాత్రలకే తగ్గిందా? అంతు పట్టకుండా వుంది జగపతికి. ఆ స్వామి అనుగ్రహంవల్ల ఆపదలనుంచి బయటపడ్డ వాళ్ళు లోకంలో లెక్కపెట్టలేనంత మంది వున్నారని చెప్తుకుంటూ వుంటారు. అదంతా నిజమేనా! పడమటివీధి శాంతమ్మ కొడుక్కి పక్షవాతంలో చచ్చుబడ్డ కాళ్లు- ఏడుకొండలవాడికి మ్రొక్కుకుంటే, సరిగ్గా వొచ్చాయట. వాడిప్పుడు మాట అరవై నాలుగు పౌన్ల వడ్లబస్తా అలకంగా మోస్తాడు. నాయుడిగారి కూతురు, ఆరేళ్ళ పిల్ల డాబామీదనించి క్రిందబడి, తలనలు ముఖాలుగా పగిలి నెత్తురు వరదలైపారగా— ఆ తల్లి గుండె పగులగొట్టుకొంటూ వెంకటేశ్వరునికి మొక్కుకుంటే, చావు బ్రతుకుల్లో వున్న ఆపిల్ల-బ్రతికి యిప్పుడు రోజూ గంతులేస్తూ బళ్ళోకి పోతుందట. ఒంటెద్దు బండి వీరాస్వామికి చూపు రావడం కూడా వెంకటేశ్వర స్వామి చల్లని చూపువల్లనేనట. ఆ పరమాత్ముని మహత్తు గూర్చి ఇట్లా ఎన్నో దృష్టాంతరాలను తను నిత్యమూ వింటూనే వున్నాడు. కాని తను యిన్నాళ్ళుగా ఆలోచించనేలేదు. అంతా పిచ్చిమూక! ఇంతమంది డాక్టర్లుంటే ఆ స్వామికి ముక్కుకున్న మాత్రానే రోగాలు నయమౌతాయా—అనుకున్నాడు. కాని, ఏమిటో తనకే—అందరిలాగే నమ్మకం కలుగుతూంది. ఎవరికైనా ఆపదవొస్తే కానీ— దేవుని అవసరం రాదనీ వూరికే అన్నారా!

కాని తను కేశవాయపాలెం కరణంగారి భార్యనగలు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి చెందవలసినవి - దొంగిలించాడే! ఆనగల్ని దొంగిలించడం ఎంతో పాపం. 'ఆ దొంగిలించిన వాళ్ళు ఆ స్వామి ఆగ్రహానికి గురికాక తప్పదు' అన్నది భార్య. కాని తనకెట్లా తెలుసు! తెలియక చేసిన తప్పును మన్నించే విశాల హృదయం లేదూ, స్వామికి! తను అజ్ఞాని. అహంకారి! ఇప్పటివరకూ దేవుడంటే లక్ష్యం లేదు. తన దొంగతనవృత్తిలో అడ్డు తగిలిన ప్రతివాడికీ హడలు పుట్టించడమే తనపని. కాని తను దొంగతనం మాని వేయటమే మంచిది. చేసిన తప్పులకు క్షమాపణ కోరుకొని—ఇక ముందు అట్లాంటి తప్పులు చేయనని వాగ్దానం చేయడం మేలు. తన జీవితానికి పరమార్థమేమిటి? దొంగతనం, మోసం, దౌర్జన్యం, జైలు—ఇవేనా? తన బ్రతుకిట్లా వెళ్ళమారవలసిందేనా? లోకం చాత తను చచ్చేవరకూ 'దొంగ'గా పరిగణింపబడాల్సిందేనా? తనూ నీతిగా, నిజాయితీగా, న్యాయంగా ఎందుకు బ్రతకరాదు? తను ఎదురు పడితే గౌరవనీయులు అట్లా తప్పుకు పోతారేం? తనువీధిలో నడుస్తూంటే—ఆడవాళ్లు తలుపులు వేసుకుంటారేం? తనని చూసి పిల్లలు పరుగెడతారేం? తను బ్రతుకును ఇంకో గాడిలో పడేయ్యాలి. మనుష్యులందరితో కలిసి మెలిసి తిరిగేట్టుగా బ్రతకాలి—జగపతి ఆ విధంగా ఆలోచించుకున్నాడు ఓరోజు సాయంకాలం.

జగపతి వారంరోజులవరకూ రాత్రుళ్లు ఇంటిదగ్గరే పడుకున్నాడు. అమావాస్య సమీపిస్తున్నా, దాటిపోతున్నా— రాత్రిళ్లు ఇల్లుకదల్లేదు. ఆదెమ్మ ఆశ్చర్యపోయింది మొగుడిలో కలిగిన మంచిబుద్ధికి.



తాళ్ళూరు నాగేశ్వరరావు

ఏడుకొండలవాడా!

కాని అలవాటైన ప్రాణం, తిరిగే కాళ్లూ, పనిచేసే చేయీ—జగపతిలో పుండును శేపి వట్టుగా శేపాయి. ఎనిమిదోనాటి రాత్రి ఇంటికిరాలేదు. తెల్లవారుఝామున వొచ్చాడు కుంటుకుంటూ. గోడదూకుతూంటే అరికాలిలో సీసాపెంకు గుచ్చుకున్నదట.

తెల్లవారింది. ప్రొద్దుపొడిచింది. సూర్యుడు కొండ ఎక్కాడు. జగపతి మంచం మీదనుంచి లేవలేదు. బురదలో దిగబడ్డ ముసలిఎద్దు మూలిగినట్టు మూలగ నారంభించాడు. సీసాపెంకును ఆహ్వానించి, మర్యాదచేసిన అరికాలు—దుష్టుడికి ఇంట్లో చోటుపెట్టి తర్వాత తల బొప్పి కట్టగా ఏడుస్తూన్న యజమాని లాగ, ఏడ్వనారంభించింది.

"ఎందుకొచ్చిన కర్మ! నేను ఎంత చెప్పినా చెవి కెక్కదాయె! ఇంట్లో రేవుంకి ఒక ప్రక్క దణ్ణం పెడుతూ—పొరుగూరిలో రాత్రిపూట గోడలు దూకితే కాళ్ళు విరక్క సీసాముక్కలు దిగకా వుంటాయా! మనిషికి సీమూ, నెత్తురూ వుండాలె!" అనుకొంటూ ఆదెమ్మ ఆచార్లు దగ్గర కెళ్ళింది.

ఆచార్లు వొచ్చాడు. మూడు చిటికెలు ముక్కుపొడుం ఘాటుగా పీల్చి అరికాలిని అటూ ఇటూ తిప్పి, కళ్ళజోడును కదిలిస్తూ.

"ఒస్! ఈ మాత్రానికే మంచంలో కుందేలు పిల్ల ఎగిరిపడ్డట్టు ఎగిరిపడతావేం జగపతీ! మూడు రోజుల్లో దీన్ని మచ్చ లేకుండా మాపుచేయనూ! శస్త్ర చికిత్సలో ఈ ఆచార్లను మించిన వైద్యుడు అరవై ఆమడల్లో అటూ ఇటూ లేరు. ఏమనుకుంటున్నావో!" అన్నాడు.

ఆ ఉదయమే ఆచార్లు జగపతి అరికాలిలోని సీసా పెంకును తొలగించాడు. జగపతి ఆ బాధకు క్రిందూ మీదూ అయినాడు; ఎద్దుగిట్టలకు నాడాలు కొడుతూంటే గిలగిలా తన్నుకున్నట్టు తన్నుకున్నాడు. సీసాపెంకు తీసివేయగానే అరికాలి నొప్పి తగ్గుతుందనుకున్నాడు జగపతి. ఆచార్యులవారు అల్లానే సెలవిచ్చారు. కాని అతని నొప్పి తగ్గలేదు. ఒకరాత్రి గడిస్తే చప్పగా నొప్పి తీస్తుందని ధైర్యం చెప్పాడు ఆచార్లు.

ఆరోజు గడిచింది. మరునాడూ వెళ్లింది. మూడో రోజు కూడా ఆ నొప్పి తగ్గక, ఆ గాయం చుటూ పుట్టకుక్కల్లాగ బొబ్బలు లేచినయ్. లోపల ఏదో పురుగు వున్నట్టుగా దురదగా వుంది. కాలు క్రింద పెట్టేందుకు లేదు. జగపతికి పిచ్చిఎత్తినట్టుగా వుంది. ఏం తోచడం లేదు. ఒక ప్రక్కన నొప్పి, మరో ప్రక్క మంచంలో ఎన్నాళ్లు పడి వుండాలో నన్న దిగులూ—అతన్ని క్షణ క్షణమూ క్రుంగదీస్తున్నయ్.

భర్తపడే బాధను చూసి కంటిమీద కునుకు లేదు ఆదెమ్మకు.

ఆచార్లు మందు యిస్తూనే వున్నాడు. నయమౌతుందని ధైర్యం చెబుతూనే ఉన్నాడు.

వారం గడిచింది.

జగపతి అరికాలిగాయం దిన దినాభివృద్ధి గాంచింది. మడం వరకూ కాలు వాచింది. అతనిలో అధైర్యం గూడుకట్టింది. ఆపుండు చూసి ఆదెమ్మ భయపడింది. భర్తపడే విపరీతమైన బాధకు—ఆమె భోజనంకూడా మానివేసింది.

మళ్లీ ఆదెమ్మ ఏడుకొండలవాడి చిత్రపటంముందు మోకరిల్లింది—

'స్వామీ! మళ్లీ యీ ఉపద్రవ మేమిటి? నేనేం పాపం చేశాను? నా సంసారంలో యీ కష్టాలేమిటి? నీ చల్లనిచూపు వల్లనే చావు బ్రతుకుల్లో వున్నకొడుకు బ్రతికి బయటపడ్డాడు. నీ చల్లని చూపు వల్లనే మరణవేదన పడుతూన్న నా భర్తకూడా బ్రతకాలి. స్వామీ! వొచ్చే మాఘ మాసంలో పదకొండు వూళ్లు జోగి అడుక్కుని తిరుపతిలో తమని దర్శించి, నాభర్త తల వెంట్రుకలు తమకు సమర్పిస్తాడు. కరుణించు ప్రభూ! నాభర్త బాధపడుతూన్న వ్రణాన్ని మాన్పి, బాధను తొలగించు స్వామీ! వచ్చే ఏడు తప్పకుండా మొక్కుబడుల్ని చెల్లిస్తాము. దయదల్చు తండ్రీ!" వేడుకొన్నది ఆదెమ్మ.

తన మొక్కుబడిని భర్తకు తెలియజేసింది ఆదెమ్మ.

జగపతికి శాంతి చిక్కలేదు. బాధ తగ్గలేదు.

తన ఒక్కగానొక్క కొడుకును ఆనంద స్వరూపుడైన వెంకటేశ్వర స్వామి కటాక్ష వీక్షణముచే ప్రాణాపాయంనుంచి రక్షించుకున్నట్లే, ఆ స్వామి అనుగ్రహంచే భర్తను కూడా అదేవిధంగా - యమబాధనుంచి తప్పించుదా మనుకున్నది గానీ, ఆదెమ్మ ఆలోచన అక్కరకు రాలేదు.

జగపతి పుండు నయంకాలేదు. బాధ రవ్వంత తగ్గలేదు. ఆచార్ల మందుమీదకూడ ఆశ తొలగింది.

"మీరట్లా అధైర్యపడితే లాభంలేదు. పెద్ద శస్త్రచికిత్స చేస్తాను. ఇంకా దాని అవసరం కలక్కనే పూరుకున్నాను. ఇదుగో యింకా మూడునాలుగు రోజులు చూసి అంతపనీ చేస్తాను. అప్పుడుగానీ మీకు నా వైద్యపువిలువ తెలిసిరాదు." అన్నాడు ఆచార్లు.

ఆ మాటల్ని లక్ష్యపెట్టలేదు జగపతి. వరదలో ఏటిమధ్య కొట్టుకుపోతున్న వాడికి

వొడ్డున వున్నవాడు 'జాగ్రత్తలు' చెప్పినట్టుగానే తోచాయి.

అరికాలిమీద గాయం-వ్రణంలోకి మారి, మనిషిని నిలువంటా రంపపుకోతలాంటి బాధకు గురిచేసేప్పటికి, జగపతిలోని అహంకారమూ, మదమూ, కళ్ళల్లోని కొరకొరా, నోటిదూకుడూ, నిర్లక్ష్యమూ, విర్రవీగుడూ నీటిలోపడ్డ యిసుకగడ్డ కరిగిపోయినట్టుగా కరిగిపోయినాయి. పశ్చాత్తాపం తలఎత్తుతూంది. కండకావరంతో కళ్లుమూసుకొని చేసిన పనుల-ఫలితాలు త్రాచుపాములై, పగబట్టి వెంటాడుతూన్నట్టుగా తోస్తున్నాయి.

ఈ అరికాలిగడ్డతో తన బ్రతుకు ఆఖరు! వొళ్ళు తెలీని అజ్ఞానంతో చేసిన పాపాలు గూడుకట్టి యీనాడు కాలిమీది వ్రణం రూపంలో తనని అవసానదశకీడ్చుకొచ్చి, నరకానికి నాందిగా బాధలో కుళ్ళగిస్తున్నయ్! ఏడుకొండలవాడికి తనపై ఆగ్రహం కలిగింది. దానికి కారణం తనే. తను చేసుకున్న కర్మ-తనముందు అగ్నిగుండాన్ని సృష్టించింది. కేశవాయపాలెం కరణంగారి భార్యనగల్ని తను దొంగిలించడంతో-తన పాపం పక్వానికి వొచ్చింది. ఆ నగలు తిరుపతి వెంకటేశ్వరస్వామివారికి నిలువుదోపిడిక్రింద చెల్లించి వుండాలని - తనకు తెలిసినా తను అహంకారంతో, కండకావరంతో, నిర్లక్ష్యంతో, మోటుతనంతో ఆ నగల్ని తిరిగి దొంగిలించినవాటికు చేర్చే ప్రయత్నం చేయలేదు. దానితో తన పాపం పండింది. ఈ కాలి వ్రణం ఆ పాపఫలితమే!—అనుకున్నాడు జగపతి మంచంలో మూలుగుతూ.

పసిపిల్లవాడు నిద్రబోతూన్నట్టుగా వుంది అర్ధరాత్రి. దురదృష్టవంతుని జీవితంలోని దుఃఖంలాగ వుంది చీకటి. గదిలో కొడిగట్టు లాంతరు నీగ్రోవాని ముఖంపై సంధ్యాకాంతి పడ్డట్టుగా వెలుగుతూంది. నూనె అయిపోవొస్తూన్న ఆ దీపపుకాంతి—మూఢుని మనస్సులాగ పరిమితంగా కాంతిని పరుస్తోంది.

ఆదెమ్మ ప్రాణం శోషిల్లగా—భర్త మంచం ప్రక్కనే యీతాకుల చాపమీద శరీరాన్ని చేరగిలవేసింది. ఆమె కళ్ళు మూసుకొని వున్నాయి. ఆదెమ్మకొడుకు నిశ్చింతగా నిద్రబోతున్నాడు. కాని జగపతి మేల్కొనే వున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు అంత బాధలోనూ. గంటసేపు ఆలోచించి—నిశ్చయానికొచ్చాడు అటువంటి స్థితిలోనూ.

మెల్లగా మంచందిగాడు.

కొడిగుడ్డు లాంతరు వొణికింది. గదిలో వెలుతురునీడ కదలాడింది.

మంచం దిగిన జగపతి, కాలును యీడ్చుకుంటూ, నేలమీద కాళ్లు లేనివాడు దేకినట్టుగా దేకుతూ, పడమటి గదిలోకి వెళ్లాడు. వెంకటేశ్వరస్వామివారి చిత్రపటంముందు రెండు చేతులూ జోడించి బోర్లాపడ్డాడు జగపతి. గుండెలో ఆవేదన పొంగుకొచ్చింది—

"స్వామీ! ఆర్తజన రక్షకా! ఈ దౌర్భాగ్యుణ్ణి మన్నించు! ఈ దుర్మార్గుణ్ణి క్షమించు! ఈ దుష్టుణ్ణి కనికరించు! అజ్ఞానంతో, అహంకారంతో అవివేకంతో—శరీర సుఖంకోసం, స్వలాభంకోసం ఎన్నెన్నో పాపాలు చేశాను. తుదకు తమకు మొక్కుకున్న నగల్నికూడా దొంగిలించాను. క్షమించు ప్రభూ! నా కంఠంలో ప్రాణం వుండగా ఆ నగల్ని ఎప్పటివాటికే చేరుస్తాను. తమ మ్రొక్కుబడి సక్రమంగా జరిగేట్టు చూస్తాను. ఈ దాసుణ్ణి దయతో చూసి, ఈ కాలిబాధను తప్పించు ప్రభూ! లేకుంటే ఈరాత్రి తమ పాదాలకడనే ప్రాణాన్ని విడుస్తాను. ఈ బాధకోర్వలేను స్వామీ! తమరు కనికరించకుంటే—ఆత్మహత్యే శరణ్యం. నా గుండెను తొలిచి చాచిన అరచేతిలో పెట్టి—తమ సమక్షాన మాట్లాడుతున్నాను. వచ్చే మాఘ మాసంలో పదకొండూళ్లు జోగి తిరిగి, తలవెంట్రుకలు తమకు సమర్పిస్తాను. ఇక జీవితంలో దొంగతనం చేయను. మనిషిపుట్టక పుట్టినందుకు-మనిషిగానే బ్రతికేందుకు ప్రయత్నిస్తాను. నన్ను క్షమించవా, స్వామీ! ఈవరకబాధనుండి నాకు విముక్తిలేదా! ఈబాధతోనే చావాల్సిందేనా! నా ఖర్మ యింతేనా! కనికరానికి నేను నోచుకోలేదా! ఏం ప్రభూ! స్వామీ!

మిగతా రాత్రంతా జగపతి స్వామివారి చిత్రపటంముందే స్పృహతప్పి పడిపోయినట్టు పడివున్నాడు.

ఆదెమ్మకు మెలకువ వొచ్చేప్పటికి-గదిలో కొడిగుడ్డు లాంతరు వెలుగులేదు. అన్నం లేనివాడు ఆకలిబాధతో నిద్రపోయినట్టే నూనెలేని ఆలాంతరు నిద్రపోయింది. చీకట్లో మంచం తడిమిచూసింది. భర్తలేడు.

కెవ్వున కేకవేసింది ఆదెమ్మ.

ఆకేకకు మేల్కొలేదు జగపతి.

3

జగపతి మనస్సు తృప్తిపడింది. ఇక తను చచ్చినా-సుఖంగా చావచ్చుననుకున్నాడు. గుండెలో ఆవేదనంతా స్వామివారి ముందు వెళ్లగ్రక్కాడు. హృదయం తేలికపడింది.

ఆచార్లు శస్త్రచికిత్స చేశాడు.

మరునాటికి నొప్పి తగ్గింది.

మూడోనాటికి గాయం మానిపోనారంభించింది.

"శ్రీ వెంకటేశ్వరస్వామి నన్ను కరుణించాడు. నాతప్పుల్ని క్షమించాడు. గండం గడిచింది. నాఅరికాలి వ్రణం నయమైంది. ఏడుకొండలవాడా! వెంకటారమణా!" కేకవేశాడు జగపతి సంతోషం పట్టలేక.

ఆదెమ్మకళ్లుఆనందంతోనీళ్లునింపుకున్నాయి.

"నావైద్యం విలువ తెలిసిందా జగపతీ!" అన్నాడు ఆచార్లు.

తర్వాత వారంరోజులకే గజపతి బాగా తిరగనారంభించాడు. అతనిలో ఎంతో మార్పు వొచ్చింది. వానకురిసి వెలిశాక పచ్చనిఎండకు ప్రకృతి కళకళలాడుతున్నట్టుగా—పశ్చాత్తాపంలో కొట్టుకుపోయినపాపం పోగా, హృదయం కళకళలాడుతున్నది.



"అయ్యా! మేనేజరుగారు పిలుస్తున్నారు. ఒక్కమాటిలా చూస్తారా?"

★ ఏడుకొండలవాడా! ★

"గజదొంగకాలు నయమైంది. మళ్లీ వూరికి ముప్పే!" అనుకున్నారు కొంతమంది.

కాని అతనిలో వొచ్చినమార్పుకు ఆ వూళ్లో వాళ్లంతా ఆశ్చర్యపడ్డారు. తన చుట్టూ తిరిగే దుష్ట చతుష్టయాన్ని దూరంగా పెట్టాడు. దొంగతనానికీ స్వస్తి చెప్పానని బహిరంగంగా ప్రకటించాడు.

వెంకటేశ్వరస్వామి భక్తుడైనాడు.

ఉదయం కావడంతో, శ్రీ వారి దర్శనం చేసికొని గానీ—ఏ పనీ చేయడు. నిత్యమూ నుదుటమీద పంగనామాలు అందంగా దిద్దుతాడు. పవిత్రంగా బ్రతకాలని అతని జీవితాశయం.

"దొంగతనం, మోసం, టక్కరితనం, దౌర్జన్యం—బ్రతుకుదెరువు కావు. భగవంతు డిచ్చిన శరీరంవుంది. అది వున్నంత కాలం కష్టించి పనిజేసి, సంసారయాత్ర సాగించాలి. నేను కూలిచేస్తాను. వస్త్లబస్తాలు మోస్తాను. పొలంలో పనిచేస్తాను. అందరి కూలీలలాగా నీతిగా, నిజాయితీగా బ్రతుకుతాను. ఆజీవితంలో ఆనందం ఎట్లా చిక్కదో చూస్తాను. అన్నింటికీ ఆ పరమాత్మడే వున్నాడు," అనుకున్నాడు గజపతి గట్టిగా.

ఆ రోజు ప్రొద్దుగ్రుంకగానే జగపతి రామియింటికి వెళ్లాడు. కాలివ్రణం నయమైనాక అదే వెళ్లడం మొదలు.

"ఏం దొరగారికి, ఇప్పటికి దయకలిగింది" అన్నది రామి ఎత్తి పొడుపుగా.

"ఆ నగ లెక్కడున్నాయి" అన్నాడు కూర్చోకుండానే జగపతి.

"ఏం నగలు" ఏమీ తెలీనట్టుగా ఆశ్చర్యపోయింది రామి.

"ఆరోజు తెల్లవారగట్ల కేశవాయపాలెం నుంచి దొంగిలించి నీకి స్తినే, అవి."

"ఎందుకూ ఇప్పుడు?"

"నాకు కావాలి"

"లేవుగా" నవ్వింది రామి నవరత్నాలు రాలిపడేట్టుగా.

"ఏమైనాయి!" జగపతి గుండెలో నీరు దిగింది.

"ఆ మరుసనాడే సుబ్బన్నకిచ్చి బస్తీకి పంపించి, మార్పించినానుగా"

"నిజమా!"

"ముమ్మాటికీ!"

జగపతి అరటిచెట్టును నరికినట్టుగా కూలిపోయాడు.

'ఎంతపని చేశావే రామీ! దుర్మార్గురాలా! ఆ పాపమంతా నీకే కొడుతుంది. నువ్వే అనుభవిస్తావు!" అన్నాడు జగపతి ఉద్రేకంగా.

రామి కంగారు పడింది.

"ఏమిటి మామా! ఏం జరిగింది? ఆనగలు మార్చగూడదా!"

"నీకు తెలీదే, రామీ! అవి కరణంగారి భార్య ఏడుకొండలవాడికి నిలువుదోపిడిగా ఇస్తానని మొక్కుకున్న నగలంట. వాటిని దొంగిలించిన వాళ్ళకూ, ఆ సొమ్మును అనుభవించినవాళ్ళకూ—పుట్టగతులు లేవంట. శ్రీ వారికి ఆగ్రహం వొస్తే మానవమాత్రులం అందులో అధములం—మన మెంత! చూస్తివిగా—నా కాలికి వొచ్చిన ప్రమాదం!"

రామి రొమ్ములమీద అరచేతులు వేసుకొని భయాన్ని అణచుకుంది.

"అయితే మామా! ఆ నగలు తీసికెళ్ళి, వాళ్ళింట్లోనే దిగవిడిచిరా. ఒట్టిదే! నా దగ్గరే వున్నాయి. నీతో అబద్ధమాడాను," అని రామి కావిడిపెట్టెలోని గోవర్ధన గొలుసూ, వొంకెల గాజులూ తీసికొచ్చి, గుడ్డ చుట్టి—జగపతి చేతిలో పెట్టింది.

జగపతి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

4

హంతకుని ఆలోచనలావుంది అర్ధరాత్రి. చెట్లమీద నుంచి ఆకురాలినా వినిపించేంత నిశ్శబ్ద స్థితిలో, జగపతి భార్యను విడిచి—ఆ అర్ధరాత్రి వూరిబయటికి వొచ్చాడు. కేశవాయ పాలానికి దారితీసే డొంకలో అడుగు పెట్టాడు.

రెక్కలు విప్పుకొని అవినీతి మనుషులో నాట్యం చేసినట్లే—జడలు విరబోసుకొని చీకట్లో చెట్లు కరాళనృత్యం చేస్తున్నాయి. ఆ చీకట్లో జగపతి కేశవాయపాలెం నడిచి వెళ్ళాడు.

కరణంగారింట్లో—జొరబడ్డాడు పెరటి దొడ్డి మొండిగోడ దూకి.

వంట గదిలోంచి—ఇంటి చావడిలో ప్రవేశించాడు. గదిలోంచి వొచ్చే బెడ్‌లైటు పల్చనికాంతి అస్పష్టంగా పడుతోంది. ఆకాంతి చీకటిని పారదోల లేకపోతూంది. ఆ గదితలుపు వోరగా తెరచివుంది. ఆగదిలోనే కరణంగారి భార్య, చిన్న కూతురూ, కరణంగారి తల్లీ పడుకొని వుంటారు. ఆగదిలోనే జగపతి ఆనగల్ని దొంగిలించింది.

జగపతి నెమ్మదిగా ఆగదిలోనే ప్రవేశించాడు. అతని మనస్సు అతిప్రశాంతంగా వుంది దొంగతనానికి వొచ్చినవాడి మనస్సుకు వుండే ఆవేగమూ, ఆవేశమూ, భయమూ లేవు.

మరణావస్థలో నున్నవాని మూలుగులాగ వుంది గదిలో కాంతి.

అంతా గాఢనిద్రలో ఉన్నారు.

వీధిలో కుక్క 'భౌ' అని అరిచింది ప్రాణంమీద కొచ్చినట్టుగా. వంటగదిలోని పిల్లి పాలగిన్నె దొర్లించి—పరుగెత్తింది. మంచంక్రింద గ్లాసును జగపతి చూడక తన్నాడు. గుడిలో గంట వాయించినట్టుగా చప్పుడు చేసిందది.

కరణంగారి భార్య ఉలిక్కిపడి లేచింది పీడకలవొచ్చినట్టుగా.

మసకచీకట్లో మానవాకారం కదిలినట్టుగా నిద్రకళ్ళకు తోచింది.

కెవ్వున కేక వేసింది.

"దొంగ—దొంగ!" అని వెంటనే అరిచింది.

ప్రక్కగదిలో పడుకున్న కరణంగారు జారిన పంచెను చేత్తో పట్టుకొని పరుగెత్తుకొచ్చాడు. భార్యాభర్త లిద్దరూ అరిచారు—'దొంగ-దొంగ' అని.

(63 వ పేజీ చూడండి)

తొందరపాటు నిర్ణయం

ఆకుండి నారాయణమూర్తి

ముందు వెనుక లాలోచించక అనాలోచిత నిర్ణయం తను చేశాడేమోననే అనుమానం అంతా నిశ్చయమైన అనంతరం కల్గింది అనంతానికి.

ఇక గత్యంతర మేమిటి?

తన అనుమానం నిజమే అయితే...

ఇక చేసేదేమిటి?—

పీటలమీది పెళ్ళిళ్ళు ఎన్నెన్నో తప్పటం తను కళ్ళారా చూసేడు.

దంపతులని ముద్రవేయటానికి 'ప్రధానం' అంత ప్రధానం కాదు!

అందుకయిన ఖర్చు కావాలంటే యిచ్చెయ్యొచ్చు.

కానీ......

మాట తప్పితే తమ వంశగౌరవం ఏమౌతుందోననే భయం ఒక ప్రక్కనుంచి బెదిరిస్తోందతన్ని

ఇంతకీ......

ఆ అమ్మాయి ఆకారం తనకు బాగా నచ్చింది.

ఆ వనితవదనం చాలా ఆకర్షణీయమైనది.

ఆమె చూపు మామూలు చూపుకాదు.

ఎదుటివాళ్లను మైమఱపించే మధురమైన చూపది.

ఆమె సోయగానికి పరవశుడై ఏదో తెలియని మైకంలోపడి తల్లి దండ్రులకు తన సమ్మతిని తెలియజేశాడానాడు అనంతం.

ఇక నేం!

'శుభస్యశీఘ్రం' అన్నారు పెద్దలు.

వెన్వెంటనే తాంబూలాలను స్వీకరించడం జరిగింది.

వివాహమంటే?

ఒక జీవితకాలంపాటు జంటగా హృదయాలు ఒకదానిలో ఒకటి ఐక్యమై బాధ్యతల బరువును మోస్తూ చేసే ప్రయాణం.

అటువంటి సుదీర్ఘమయిన ప్రయాణంలో తన మనస్సులో ఆమె మనస్సును మిళితం చేసి, కోసవఱకూ తనతో సఖ్యంగా పయనించే తత్వంగల మనిషి కాదేమో ఆమె అనే అనుమానం పీడిస్తోం దతన్ని.

ఈనాడు తనకు కల్గిన అనుమానం, ఆ నాడు-అంటే ఆ అమ్మాయిని చూసిన నాడు కల్గలేదు.

పిల్లని చూడడానికి రమ్మన మని కోశ డామె తండ్రి.

తనూ తల్లి దండ్రులూ వెళ్ళిచూశారు.

మధ్యాహ్నం ఒంటిగంటకెళ్ళి, సాయంత్రం ఐగుగంటలకు అంతా నిశ్చయించుకొని వచ్చెయడం జరిగింది. ఒకటి రెండురోజులపాటు వాళ్ళింట్లోవుండి ఆ అమ్మాయి నడతను పరిశీలించవలిసింది. కానీ 'కతికితే అతక'దనే మూఢనమ్మకంతో అలా వీలుపడలేదు. ఇంతకీ ఆ నాడు ఆ సమయంలో ఆ అమ్మాయినిగుఱించి వెనకా ముందూ ఇంతగా ఆలోచించలేదు తాను.

ఇప్పుడెంత విచారించినా ఏంలాభ మను కున్నాడు అనంతం.

తొందరపాటు నిర్ణయం జరిగిపోయింది.

లోలోన వేధిస్తున్న అనుమానపుభారంతో ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటే— జీవితరథం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా సాగిపోదేమోనని అతని భయం.

ఆ అమ్మాయిని చూడ్డానికెళ్ళిననాడే ఆ పోకిలా కాలేజీ కుఱ్ఱాడు తనకాఇంట్లో అసుపిస్తే కథ యింతవరకూ పెరిగేది కాదను కున్నాడు అనంతం.

సరదాగా ఓ జల్లాట్రిప్పు తిరిగి రావాలనే సంకల్పంతో అవాళ విజయనగరం వెళ్ళేశు అనంతం. లీలామహల్లో అవాళ మంచి సినిమా ఏదీ లేదు. ఏదో చెత్త పిక్చరుంది. అది చూడాలనే సంకల్పం అల్పంగానైనా లేదతనికి. కానీ ఆ హాలుకు పోయే దారిలో మునిసిపల్ హైస్కూలు టర్నింగులో తన కాబోయే మామగారి ఇల్లుంది. అదృష్టం బాగుండీ ఆ అమ్మాయి అగుమ్మంలో ఆ వేళకుంటే, మరోమారు ఆ లావణ్యవతిని చూసే భాగ్యం తనకు లభిస్తుందనే సగుద్దేశ్యంతో ఆ హాలుకు బయలుదేరి డావీధిలోంచి.

కానీ తానూహించిన ప్రకారం జరగ లేదు.

ఆ అమ్మాయి ఆగుమ్మంలో అగుపించ లేదు.

కానీ, టిప్‌టాప్‌గానున్న ఓ యువకుడు ఆ ఇంటి వీధికొట్టుకు తాళంవేసి, ఇంటిలోకి వెళుతూండడం చూశాడు అనంతం.

ఆ యువకుడు ఓ కాలేజి స్టూడెంటయుంటాడనీ, ఆ వీధి కొట్టులో అద్దెకుంటున్నాడనీ ఊహించడాని కతను సంకోచించ లేదు. ఆ అమ్మాయికి ఇద్దరు తమ్ముళ్లున్నారు గానీ అన్నయ్యలు లేరు. అంచేత వాడెవడో పరాయివాడేనని నిశ్చయించు కున్నాడు.

ఎలాగో కాళ్ళీడ్చుకుంటూ హాలుకెళ్ళేడు

అంతా మిథ్య

ఒకా పెద్దమనిషి కుండీలో వున్న మొక్కకి నీళ్ళోస్తూంటే మరొహా పెద్దమనిషి చూసి— "అదేవిటండీ ఆ బకెట్టుతో పోస్తున్నారు. దానికి కిందేమీ వున్నట్టు లేదే" అన్నాడు.

"మరేం పరవాలేదులెండి— ఇవి కాగితం పువ్వులేగా!"

★ తొందరపాటు నిర్ణయం ★

అతని మనస్సు వికృతంగా తయారయింది.

చెడుక కక్కుర్తి.

డబ్బుకక్కుర్తి.

వాళ్ళను కప్పెట్టేటంత డబ్బుంది.

అయినా ఏమిటి సంకటం.?

ఆ వీధికొట్టు అద్దెకివ్వకపోతే గడవదా ఏమిటి?

పోనీ ఇచ్చి ఇచ్చి కాలేజీ స్టూడెంటుకే ఇవ్వాలా?

ఇది కలియుగం.

ఎవ్వరినీ నమ్మడానికి వీల్లేదు.

అవినీతి పనులలో ఆనందం ఎక్కువగా ఉండటం సహజం!.

అంతా అనుకూలంగా ఉండి విషయం గోప్యంగా ఉంటుందనే నమ్మకముంటే, అవినీతి పనులు చెయ్యడానికి చాలామంది వెనకంజ వెయ్యరు అని అనంతం ఉద్దేశ్యం.

ఇంట్లోపల అందమైనయువతి! గుమ్మంలో అందమైన యువకుడు! దుర్బుద్ధి ఎవరికైనా పుట్టవచ్చు!

మగా ఆడా అనే విచక్షణ లేకుండా కలిసి మెలిసి తిరగడం నవీన నాగరికతగల వాళ్ళ లక్షణమట. కానీ, పాడుబుద్ధి మనిషి కెప్పుడో ఓ ముహూర్తంలో పుడుతుంది. శారీరకోద్రేకా లటువంటివి. ఆక్షణంలో విచక్షణ జ్ఞానం నశిస్తుంది. అంచేత......

ఆ అమ్మాయి తప్పటడుగు వేసేటందుకు అనుకూల వాతావరణం ఆ ఇంట్లో లేక పోలేదని అతని భావం.

తను బి. ఏ. చదువుతున్న రోజుల్లో ఓ అమ్మాయి ఆమె శీలాన్ని చెడగొట్టుకొని అటుపైని కొన్నాళ్ళతరువాత వేరే ఇంకొకణ్ణి పెళ్ళి చేసుకొని, ఓ పతివ్రతగానే ఈ లోకంలో ఈనాటివఱకూ చెలామణీ అవుతున్నాది. పెద్ద పెద్ద పట్టణాలలో తాము మంచి నాగరికత కలవాళ్ళమని చెప్పుకొనే ఈ రకమైన సత్శీలురు ఎంతమందో ఏమిటో? ఇంతకీ తనకాబోయే మామగారి గుమ్మంలో ఆనాడగుపించిన ఆ యువకుడి పోజూ, ఆ వ్యవహారం చూస్తే చదువుమీద శ్రద్ధగల వాడిలా అగుపించలేదు. అమ్మాయిల అనురాగం కోసం బ్రతికే జీవిలా అగుపించేడు.

వాడికళ్ళు మంచివికావు. ఏదో తీక్షణమైన ఆకర్షణ ఆ కళ్లలో ఉంది. ఖచ్చితమైన పోకిరీ లాగున్నాడు.

ఇంతకీ.........

వాడెలాంటి వాడైతేనేం? ఆ అమ్మాయి మంచిదేనని ఎందుకనుకో కూడదు.

ఒకవేళ ఆ అమ్మాయి ఆ యువకుణ్ణి ప్రేమించి ఉంటుందా? ఆమె అతణ్ణి ప్రేమించుంటే మరి ఈ వివాహ ప్రసక్తి ఎందుకొచ్చింది? తనను వివాహం చేసుకొనేటందు కామె ఎందుకొప్పుకుంది?

వాడు ఏ కులమో ఏమిటో? పెద్దలు ఇష్టపడలేదు కాబోలు! ఈ విషయంలో పెద్దలు అయిష్టత చూపి ఉన్నట్లయితే, ఈ పాటికి ఆ యువకుణ్ణి ఆ లాడ్జీలోంచి సాగనపుండే వారు అలా జరగలేదు గనుక వారి ప్రేమ పెద్దల దృష్టిలో పడలేదన్న మాట.

వివాహ ముహూర్తపురోజు సమీపిస్తున్నది. ఈలోగా ఏదో ఒకటి తేల్చేసుకోవాలనుకున్నాడు అనంతం.

తనకి సంబంధం ఇష్టంలేదని ఆపిల్ల తండ్రికి రాసేస్తే? అలా వ్రాసేటప్పుడు ఏదో ఓ కారణం వ్రాయాలిక దా? ఏమని వ్రాయడం యథార్థం వ్రాయడం చాలా అసందర్భమైన విషయం. ఇంతకీ అతనికీ విషయం వ్రాసే ముందు తన తల్లిదండ్రులకీ విషయం చెప్పొద్దూ? మాటిచ్చిన తరువాత అలా జరిగి తీరాలనే తత్వం తన తండ్రిది. తన అనుమానాన్ని తండ్రికి తెలియజేసినా చిక్కే. దప్పుపట్టుకొని మరీ చాటుతాడు వాళ్ళ గురించి. ఇంతకీ ఖచ్చితమైన ఆధారాలేమీ లేకుండా తన అనుమానాన్ని బహిర్గతం చెయ్యడం చాలా తెలివితక్కువపని. ఒకవేళ తన అనుమానం అసందర్భమైనదయితే నిష్కారణంగా ఆవనితజీవితం నాశనమవుతుంది. అందుచేత మరేదయినా ఎవ్వరికీ హాని కల్గించని సమంజసమైనకారణాన్ని కల్పించి ఈ వివాహం కేన్సిల్ చేయించాలి.

ఎలా?

ఎంతాలోచించినా మార్గమగుపించలేదు. ప్రధానం కూడా అయిపోయిన తరువాత– తనకాపిల్లను పెళ్ళిచేసుకోడంఇష్టంలేదంటే– కారణమేమిటని పెద్దలంతా తప్పక అడిగి తీరుతారు.

ఇక పదిహేనుదినాలలోనే వివాహ ముహూర్తం. ఏం చెయ్యడం?

రెండుదినాలపాటు సుదీర్ఘంగా ఆలోచించేడు అనంతం.

ఓ గమ్మత్తయిన ఆలోచన తట్టింది అనంతానికి.

ఆ అమ్మాయి పేరను ఓ ఆకాశరామన్న లేఖ వ్రాశాడు "మీరు వివాహం చేసుకోబోతున్న వ్యక్తి ప్రవర్తన మంచిదికాదు. అతను దుశ్శీలుడు. ఇప్పటికైనా మించి పోయిందేమీలేదు. మీ నిర్ణయాన్ని మార్చుకోండి" అని.

* * *

అవాళ అనంతం అనుమానం తీరింది. ఆ వీధి కొట్టులో ఉన్న ఆయువకుడు ఆ అమ్మాయి పెదనాన్న కొడుకని. కాలేజిలో చదువుకుంటున్నాడనీ తెలిసింది. తను ఆ అమ్మాయిని చూడడాని కెళ్ళిననాడు, అతను ఊళ్లో లేడు. అంచేత ఆనాడు అతనిని చూడడం తటస్థించలేదు. అనవసరంగా అనుమానించడు. అనంతానికి నిజం తెలిసేసరికి చాలా ఆలస్యమైంది. ఆ అమ్మాయికి వేరే మరొకనితో వివాహమైపోయినతరువాత అతని కావిషయం తెలిసింది.

అనంతం వ్రాసిన ఆకాశరామన్న ఉత్తరం బాగానే పనిచేసింది.

తమ పిల్ల జాతకానికీ, కుఱ్ఱాడి జాతకానికీ పొత్తు కుదరలేదనేసాకుతో నిర్ణయం రద్దు చేయించే డాపిల్ల తండ్రి.

చాలా కాలమయి అనంతానికి పిల్లనిచ్చేటందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. అందుకు కారణం అతని తల్లిదండ్రుల కేమీ తెలియ దింతవఱకూ. తనకు పిల్లనిచ్చేటందు కెవ్వరూ ఎంచేత సాహసించలేక పోతున్నారో అనంతానికి తెలుసు. ★

ఆమె హృదయం

దారం తెగిన గమ్యంలేని గాలిపటం గాలిలో కదుల్తోంది.

రేపోమాపో విచ్చుకోబోయే మొగ్గ వాడిపోయి శోభా విహీనంగా కన్పిస్తోంది.

ఆమె కనుకొలకుల్లోని నీళ్ళు నక్షత్రాల్లా తళుక్కు మన్నాయి.

సన్నగా, నాజూగ్గా సన్నజాజిలా ఆమె

ఆ పెదవులమీది హాసం, కళ్ళల్లోని కాంతి, మొహంలోని అందం చేతులు కట్టుకు నిలబడ్డ తీరులో ఠీవి - ఏయువతిని ఆకర్షించడు అతను?

దగ్గరగా దూసుకు పోయినప్పుడు గుబాళించిన పరిమళం-ఎప్పుడో ఎక్కడో సుపరిచితమైన ఆ సువాసన కణతలు వేడెక్కినా జ్ఞప్తికి రావటంలేదు. ఆస్పర్శని హృదయాంతరాల్లో ఎక్కడో పదిలపరచింది.

'కలయిక, ప్రేమ, ఎడబాటు, మానవ జీవితంలో తీయనిబాధతో కూడిన సంఘటనలు, వూరడిస్తున్న అతని ఆఖరుమాటలు ఆమెమనసులో చోటుచేసుకుని మరి కదలనని మొరాయించాయి.

ఒకే ఒక్క క్షణం కళ్ళముందు మెరిసిన అతని ముఖాకృతి ఆమెలో రగుల్కొంటున్న బాధల్ని మేల్కొల్పింది. మత్తుగా బాధగా నవ్వుకుంది. రాత్రి - ఆ మెజడలో విచ్చుకుంటున్న మల్లెలూ, సన్నజాజులూ కలసి మధురమధురంగా పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. బయటంతా మల్లెలా మనసుకు ఆహ్లాదం కలిగించే వెన్నెల. మనసులో నిలచిపోయిన నిశీధం.

అల్లంతదూరాన ఆ కన్పించే కొండల వెనుకనుండి సన్నగా హృదయ విదారకంగా పిల్లనగ్రోవి వాయిస్తున్నారెవరో.

'వగిలేయి,! నాచేయి, వస్తానులే రేపు ప్రియతమా' ఎడబాటు భరించలేని ప్రియుడ్ని వూరడిస్తూ ఏ ప్రేయసి పాడుతోందో! మరోవేపునుండి బాధకలించే సంతోషకరమైన పాట 'ఘల్లుఘల్లు ఘల్లుఘల్లు గజ్జెల సంగీతం'—

గతాన్ని కెలికితే అంతానిస్సారం. భవిష్యత్ ని వూహించబోతే అంతా శూన్యం. ఉదయం.

జీవితాన్ని గడపటానికో, నడపటానికో ఒక సహచరుడు కావాలి. ఆమె ఫ్రెండ్ శారద అంటుంది సుందరుడై, ధనవంతుడై, గుణవంతుడైన భర్తకావాలని. ఆమె అవేమీ కోరుకోలేదు. ఏదిలేకపోయినా తన కొంగుపుచ్చుకు తిరిగేంతగా తనని ఆరాధించాలి. తనువేసే ప్రతిఅడుగుకూ మాట్లాడే ప్రతిమాటకూ విలువివ్వాలి.

కాని అన్నీ వున్న అతన్ని చూస్తే ఏ తరుణి పరవశమైపోదూ?

పంకజాల్లాటి నయనాల్ని పైకెత్తింది. అవి సజలనయనాలు.

'కన్నులలో గోదావరి, కాలువలైక తేనా' ప్రక్కింటి రేడియో పెద్దగా పాడుతోంది. ఆమెని వూరడించడానికీ, కన్నీరు తుడవటానికీ ఎవరూ లేరు

'బ్రతుకు గడపటానికి కాదు, ఫలవంతం చేసుకోవటానికి' అన్నారెవరో. కాని నిరోజక ఆశయం మనసులో పెట్టుకుని ఎందరు నడుస్తున్నారు. ఫలించని కోర్కెలతో సతమతమయ్యే కూలీలు, రిక్షావాలాలు,

కై. మాదురి

వీరందరూ ఎందుకు బ్రతుకుతున్నట్లు? ఎవరో ఆంగ్లకవి అన్నట్లు వీళ్ళ రక్తమాంసాలు చవుకగా వున్నాయి కాని, నిరంతర శ్రమమూలంగా వాళ్ళకి లభించే గంజి కూడు కి ఖరీదెక్కువ.

"నేను డాక్టరేట్ పొంది పేదలకి అండగా వుంటాను."

"నేను లాయర్ని అవుతాను."

"నేను ఏకైక నాట్యతారగా వెలుగొందుతాను."

అంటారు పద్మా, నిర్మలా, విజయా.

కాని తనచుట్టూవున్న వాళ్ళని సంతోషపెట్టటంకంటె జీవితంలో సాధించవలసిందేమీ కన్పించదు ఆమెకి.

ప్రభూ! జీవితంలో ఇంకేమీ అర్థించను నిన్ను. అతన్నిమాత్రం నావాడ్ని చెయ్యి" అనుకుంటుంది. 'పిచ్చి కాని ఎప్పుడూ ఒక్క వుత్తరమైనా వ్రాయని అతనిమీద నాకు ప్రేమేమిటి?' అనుకుంటుంది.

"మనకి అందనివాళ్ళకోసం ప్రాకులాడేకంటె, మనని ఆరాధించేవాళ్ళు వుంటారుగా. నిన్న నాజీవితంలో "ఆశించని సంఘటన" ఒకటి జరిగింది. నాకు బావ వున్నాడని తెలుసుగా, నీకు. మావాళ్ళు నిన్న అడిగారు వాళ్ళని. నాకు ముందే తెలుసు వాళ్ళు ప్లేటు ఫిరాయిస్తారని" అందుకని నామనసు నాదగ్గరే వుంచుకున్నాను. ముఖ్యంగా అతను తల్లిదండ్రులచాటువాడు. అందుకు అతన్ని నేను నిందించను. కాని డబ్బున్నదనే అహం, అతనిలో అణువణువునా గోచరిస్తుంది. ఇది యామినీ! సంగతి. ఫ్రెండ్ గా నీకు వ్రాస్తున్నాను. నువ్వు చేయవలసిందంతా యీవిషయం మనసులో వుంచుకోవటమే." అంటూ వ్రాసింది ఆమె ఫ్రెండు లలిత. 'తెలివైనది' అనుకుంది. ఎవరో దారి తెలియని బాటసారి దారికోసం అడుగుతున్నాడు. ప్రక్కింటిముందొక బిచ్చగత్తె దోసిటతో నీళ్ళుపట్టి త్రాగుతోంది.

కారులోంచి ఎగరేసిన సినిమా కాగితాల్ని ఏరుకోవటంకోసం పరిగెత్తాడో కుర్రాడు.

అతనెక్కడో ఏ సుదూర తీరాల్లో-ఏ అదృష్టవంతురాల్ని అర్థాంగిగా పొందాడో-ఏ భాగ్యనౌకల్లో విహరిస్తున్నాడో—

ఇవేమీ తెలియని ఆమె విప్పారిన నేత్రాలతో భవిష్యత్తునుగురించి బంగారుకలలు కంటూ నిరీక్షిస్తోంది.

అది నిరంతర నిరీక్షణ.






సినిమాలో నృత్యాలు





నృత్యదర్శకుడు వెంపటి సత్యం
వ్రాసిన వ్యాసం, మరికొన్ని చిత్రా
57 వ పుటలో చూడండి-





సమస్య తీరింది

"మ్యావ్! మ్యావ్!"

ఆలోచనల్లో మునిగి ఆకాశంవంక చూస్తున్న శంకరం త్రుళ్లిపడి ఆలోచనల గొడుగులోనుండి వెలబడి ఆశ్చర్యంతో ఇటూ అటూ చూశాడు. ఎదురుగా వీధిదీపం కాంతిలో కనిపించింది కుంటుతూ నడుస్తున్న పిల్లిపిల్ల.

దాని ముఖంలోని అమాయకత్వం, ఆ కండ్లలోని జాలిచూపు, కుంటికాలితో అది పడేబాధ, జాలిగొలిపే దాని అరుపు శంకరం హృదయాన్ని ద్రవింపజేశాయి. సానుభూతి ప్రకటించింది అతని మనసు. దానివంకే అట్లాగ తదేకంగా కన్నార్పకుండా చూడసాగాడు.

కుంటినడకతో మెల్లి మెల్లిగా, 'మ్యావ్ మ్యావ్' మని అరుస్తూ శంకరం కూర్చున్న అరుగెక్కింది. స్థంభంవార లైటునీడలో ఒదిగికూర్చుని శంకరం ముఖంలోకి చూడసాగింది.

శంకరంగూడ దానివట్లాగే చూడసాగాడు. పాత ఆలోచనలన్నీ ఎచటికో పోయి అతని మనస్సంతా పిల్లిపిల్లగూర్చిన ఆలోచనలతో నిండిపోయింది. వాతావరణమంతా నిశ్శబ్దంగావుంది. ఆ ఊరికి మారుమూల వీధేమో పదిగంటలకే మాటుమణిగిపోయింది. అందరూ ఎవరిండ్లలో వారు తలుపులు బిగించుకుని గాఢనిద్రా పరవశులైనారు. దోమలబాధ భరించలేక అరుగుమీద శంకరమొక్కడే కూర్చున్నాడు. ఆ రాత్రి.

అతని బుర్రంతా ఆలోచనలతో నిండిపోయింది. అన్ని ఆలోచనలు ఆ పిల్లిపిల్లకు సంబంధించినవే! దీనితల్లి ఎక్కడుందో? పాపం! తప్పిపోయాయి కాబోలు రెండూను? లేక ఎవరైనా ఈ పిల్లిపిల్లల పోరు పడలేక బయటకుగెంటి తలుపు లేసుకున్నారేమో? ఎంత కఠినహృదయాలు వారివి? తోటిమానవుడు కష్టపడుతుంటేనే కాస్తంత సానుభూతి చూపని వీళ్లు ఒక అల్పజంతువును చూస్తారా? ఎంత మారిపోయింది కాలం? నగ్నంగా, మాడే డొక్కతో, లోతుకు...యిన కళ్లతో, ఎముకలే తప్పకండ ఏ కోశానా లేని శరీరాలతో రోడ్లవెంట తిరుగుతూ, నల్గురిచేత అసహ్యించుకోనబడుతూ హోటళ్ల ముందు పారేసిన ఎంగిలాకులకై కుక్కలతో కాట్లాడుతూ నికృష్టజీవనం గడిపే మానవు లెందరు లేరు? సహాయంకాగు, అసలు సానుభూతినయినా చూపని ఈ ప్రపంచం ఒక క్షుద్ర జంతువును, ఒక పిల్లిపిల్లను చూస్తుందా?

ఎంత జాలిగా వుంది ఆ అరుపు! తనకు పిల్లి భాషవచ్చినా బాగుండును. తన గుర్తికి ఎంతగా విలపిస్తున్నదో? ఈ లోకాన్ని ఎంతగా తిట్టుకుంటున్నదో? ఇంతకీ ఏమైనా తిన్నదో? లేదో? బిచ్చగానికి పట్టెడన్నం పెట్టలేని మనుష్యులు పిల్లిపిల్లకు పాలేం పోస్తారు? దాని ముందుగతి దానికి తెలియదు. అర్ధరాత్రి! వీధంతా నిశ్శబ్దం! తిన్నాడు గాబట్టి సరిపోయింది గాని ఏ

"నవ్యశ్రీ"

కుక్కైనా చూస్తే దీని గతేమిటి? శరీరం జలదరించింది శంకరానికి. అబ్బ! కళ్లు గట్టిగా మూసేసుకున్నాడు రెండుచేతులతో.

గుండె దిటవు చేసుకున్నాడు శంకరం. ఎట్లాగైనా పిల్లిపిల్లనుద్ధరించాలని నిశ్చయించుకున్నాడు. ముందు కర్తవ్యమేమిటా అని ఆలోచించసాగాడు. పిల్లిపిల్లను ఈ రాత్రికి తనయింట్లో వుంచుకుంటేనో? బాగానే వుంటుంది, కానీ...

...అపుడే దానికి ఆటంకం కలిగింది. ఇది నిద్రపోకుండా రాత్రంతా గోలచేస్తూ, అరుస్తుంటే నాన్నగారికి నిద్రాభంగమవుతుంది. అమ్మో! ఆయనకు నిద్రాభంగమవుతే ఇంకేమైనా వుందీ? మూడునాలుగు రోజులదాకా తనకు పచ్చి మంచినీళ్లు చుక్కలు కూడ పుట్టవు! ఎంత మాట, అవమానం, ఇంకా, ఇంకా ఏవైనా భరిస్తారుగాని ఆయన నిద్రాభంగంమాత్రం భరించరు. అంచేత ఒక అల్పప్రాణికోసం తనవంటి భారమైన ప్రాణాన్ని అంత కష్టపెట్టుకోడం చాలా తెలివితక్కువ పని. అంచేత ఆ ఆలోచన ప్రక్కకు నెట్టాడు.

తన యిల్లయింది. ఇక వీధిలో మిగతా వారిండ్లమీదకు మళ్లించాడు తన దృష్టిని. ఎవరింటి తలుపైనా తీసివుంటే చల్లగా వాళ్లింట్లో వదిలేస్తేనేం? వాళ్లే పడతారు మిగతాబాధ! అయినా ఇంత అర్ధరాత్రపుడు ఎవరు తలుపులు తీసుక పడుకుంటారూ?' అన్న ప్రశ్న ఎదురయింది మొదట్లోనే. అవును! ఎవరు తలుపులుతీసుకు పడుకోరు అందరూ భద్రంగా గడియలు పెట్టుకుని కాళ్లాలుగూడా బిగించుకుని పడుకుంటారు. అందులో మూడునాల్గు నెలలాయి దొంగతనాలుకూడ జాస్తిగా వున్నాయి. అందుచేత ఆభావంకూడా రద్దుచేసుకోక తప్పలేదు. 'అయినా ప్రయత్నించి చూడకూడదా?' అంది మనసు 'అవును! నిజమే!' అనుకున్నాడు తాను.

పిల్లిపిల్లను మెడవద్ద మృదువుగా పట్టుకుని బయల్దేరాడు శంకరం, వీధి చివరదాకా వెళ్ళి చూశాడు. అందరి ఇండ్ల తలుపులూ మూసుకు నేవున్నాయి. ఆఖరికి కిటికీ తలుపులుగూడ తెరచిలేవు. తానుకున్నదేగా! ఆపిల్లి పిల్లను చంక వేసుకుని తిరిగి తమ అరుగుమీదకొచ్చి కూర్చున్నాడు.

అనునయంగా దాని వీపుమీద నిమురుతూ ఆలోచించసాగాడు శంకరం. దీనిని ఎట్లా రక్షించాలా అన్నది సమస్యయి కూర్చుంది. ఇంతలోకే ఎదురు అరుగుమీదనుండి చెవులు బ్రద్దలుచేసే 'ఓం'కారం వినిపించింది. త్రుళ్లిపడి అటుదృష్టి సారించాడు ఎదురుగా వున్న 'సీతయ్య'గారి పాడుబడిన అరుగుమీదనుండి రెండు గాడిదలు రోడ్డుమీదకు దూకి పరుగుపందె మారంభిచాయి.

ఒకసారి అతనికిపోయిన ఆశ తిరిగి కలిగింది. ముఖంమీద మందహాసం వెలిసింది. తనకు దారిచూపించిన ఆగాడిదలకు మనసులోనే ధన్యవాదము లర్పించుకున్నాడు. 'అహా! ఖరోత్తములారా! మీ మేలు ఈ జన్మంలో మరచిపోగలనా? నడి సముద్రంలో మునిగేపడవలో, హోరుగాలిలో దారి తెన్నూ తెలియక కొట్టుమిట్టాడుతున్న నాకు చక్కనిదారి చూపించి అనుగ్రహించారు. మహానుభావులు మీరు! ఊరికే పట్టుకున్నాడా భగవంతుని తండ్రి వసుదేవుడు మీ పూర్వీకుల పాదపద్మములు?! ఇవే నాధన్యవాదములు!'

(47-వ పేజీ చూడండి)



ఆంధ్ర మహాభారతము

ఆ ది ప ర్వ ము - ష ష్ఠా శ్వా స ము

క. కడఁగి వృకోదరుఁ డసురం, బడఁగ వడిం బైచి వామపాదంబునఁ జే
డ్పడ వానిఱొమ్ముఁ దాఁచెం గడుకొని యసురయును లేచి కడు నుద్ధతుఁడై.

క. అనిలసుతుఁ బట్టికొని పెల్చన త్రోచి కడింగి కనకశైలనికుంజం
బునుబోనివానివక్షముఁ, దనదృఢతరముష్టిఁ బొడిచెఁ దద్దయు నలుకన్,

వ. భీముండు వాని హీనసత్త్వుంగా నెఱింగి సురహస్తిహస్తానుకారంబులైన సవ్యదక్షిణహస్తంబుల నమ్మనుజకంటకు కటికంఠ ప్రదేశంబులు వట్టికొని.

ఉ. దారుణజానుదండమున దండధర ప్రతిముండు భీకరా
కారుఁడు వానివీఁపు విఱుగం బొడిచెం బిశితంబుతో నవ
ద్వారములం మహారుధిర ధారలు బోరన నొల్క మాంసపం
కారుణవారిఘోరనదులై పఱవం విపినాంతరంబునన్.

వ. ఇట్లు బకాసురుండు భీముచేత నిహతుండయి విగతజీవితుం డగుచుండి యఱచిన నమ్మహాధ్వని విని వానిబాంధవులైన రక్కసులు పఱతెంచిన వారలం జూచి భీముం డిట్లనియె.

తే. ఇంక నెన్నండు రక్కసు లిద్ధరాత్మ,నట్లు మనుజులఁ దినకుండుఁ డదరిమనుజ
భక్షణము సేసితిర యేని బకునియట్ల,చత్తురని రక్కసులకెల్లఁ జాటెవినఁగ

వ అంత నారాక్షసులు భీతులై భీముచేసిన సమయంబున కొడంబడి నాఁటంగోలె నేకచక్రనివాసులకు నుపద్రవంబుఁ జేయ నోడిరట్లు భీముండు బకాసురుంజంపి (వానిం జంపుట జగద్విదితంబుగాఁ) దత్కళేబరం బీడ్చుకొనివచ్చి నగరద్వారసమీపంబునవైచి యందు విప్రులకు సంతోషంబుసేసి నిజనివాసంబునకుంజని తద్వృత్తాంతం బంతయుఁ దల్లికి సహోదరులకుం జెప్పియున్నంత.

ఉ. వీఁ డొకమంత్రసిద్ధుఁ డగు విప్రుఁ డసాధ్యబలుం బకాసురుం
డేఁ డనిఁ జంపెనట్టె యత నిం జని చూతమ యంచుఁ జెచ్చెరం
బోఁడిగ వేత్రకీయమున భూసురు లాదిగ వచ్చి చూచి ర
వ్వాఁడిమగంటిమిం వెలయువాని వృకోదరు నెల్లవారలున్.

క. అని యిట్లు పాండునృపనం,దనుల చరిత్రంబు సెప్పెఁ దా వైశంపా
యనుఁడు జనమేజయున కని, జనవినుత చరిత్రపాత్ర సౌజన్యనిధీ,

క. మలహారినాథ విలస,చ్చళుక్యకులతిలక రాజ సర్వజ్ఞ రిపు
ప్రలయప్రతాప పరనృప,లలనాననకమలహారిణలాంఛనమూర్తీ.

మాలిని. ప్రణమదఖిలధాత్రీ పాలకాలోలచూడా
మణిగణకిరణశ్రీ మండితాంఘ్రీ నరేంద్రా
గ్రణి నిఖిలమహీరక్షామణీ రాజనారా
యణ విమలమతీ శీతాంశువంశ ప్రకాశీ.

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతంబైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబునం గుమారాస్త్ర సందర్శనంబును ద్రుపదగ్రహణ మోక్షణంబును దుర్యోధను దుర్మంత్రంబును వారణావతయాత్రయు జతుగృహ దాహంబును విదురోపదిష్ట ద్వారంబునఁ బాండవాపక్రమణంబును హిడింబువధయును హిడింబా వివాహంబును ఘటోత్కచ సంభవంబును విప్రగృహంబున నజ్ఞాతచర్యయును బకాసురవధయును నన్నది షష్ఠాశ్వాసము.

శ్రీరాజరాజ వీర
శ్రీరమణీరమ్య గంధసింధురహాయశీ
తౌరూఢదక్ష దక్షమ
భూరిదయాలబ్ధసుస్థి రైశ్వర్యపదా.

ధృష్టద్యుమ్న ద్రౌపదుల యుత్పత్తి వృత్తాంతము

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె నట్లు పాండవులు విప్రవేషంబున నేకచక్రపురంబునందు వేదాధ్యయనంబు సేయుచు విప్రగృహంబుననున్న కొన్నిదినంబులకు నొక్కబ్రాహ్మణుండు ద్రుపదుపురంబునుండి చనుదెంచి విశ్రమార్థియైన నాగృహస్థుండు వాని నభ్యాగతపూజల సంతుష్టుంజేసి యున్నంతఁ గుంతీదేవి గొడుకులుందానును నవ్విప్రు నతిప్రీతి నుపాసించి యయ్యాయెందుండివచ్చితి రేదేశంబులు రమ్యంబు లెందులరాజులు గుణవంతు లని యడిగిన నవ్విప్రుం డిట్లనియె.

చ. పొలయక యెల్ల దేశములుఁ జూచితి నందుఁ బ్రసిద్ధు లైనరా
జులసుచరిత్రసంపదలుఁ జూచితి నాద్రుపదేశు దేశముం
బొలుపున నొండు దేశములు పోల్పఁగ నెవ్వియు లేవు సద్గుణం
బులఁ బతు లెవ్వరుం ద్రుపదుఁ బోలఁగ లేరు ధరాతలంబునన్.

వ. ఆద్రుపదుండు దనకూఁతు నగ్నికుండ సముద్భవయైనదాని నయోనిజ నగణ్యపుణ్య లావణ్య గుణసమన్విత నభిమతుం డైన రాజపుత్రునకు వివాహంబు సేయంగానక స్వయంవరంబు రచియించుచున్నవాఁ డనినం గుంతియు ధర్మతనయుండును విస్మితులై యది యేమికారణంబున నయోనిజయయ్యె నక్కన్య నెవ్విధంబున ద్రుపదుండువడసె దీని సవిస్తరంబుగాఁ జెప్పుమనిన నవ్విప్రుండు వారల కిట్లనియె.

సీ. ఆది భరద్వాజుఁ డనుముని కలశంబు,నం దుద్భవించిన యనఘమూర్తి
ద్రోణుండు మఱి పృషతున కుద్భవించిన,ద్రుపదుండు నొక్కటఁ దొడఁగి యిష్ట
సఖు లయి వేదముల్ సదివి ధనుర్వేద, మగ్నివేశులతోడ నర్థిఁ గఱచి
చని ద్రుపదుండు పాంచాలభూములకు రా,జైన భారద్వాజుఁ డతనికడకు

ఆ. నరిగి వానిచేత నవమానితుం డయి, హాస్తిపురికి వచ్చి యఖిలకురుకు
మారవరుల నెల్ల మానుగా శస్త్రకో,విదులఁ జేసె లోకవిదితయశుఁడు.

వ. ఇట్లు దనవలన విలువిద్య గఱచినపాండవకౌరవకుమారులం జూచి ద్రోణుండు నాకవమానంబు సేసినయప్పాంచాలు నోడించి పట్టికొని తెండిదియ నాకు గురుదక్షిణ యగు నని పంచిన నల్లె యని యందఱు నా ద్రుపదుపయిం బోయి వానిచేత నిర్జితులయిన నర్జునుండు ద్రుపదుతోడ మహాయుద్ధంబుసేసి వానింబట్టికొనివచ్చి ద్రోణున కొప్పించిన నతండును.

ఆ. ఉల్లసంబు లాడి యోడకు పొమ్మని, ద్రుపదు విడిచి పుచ్చె ద్రోణుచేత
నట్లు విడువఁబడి త దవమానతప్తుఁ డై, పృషతనందనుండు పెద్ద యలిగి.

వ. రణరంగంబున ద్రోణు వధియించునట్టికొడుకు నర్జునునకు దేవి యగునట్టికూఁతునుం బడయుదు నని బ్రహ్మవిదు లయినబ్రాహ్మణుల నివాసంబులకు జని నిత్యంబును బ్రాహ్మణోపాస్తి సేయుచు నొక్కనాఁడు గంగాకూలంబునందు వానప్రస్థవృత్తి నున్నయాజోపయాజు లనువారి నిద్దఱ ననవరతవ్రత వ్యాసక్తులంగాశ్యప గోత్రులం గని వారికి నమస్కరించి యందుఁ గొండుక యయ్యును దపోమహిమ నెవ్వరికంటెఁ బెద్దయైనవాని నుపయాజు నుపాసించి యిట్లనియె.

నక్షత్ర ఫలితాలు

[6 5 59 మొదలు 12-5-59 వరకు]

గ్రహ స్థితి.

బు శు	ర		కు కే
	6 తేదీని బుధుడు మేష ములో ప్రవేశించును. 7 తేదీనిక ర్తరీ ప్రవేశము మేష, వృషభ మిథున ములలో చంద్రుడు.		
శ	గు		రా

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్న కార్యములు శ్రమాధిక్యముతో ఫలిస్తాయి. కోర్టు దావాలు అనుకూలిస్తాయి. పరోపకారానికి ప్రయత్నపడి సాగక నిందలు పొందుతారు. భార్యకు అనారోగ్యము కలుగుతుంది. ఇచ్చి పుచ్చుకో నేపట్ల వివాదాలు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడివున్నా తోటివారి సహకారము లభిస్తుంది. వారమంతా వర్తకులకు నిరాశ అయినా వారాంతమందు స్వల్ప అనుకూలత.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము ఎన్ని అవాంతరాలు వచ్చినా పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభం పొందుతారు. ఆశించిన డబ్బు అందక అప్పు చేస్తారు. సోదర సహాయము కలుగుతుంది. ఆత్మీయులవల్ల నిందలు. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, భూస్వాములకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, లోహపు సామానుల వ్యాపారస్తులకు కష్టముతోకూడిన లాభము. 12 న ప్రమాద సూచన.

* కృత్తిక [అ, ఈ, ఊ, ఏ] *

ఈ వారము మీకు యోగప్రదము. బంధువుల సహాయముతోనూ, అధికారుల సహాయముతోనూ ఆటంకములను గడిచి ఫలం పొందుతారు. ఆదాయము అభివృద్ధి అవుతుంది. వైద్య జ్యోతిషశాస్త్ర ప్రసంగాలుచేస్తారు. ఈశాన్యదిక్కునుండి క్షేమవార్త తెలుస్తుంది. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 8, 9, 10 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. ఆశించిన సొమ్ము చేతికి వస్తుంది. నూతన కార్యములు ప్రారంభిస్తారు. కోర్టు దావాలలో అనుకూలత వుంటుంది. పండిత గోష్ఠి జరిపి నూతన విషయాలు తెలుసుకుంటారు. వారమంతా శుభయోగములతో కూడి వుంటుంది. 8, 9, 10 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి, పుత్రుల లాభాభివృద్ధి. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకూ మేలుగా వుంటుంది.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము వినోదములలో పాల్గొనుట, దధిక్షీర, మధుర పదార్థయుక్త సుభోజనము

బి. నరసింగరావు

రజత పాత్రములలో భుజించుట, నీటిపై ప్రయాణము చేయుట, తలచిన కార్యములలో జయము, తెల్లటి వస్త్రములు కొనుట మొదలగు యోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, బియ్యము, వెండి, ద్రవపదార్థ జనిత వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు,కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది. 12 న అధికఖర్చులు, ఆందోళన.

* ఆరుద్ర [కూ, ఖ, ఙ, ఛ] *

ఈ వారము ధనధాన్యవృద్ధి, యత్న కార్యలాభము, వివాహాది శుభ కార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తు లాభము, పరోపకారమువల్ల కీర్తివంటి రాజయోగములు కలుగును. విలువగల వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు రెట్టింపులాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము.

* పునర్వసు [కే, కో, హా, హీ]*

మీకు ఈ వారము కార్య భారము ఎక్కువ. రాబడి తక్కువ. గృహావసరములు తీరనందున కలతలు. ఆరోగ్యము చెడుచున్నట్లు సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా గ్రహరాజైన రవికి శాంతి చేయించుట మేలు. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన. రాజకీయవాదులకు స్వల్పానుకూలత. 7 న అనారోగ్యము. 9, 10, 11 పితృవర్గ సహాయము, ధనలాభము, ప్రయాణము.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా మిత్రసహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు ఏమంతబాగుండదు. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువుసాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అవయోగములున్నా మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదనవంటి శుభయోగములు కూడా కలవు.

* ఆశ్లేష [డీ, డూ, డే, డో] *

ఈ వారము మీరు సహాయము పొందదలుచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని అవుతుంది. ధనాభావము ఎక్కువగా వుంటుంది. ఇంట్లో వారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతవల్ల దైవముపై భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు మంచి కాలముకాదు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, విచిత్రములను చూచుట జరుగును. వారమంతా అవయోగ శుభయోగ మిశ్రమముగా వుంటుంది.

* మఖ [మా, మీ, మూ, మే.] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్న కార్యములు ఎక్కువ శ్రమతో ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిస్తవి. ఇతరులకు సహాయము చేయబూని సఫలముగాక నిందలు పొందుతారు. ఇచ్చి పుచ్చుకోవడములో వివాదములు వస్తాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనా

★ నక్షత్రఫలితాలు ★

దరణ; తోటివారి సహకారము. వర్తకులకు వారమంతా నిరాశ, వారాంతమున మేలు విద్యార్థులకు చదువు బాగా సాగదు. భార్యకు అనారోగ్యము

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
(మో, టా, టీ, టూ)

ఈ వారము ఎన్ని ఆటంకములువచ్చినా పట్టుదలతో ప్రయత్నించి కార్యసాధన పొందుతారు. ఆశించినసొమ్ము సమయానికి అందక అప్పుచేస్తారు. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు లోహ, ఖనిజ వ్యాపారస్తులకు కష్టముతోకూడిన యోగము. గనుల యజమానులకు, యంత్రములు నడుపు నిపుణులకు ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు మేలుకాలము

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

మీకు ఈవారము యోగకాలము. బంధువుల సహాయము, అధికారుల సహాయము కలుగుటచేత వచ్చిన ఆటంకములు గడిచి కార్యసిద్ధి పొందుతారు. ఆదాయమువృద్ధి అవుతుంది. శాస్త్రప్రసంగాలలో పాల్గొంటారు. కవులు నూతనరచన చేస్తారు. బంధువుల క్షేమవార్త తెలిసి సంతోషము పొందుతారు. విద్యార్థులకు ఉత్సాహముగా ఉంటుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలం.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు మంచి భాగ్యయోగం. అనుకున్నడబ్బు చేతికిగస్తుంది. ఇబ్బందులు తీరుతాయి. దావాలలో గెలుపుపొందుతారు పిల్లల అభివృద్ధికి చేసేప్రయత్నాలు ఫలిస్తాయి. విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలు కాలము. ఉద్యోగస్తుల హోదా పెరుగుతుంది.

చిత్త [పే, పో, రా, రి]

ఈవారము మీకు యోగదాయకము. ధనయోగము వుంటుంది. సంగీతసభలు, కవితాగోష్టివంటి వినోదములలో బంధుమిత్రులతో కలసి పాల్గొని మృష్టాన్నభోజనము వెండిపాత్రలలో చేస్తారు. శుభకార్యములలో కూడా పాల్గొంటారు. నీటిమీదప్రయాణము చేయవలసివస్తుంది. నూలు, బట్టలు, బియ్యము వెండి వర్తకులకు లాభము. విద్యార్థులకు ఉత్సాహముగా చదువు సాగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలం.

* స్వాతి [రూ, రే, రో, తా]*

ఈవారంకూడా గతవారమువలెనే యోగదాయకముగా వుంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభదాయకముగా ముగుస్తాయి. శుభపుణ్యకార్యాలలోపాల్గొంటారు. నూతన గృహనిర్మాణమునకు ప్రయత్నాలు చేస్తారు. వాహనయోగము కలుగుతుంది. వుద్యోగస్తులకు హోదా పెరుగుతుంది. వర్తకులకు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో ఎక్కువ లాభము. వారమంతా శుభయోగములతో కూడివున్నా కుటుంబకలహముచే ఆందోళన కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగం.

ఈవారము ధరలు:

నూలు, వస్త్రములు:- నిలకడగావుండును.

నూనెదినుసులు:- స్వల్పముగా పెరుగును.

ఆహారధాన్యములు :- మార్పులేదు.

బెల్లము, పంచదార:- నిలకడగా వుండును.

చింతపండు:-స్వల్పముగా పెరుగును.

పప్పుదినుసులు :- స్వల్పముగా తగ్గును.

వెండి, బంగారము:- స్వల్పముగా పెరుగును.

జన్మనక్షత్రమును బట్టిగాని, జన్మనక్షత్రము నెరుగనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోనునది. కృష్ణుడను పేరునకుమృగశిరానక్షత్రమును, హృష్ణుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయునూ చూచుకోనునది.

* విశాఖ [తీ, తూ, తే, తో]*

ఈవారము రాబడి తక్కువ; ఖర్చులు ఎక్కువ. కార్యభారము చే తీరుబడి వుండదు. గృహావసరములు తీరక ఇస్పర్ధలు వస్తాయి. ఆరోగ్యము చెడుతున్న చిహ్నాలు కనపడగానే ఔషధచికిత్స పొందడము, రవికి శాంతి చేయించడము మంచిది. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. వారమంతా భయాందోళనలతో కూడివున్నా పితృవర్గ సహాయము, కార్యలాభం, ప్రయాణము కలుగును.

* అనూరాధ [నా, నీ, నూ, నే] *

ఈ వారము నిరాశగావున్నా అజ్ఞాతమిత్రసహాయంవల్ల కార్యలాభం అవుతుంది. ఇంట్లోవున్నవారి ఆరోగ్యము చెడుటచే ఆందోళన కలుగుతుంది. ఉద్యోగస్తులకు స్వల్పఅనుకూలత. వర్తకులకు వారాంతమందు లాభము వారమంతా ఉద్రేకంతో కూడివుంటుంది. విదేశీయుల పరిచయము, అపురూపవస్తు సంపాదన వుంటవి. ఆత్మీయుల

అనారోగ్యముచే వ్యథ, అధిక ఖర్చులు, విద్యార్థులకు చదువు బాగా సాగదు.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు మిశ్రమయోగము. ఆశించిన సహాయము లభించక, అవసరములు తీరక అశాంతి కలుగుతుంది. అయినను ఈశ్వరానుగ్రహమువల్ల కష్టములు గడచి కార్యసిద్ధి పొందుతారు. వర్తకులకు చాలా కాలంనుండి నిలిచిపోయిన బాకీలు వసూలవుతవి. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ. పుణ్యపురుషుల సాంగత్యమువల్ల మనోవికాసము కలుగుతుంది. వారమంతా అశాంతివున్నా నష్టద్రవ్య లాభము పొందుతారు.

*** మూల [యే, యో, బా, బీ] ***

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. ఇచ్చి పుచ్చుకు నేపట్ల వివాదాలు వచ్చి మనోవ్యథ కలుగుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలించినా ఆ సంతోషము అమిత ఖర్చులవల్ల వుండకుండా పోతుంది. భార్యకు అనారోగ్యము కలిగే సూచనలున్నవి. మినుములు, కొర్రలు, రాగులు, ఉప్పు, నువ్వులు, నూనె వ్యాపారస్థులకు లాభయోగము. ఇతర జాతులవల్ల గౌరవము, కలుగుతుంది. 12 న భార్య ఆరోగ్య భంగము. అధిక ఖర్చులు.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈ వారము ఎంతప్రయత్నించినా యత్న కార్యములకు ఆటంకములు కలుగుతునే వుంటవి. అయిననూ పట్టుదలతో కార్యలాభము పొందుతారు. సోదరసహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, లోహ, ఖనిజ వ్యాపారులకు, పోలీసుశాఖ ఉద్యోగులకు మేలు కాలము. 12 న ప్రమాదభయం, అధిక ఖర్చులు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీకు యోగదాయకము. ప్రయత్నించిన పనులు నెరవేరుతవి. ధనలాభము కలుగుతుంది. ఈశాన్యదిక్కునుండి క్షేమవార్త తెలుస్తుంది. శుభకార్యములలో పాల్గొంటారు. బంధుదర్శనము కలుగుతుంది. గణిత, జ్యోతిషశాస్త్ర చర్చలు జరుపుతారు. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, ఇత్తడి, కంచువర్తకులకు లాభదాయకము. కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకు మేలుకాలము. 7 న అధికఖర్చులు, ఆపైని ధనలాభము.

*** [శ్రవణము జూ, జే, జో, ఘా]***

ఈ వారము మీకు శుభయోగము. ఆశించినడబ్బు చేతికివస్తుంది. ఇంట్లో శుభకార్యాలకు ప్రయత్నములు చేస్తారు. పుణ్యకార్యాచరణ, శాస్త్రచర్చలు, ప్రభుత్వ సన్మానమువంటి యోగములు జరుగుతవి. విద్యార్థులు నూతనాంశాలను నేర్చుకుంటారు. ఇంట్లో వున్నవారి ఆరోగ్యము బాగుపడుటచే ఆందోళన తొలగుతుంది. పిల్లల క్షేమలాభములకొరకు కొన్ని యేర్పాట్లు చేస్తారు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుగా ఉంటుంది.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము మీరు తలపెట్టిన పనులలో జయము పొందుతారు. బంధుమిత్రులతో మృష్టాన్నభోజనము చేస్తారు. వినోదములలో పాల్గొంటారు. విద్యార్థులకు చదువు ఉత్సాహముగా సాగుతుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి బియ్యము, ద్రవపదార్థ జనిత వస్తువర్తకులకు లాభదాయకము నీటిమీద ప్రయాణము చేయవలసి వస్తుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము.

శతభిషం [గో, సా, సీ, సూ]

ఈ వారము మీకు యోగప్రదము. ధనధాన్యవృద్ధి వుంటుంది. వివాహాది శుభకార్యాలోచనలు ఫలప్రాప్తి పొందుతాయి. ఇష్టవస్తు లాభము, పరోపకారమువల్ల కీర్తి కలుగుతాయి విద్యార్థులకు చదువు చురుకుగ సాగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు ఎక్కువ లాభము కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగదాయకము.

*** పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]***

ఈ వారము కార్యభారము ఎక్కువ. వింత మాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ప్రయాణము, ధనలాభము వుండును. అకాలభోజనమువల్ల అనారోగ్యము కనబడగానే జాగ్రత్తపడుట మంచిది. ఉద్యోగస్తులకు స్వల్పఅనుకూలత, విద్యార్థులకు చదువు బాగా సాగదు. రాజకీయవాదులకు వారమంతా అలజడితోపాటు అనుకూలత. 7 న అనారోగ్యము, ఆపైన శుభయోగము, కార్యసిద్ధి.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]

యీ వారము యత్నకార్యములకు ఆలస్యము. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల ఆరోగ్యము చెడుటచే చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులకు వనపర్వత ప్రాంతములకు బదిలీ అయే సూచనలున్నవి. రహస్యములను కనిపెట్టుటకు వినియోగించబడుతారు. వారమంతా చికాకుగా వున్నా వారాంతమందు అజ్ఞాత మిత్రుని సహాయమువల్ల కార్యసిద్ధి జరుగుతుంది.

*** రెవతి [దే, దో, చా, చీ] ***

యీ వారము ధనాభావము ఎక్కువ. ఎవరి సహాయమువల్ల కార్యసాధన చేదామనుకున్నారో వారివల్ల ఆటంకములు కలుగుతాయి అయినా ఈశ్వరానుగ్రహంవల్ల క్రమేణా కార్యానుకూలత అవుతుంది. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుండదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వర్తకులకు నిరాశ. విద్యార్థులకు మంచి రోజులు కావు. వారమంతా ఆందోళనగా వున్నా సజ్జన సాంగత్యము, పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, నష్టద్రవ్యలాభము కలుగును. ★



వనితా లోకం



మనకి కనిపించని మన అలవాట్లు

రోజూ మన మెందరితోనో మాటలాడుతూ వుంటాం. ఎన్నో రకాల మాటలు వింటూ వుంటాం. మాటలాడటంకూడా ఒక కళ. చాలమంది కిది ఓహాబీ-సరదా-కుండపోతగా వర్షించే మాటలమధ్య కొందరు చాలా విచిత్రమైన పనులు చేస్తూ ఉంటారు. చాలా గమ్మతయిన అలవాట్లుంటాయి. నేను చెప్పొచ్చేది. వేదికలమీదనుండి మాటాడే వారి గురించికాదు. నలుగురమూ ఆడాళ్ళం ఓ చోట కూర్చుని పిచ్చాపాటి లేవదీసినప్పటి మాట! నలుగురు ఆడాళ్లు ఓచోట చేరారంటే ఓపాతికెన డాయింజనూ, రెండు రేడియోలు, మూడు లౌడ్‌స్పీకర్లు, ఒహాటిన్నర గ్రామఫోను ఉమ్మడిగా తయారుచేసే శబ్దజాలం గ్యారంటీగా ఉత్పత్తి అవుతుందని మా నాన్నగారు ఒహప్పుడు బట్టీ పట్టిన అభిప్రాయం. సదరు అభిప్రాయాన్ని అటుంచి మన మాటలమధ్య పాతుకొనిపోయిన కొసిని అలవాట్లని గురించి మాట్లాడుకుందాం.

ఇదో రకం ‘ఎత్తిపొడుపు’

మా పిన్నిగారు మంచి మాటకారి. ఊళ్ళదంపే అయినా లా-ప్రతిదాంట్లోను లా-పాయింట్లుతీస్తూ చాలా సరదాగా మాట్లాడుతుంది. కానీ ఓ ప్రక్కన సంతత ధారాపాతంగా మాట్లాడుతూనే “ఇదుగో అమ్మాయ్! వింటున్నావా?” అంటూ చూపుడువేలుతో భుజాలమీద పొడుస్తూ వుంటుంది. ఎంత జాగ్రత్తగా వింటున్నా అలా పొడుపులు తినటంనుండి తప్పించుకోలేం.

“వింటున్నా పిన్నీ!” అని అన్నా “ఆ! వింటున్నావా! విను” అని మరోమాటు పొడిచికానీ మాట లారంభించదు. మధ్య మధ్య అలా పొడుస్తూ వుండందే ఆవిడకూ చెప్పాలనిపించదుట. మాట్లాడితే తమాషా తమాషా కబుర్లు చెబుతుంది. కానీ వచ్చిన చిక్కంతా ఆవిడ చూపుడు వేలితోనే. అంచేతే ఆవిడగారితో మాట్లాడాలంటే ఆరు గజాలదూరంలో నించొని మాట్లాడాలి. దగ్గరనుంచున్నామంటే ‘యింజక్షన్’లు తప్పవు.

“ఇలా చూడు”

మా స్నేహితురాలో కొలిష వుండేది. నలుగురమూ కూర్చొని మాట్లాడుకుంటున్నప్పుడు ఎవరైనా తల కొస్తా ప్రక్కకు తిప్పితేసరి. “ఇగుగో యిలా వినవే!” అని గబుక్కున ముఖాన్ని ఎదటికి తిప్పుకుంటుంది. అలా తల ప్రక్కకి తిప్పితే ఆ అమ్మాయి అటెన్షన్ చెడిపోతుందట. మొహం ఆ అమ్మాయికేసి సూటిగా వుంటే తప్ప మాట్లాడ బుద్ధెయ్యదట. ఆ అమ్మాయి ఎదట కూర్చొని ఊకొడుతూ పొరపాటున తల ప్రక్కకు తిప్పామా తల అర్థ చంద్రాకారంగా తిరగటం మానేసి చక్రాకారంగా తిరగటం మొదలెడుతుంది.

చింపి పొయ్యడానికి ప్రత్యేకం

ఓ రోజు మా చెల్లాయి స్నేహితురాలు మా యింటికి వచ్చింది. కాఫీ వేళ కొబట్టి కాఫీ సేవించి, యింకా పొద్దువాలలేదని, చాప వేసుకూర్చుని కబుర్లు ప్రారంభించాము. పొద్దుపోకా, నిద్ర రాకా బామ్మగారు మా ఎదటే వత్తులు చేసుకుంటూ కూర్చున్నారు. మా చెల్లాయి స్నేహితురాలు ఓ వేపు మాట్లాడుతూనేవుంది. ఆట ఆపేసినప్పుడల్లా చాపలోంచి తేలెడు పుల్ల లాగి ముక్కలు ముక్కలుచేసి పోగులు పెడుతోంది. మాటల సందడిలో మేము దాన్ని గుర్తించలేదు కానీ వత్తులు చేస్తున్న బామ్మగారు దాన్నెప్పుడో పసకట్టేసి గబగబా యింట్లోకివెళ్ళి ఎక్కడో మూలని పడేసిన చింకిచాప తెచ్చి ఆ అమ్మాయి ముందర పడేసి “ఇగుగో అమ్మాయ్! ఈ చాపలోంచి నీ యిష్టం వచ్చినన్ని పుల్లలు బయటకులాగి చిరి చేసుకో! సలక్షణమైన ఆ కొత్తచాప నెందుకు పాడుచేస్తావ్!” అంది. అప్పటిగ్గానీ ఆ అమ్మాయి చేస్తున్న పని మా కంటపల్లేదు. మా బామ్మ డైరెక్టుగా ముఖాన్నె అంతమాట అనేసినందుకు ఆ అమ్మాయి చిన్న బుచ్చుకుంది. చాలా సిగ్గుపడింది. నాకు గూడా బామ్మ మాటలు నచ్చలా. కానీ నోరు తెరచి ఎవరూ ఏమీ వ్యాఖ్యానం చెయ్యలేదు. తర్వాత ఆరు నెలలకు గానీ ఆ అమ్మాయిని కలుసుకోలేదు. ఆ అమ్మాయి నన్ను చూడగానే “మీ బామ్మగారు బావున్నారా?” అనడిగింది. ఆర్నెళ్ళ క్రిందట జరిగిన కథ నెమరు వేసుకొని “మా బామ్మగారిమీద యింకా కోపంపోలేదా?” అన్నా నవ్వుతూ. “అబ్బే! అదికాదు! మీ బామ్మకు థాంక్సు చెప్పాలి! ఆ రోజునుండి మాట్లాడుతూవుండగా చేతులు పరిసరాల్ని ధ్వంసం చెయ్యటానికి సాహసించలేక పోయాయి!” అంది.

గిల్లిపోగు లెయ్యడానికి

నాకు్కూడా మొన్న మొన్నటిదాకా ఓ అల

టి. రామలక్ష్మి

(జమ్మలమడుగు)

వాటుండేది. మాట్లాడుతూ కూర్చున్నానంటే గోళ్ళు, గోడ బెల్లులో గిల్లిపోస్తూ ఉండడం నాకలవాటు. గోడప్రక్కని కూర్చున్నానంటే సున్నంగిల్లుతూ కూర్చుండేదాన్ని. లేకపోతే గోళ్లుగిల్లుకుంటూ వుండేదాన్ని. ఓమాటు మా తెలుగు లెక్చరరు గారింటికి వెడితే ఆవిడ గోడప్రక్కని కుర్చీ వేసి కూర్చోబెట్టింది. ఆవిడగారితో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ నేనా చేతులు అప్రయత్నంగా గోడల్ని గిల్లి పారెయ్యటం మొదలెట్టాయి. కాస్తా సున్నపెడ్డ గోడ మీదినుండి లాగేసి విరిచిపారేసేదాన్ని. ఈ విశేషం కాస్తా పసికట్టి మా లెక్చరరుగారు "ఇదుగో అమ్మాయ్! నీవుచేస్తున్న పని బాగానేవుంది కానీ నివిక్కడినుండి వెళ్లిపోయేటప్పుడు ఆ సున్నం తిరిగి యథాస్థానవుండేలా చూడు!" అంది. ఆరోజునుండి ఓవారంరోజులదాకా క్లాసులో ఆవిడ క్లాసులో గోడప్రక్కని కూర్చుని కనిపించానంటే "ఏంఅమ్మాయ్? సున్నం గిల్లటానికా?" అనేది. దానితో ఆ చేతులు గోడమీదికిపోకుండా జాగ్రత్తపడ్డాను. నోటితో గోళ్లుగిల్లుకోవటం మానిపించటానికి మా బామ్మే పూనుకోవలిసివచ్చింది.

నెయిల్ సర్వీసు

ఓరోజు మా బామ్మ తాలూకు దూరపు బంధువు లెవరోవచ్చారు. ఇంట్లో పెద్దమ్మాయిని కావటంతో బామ్మతోసహా వారిని కబుర్లతో గౌరవించటంలో నాకూ వంతు దొరికింది. కానీ నేనట్టే మాట్లాడవలసిన అవసరం లేకపోయింది. వాళ్లంతా పూర్వకాలం సంగతుల్లోములిగిపోయారు. నేనుఏం చెయ్యటానికి పాలుబోక నెమ్మదిగానోటితో గోళ్లుగిల్లి ఉమ్మేయటం ప్రారంభించాను. ప్రమాదవశాత్తూ ఓ గోరు తాలూకు ముక్క బామ్మగారి చేతిమీదపడ్డది. మా బామ్మగారూ తన పూర్వకాలం సంగతి మాట్లాడుతూవుంటే అంతమాత్రానికే సంచలించేది కాదు. ఖర్మవశాత్తూ అప్పుడే తనవంతు మాటలు ముగించుకొని వూపిరి పీల్చుకొంటూంది. అంచేత నేను దొరికిపోయాను. "బావుంది! పొద్దస్తమాన నీగోళ్ళు గిల్లుకోకపోతే నాకీకాస్త గిల్లిపెట్టకూడదూ! పళ్లులేక గిల్లుకోలేక అవస్థపడుతున్నా!" అంది. తక్షణం నాకు కోపంవచ్చింది-కొత్తవారి ముందట బామ్మ నాతప్పు పసికట్టినందుకు. కానీ నాకోపాన్నికూడా వారిని చూసి ఆపుకోవలసివచ్చింది. లేకపోతే పేలపుగింజ మోతాదులో బామ్మమీదకు దూకివుండేదాన్నే!

మరికొన్ని దురలవాట్లు

కొందరేం చేస్తారంటే మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రక్కని చిన్న కాగితం ముక్కో, దారం ముక్కో కానొస్తే గబుక్కున నోట్లో వేసుకు నమిలి ఉమ్మేస్తూ వుంటారు. ఉమ్మేయటం గురితప్పి ఎదట వారిమీదపడితే యోజించండి ఏలా వుంటుందో? ప్రక్కని బస్తాలు మొదలైనవేనైనా వుంటే వాటిని వేళ్ళతో కెలికి అందులోని వస్తువుల్ని పరిశీలిస్తూ వుండటం కొందరి కలవాటు.

ఇంకొందరు పెద్దవాళ్ళు చేతికి పుల్ల దొరికిందంటే చాలు గబుక్కున పళ్ళసందుల్లో గుచ్చుకొని మాట్లాడుతూ వుంటారు. ఆలాంటపుడు వారినోటి తుంపురులు ఎదటివారినెలా అభిషేకిస్తాయో వాళ్ళకేం తెలుసు మాట్లాడేటప్పటికంటే పుల్లల్ని పళ్ళ సందుల్లో యిరికించి మలినాల్ని తోసెయ్యటానికి మంచిసమయం దొరకదని కాబోలు! పళ్ళ సందుల్లోవున్న మలినాల్తోపాటు రక్తాన్నీ, ఉమ్మినీ నోటిలో ఆలాగే స్టాకు వుంచుకొని అడపాతడపా బయటికివెళ్ళి ఉమ్మేసి వస్తూంటారు. బయటికివెళ్ళే ఓపిక లేని వాళ్ళయితే ఆ ప్రాంతాల్లోనే ఉమ్మేసెయ్యవచ్చు. కనీసం ఆ ఓపికాలేనివారు ఆలాగే నోరు పైకెత్తుకుని చెడమడా మాట్లాడెయ్యవచ్చు. ఈలాంటి అలవాట్లున్న వారికి ఆపని ఎంత అందంగా కనిపిస్తుందో కానీ ఎదట కూర్చున్న వారికిమాత్రం ప్రాణసంకటంగా వుంటుంది. మర్యాద ఒహాటి పీకనొక్కెయ్యటంవలన ముహంచిట్లించటంతో సరిపెట్టుకొని నోరు మూసుక్కూచుంటామనుకోండి.

ఈ అలవాట్లు ఆడవారికి మాత్రమే పరిమితంకాదు. ఈలాంటి విషయాల్లో మగమహారాజు కూడా తక్కువ తిన్నవారేం కాదు. ఈ అలవాట్లు మనలో రెండు తెగలవారికే ఎక్కువగా అలవడివుంటాయి. అతిగా వినలేమన్నా నించోబెట్టి మాట్లాడేవారిలో, ఎన్నడోగాని నలుగురిఎదటాపడి మాట్లాడటం చేతకాని వారిలో.

మొదటిరకం వారి మాటలకు, ఎదటివారు విసుక్కుంటున్నా వారు చెప్పుకోవటం మాత్రం ఆపెయ్యరు. కాస్తా తలపక్కకి తిప్పి ఉమ్మేసి వచ్చేసరికి మన మొక్కడ మాయమైపోతామోనని వారిబాధ! అంచేత ఉమ్మినీ తదితర చెత్తా చెదారాన్ని నోట్లో నిలవ వుంచుకొని ఏదో మనల్ని ఉద్ధరించడం

(46-వ పేజీ చూడండి)



పుష్పాల నవ్వులు — ఫొటో: సోమయాజులు.



రాధామాధవులు

చిత్రకారుడు : ఎమ్. ఎల్. నరసింహారావు—చోరగుడి.

★ ఈ వేసవిలో ★

వస్తుంది వస్తుంది అన్న వేసవికాలం రానే వచ్చేసింది. వేసవి వస్తోందంటే మామిడి పళ్ళు, మల్లెల సువాసనలు వాటితోపాటే సెగ్గడ్డలు చెమటపొక్కులు చటుక్కున గుర్తొస్తాయి.

ఒక చెంప వేడిగాడ్పు కొడుతుంటే ఒక ప్రక్క కడుపులోకి తీయతీయని మామిడి పళ్లు చల్లగా జారిపోతుంటాయి.

ఏ కాలములోనూ తీసుకోనటువంటి జాగ్రత్తలు ఈ కాలములో తీసుకోవాలి. ఈ కాలములో ఎంత తక్కువ మేకప్ చేసుకుంటే అంత మంచిది. డ్రస్ విషయములో కూడ అంతే. ఎంత సింపుల్ గా డ్రస్ చేసుకుంటే అంత హాయిగా వుంటుంది. అతి పల్చని బట్టలు వాడితే ప్రాణము తేలికగా వుల్లాసముగా వుంటుంది. ఈ కాలములో ముఖ్యముగా తీసుకోవలసిన విషయము— రెండుపూటలూ స్నానము చేయుట మానకూడదు. ప్రొద్దున స్నానము చన్నీళ్ళతో కానిచ్చినా సాయంత్రపు స్నానము కొంచెం స్థాయిలో గోరువెచ్చటి నీళ్ళతో చేయాలి. వెచ్చటినీళ్లు ఉపయోగిస్తే చమట పొక్కులు లేచే అవకాశముండదు.

రెండుపూటలూ స్నానము చేస్తే రెండు పూటలు బట్టలు మార్చాలని చాలమంది వెనుకాడుతుంటారు. అయినా మధ్య తరగతి కుటుంబీకులు రెండుపూటలా చీరెలు మార్చాలంటే కష్టము. తడవ తడవకీ చీర మార్చకపోయినా అండర్ వేర్స్, జాకెట్లు మాత్రము విధిగా మారుస్తూండాలి. ఇవి మార్చకపోతే రోజుకి ఎన్నిసార్లు స్నానము చేసినా చమటమాత్రము పోదు. ఒంటినున్న చమటంతా బట్టలకు ఇంకుతుంది. అందుకనే అండర్ వేర్స్ తప్పక మారుస్తూండాలి.

ఎం. ప్రభావతి (చిలకలపూడి)

చమట వాసన రాకుండా వుండాలని ఎన్ని సెంట్లు వాడినా చమట వాసన మాత్రము పోగొట్టలేము. ఇలా చెమట వాసన వస్తున్న వారి సమీపానికి వెళ్ళటానికే భయము పుట్టుంది. ఈ కాలములో పట్టు, జార్జిట్, వెల్ వెట్ లాంటి సిల్కులు చాల తగ్గించాలి. ఎక్కువగా వాయిల్సు, గ్లాస్కో వంటి సన్నని బట్టలు ఉపయోగించాలి.


ఆహార విషయములో కూడ జాగ్రత్తగా వుండాలి. కాఫీ, టీ, లు తగ్గించాలి. వాటి బదులు కూల్ డ్రింక్సు ఎక్కువగా వాడాలి. అంటే షర్ బత్, సబ్జా గింజలతో తయారు చేసిన డ్రింకులు తీసుకుంటే అంత మంచిది. అసలు ఈ కాలములో ద్రవ పదార్థములు ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత బాగుంటుంది. సాధారణంగా ప్రొద్దున్నే టిఫిన్ తీసుకోవటము తగ్గిస్తే ఇంకా మంచిది. కొంపతీసి వుదయమే పలహారము తీసుకున్నట్లయిన కూజా, మెడకు కట్టుకోవలసివస్తుంది. ఎక్కువ వేడిచేసే వస్తువులు తినకూడదు. ఈ కాలము మామిడిపళ్లు విపరీతముగా వస్తాయి. అవి తిన్నప్పుడు తియ్యతియ్యగా బాగానే వుంటాయి కాని ఆ తర్వాత సెగ్గడ్డలు లేస్తే గాని మన అవస్థ తెలియదు. ఈ అవస్థలు రాకుండా ముందే జాగ్రత్త పడాలంటే, ముఖ్యముగా మామిడిపళ్లను లిమిట్ గా తీసుకోవాలి. అంటే అ సమానూ ఏ టైములో బడితే ఆ టైములో తీసుకోక ఒక టైము అంటూ నిర్ణయించుకుని తింటుండాలి. అన్నము తినేటప్పుడు మజ్జిగ అన్నముతో పాటో లేక చల్లబాటువేళో ఈ మామిడి పళ్లు తినటము మంచిది. పళ్లు తినేముందు ఒక పూటంతా పళ్లను నీళ్లల్లో వుంచితే వుడుకు చేయదు.


ఇంత జాగ్రత్తగా వున్నప్పటికీ ఒక్కొక్కళ్లకి వొంటి తీగను బట్టి గడ్డలు లేస్తుంటాయి. అటువంటప్పుడు అశ్రద్ధ చేయక వెంటనే ఆ గడ్డకు, గుంపపసుపు కొమ్ము అరగదీసి పట్టువేసినట్లయితే గడ్డ అణిగిపోతుంది. లేకపోతే త్వరగా పక్వానికి వచ్చి చితికిపోతుంది.

వేసవి రావటమే తరువాయి కొందరి శరీరాలు బాగా పేలిపోతాయి. అంటే చమట పొక్కులన్నమాట. వాటిని తీరుబడిగా గిల్లుకుంటూ కూర్చుంటారు. ఆ తర్వాత తట్టులు తేలటము, మంటలు పుట్టుకొస్తాయి. అట్లాకాక చెమట పొక్కులు ఆరంభిస్తున్నాయంటే ముందు సాంబ్రాణిపు చెక్క తీసుకోవాలి. బాగా గంధము ఒంటినిండా చెమటపొక్కులు వున్నచోటల్లా పామేసి కాస్సేపు గాలికి ఆరనివ్వాలి. సాయంత్రము స్నానము చేసినాక ఏదైన టాల్కమ్ పౌడరు వంటినిండా అద్దుకుంటే మంటలు కొంత తగ్గుతాయి.

పెద్దవాళ్ళు తమ శరీరరక్షణకై ఎంత పాటుబడతారో, చిన్నపిల్లల విషయములో కూడ అంత జాగ్రత్త తీసుకోవాలి వాళ్లకూ రెండుపూటలు స్నానము చేయించాలి ఏపూటకాపూటే డ్రస్సు మారుస్తుండాలి. వళ్ళు పేలకుండా మంచిగంధము పూస్తూ పౌడర్ అద్దుతుండాలి. వాళ్ళకు ఎంతసేపూ అతి పల్చని వాయిలూ, గ్లాస్కో బట్టలు వాడుతుండాలి. వాళ్ళకు వేడిచేయకుండా వుండటానికిగాను ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష నీళ్లల్లో నానబెట్టి ఆ రసము మధ్యాహ్నవేళ ఇస్తుండాలి.

ఈ వేసవిలో పిల్లలుగాని పెద్దలుగాని వారానికి రెండుసార్లు తలంటుపోసుకో






రన్నింగ్ బార్డర్లు

★

ఫ్రాకులపై వెండపట్టీలకు

టి. ఎస్. బి. ప్రభావతి,
బి. సుభద్రావతి.
(రాజమండ్రి)



ఉప్మాచేసే కొన్ని కొత్తవిధానాలు

మామూలుగా ఉప్మా చేసుకోటం కాకుండా రకరకాల్లో చేసుకోటం చెబుతా:

ఇంకోగంటకు ఉప్మాచేసుకుంటా మనగా పుల్లటి, తగుమాత్రం చిక్కటి మజ్జిగలో కావలసిన గోధుమరవ్వను నానబోయాలి. మామూలుగా ఉప్మా తిరగమాతచేసి కొద్దిగా నీళ్లుపోసి తెర్లింతర్వాత (ముందే వుప్పు వేయాలి) ఈ నానబెట్టిన రవ్వను వేసి వుడికింతర్వాత దించాలి. దీనికి నేతిపోపే వాడాలి. అల్లం, పచ్చిమిర్చి, పులుపు, నేతిపోపు వాసనతో కమ్మగావుంటుంది. దీనిలోకి కొంతమంది వుప్పు మిరపకాయలు వేయించి నంజుకుంటారుకూడా.

మరోరకం: రవ్వకు సరిపోయేన్ని పుల్లి పాయముక్కలు తరుక్కొని చిటపటలాడే వుప్మాపోపులో ఈ పుల్లిపాయ ముక్కలు దోరగావేగాక పుల్లమజ్జిగ సగం—నీళ్లుసగం (అంతా మజ్జిగయినాఫర్వాలేదు) పోసి వుప్పువేసి తెర్లనివ్వాలి. కొద్దిగా శనగపప్పు, మినపప్పు,ధనియాలు, ఎండుమిరపకాయలు–వేయించి పొడుంకొట్టి తెర్లే నీళ్ళల్లో రవ్వ వేసి వుడికింతర్వాత ఈపొడివేసి రెనిముషాలయింతర్వాత దించెయాలి. మనం తినే కారాన్నిబట్టి మిరపకాయలు వుపయోగించాలి. మజ్జిగ లేకుండాకూడా చేసుకోవచ్చు. నూనెపోపువాడినా ఫరవాలేదు.

ఇంకోరకం ఏమంటె—చాయ పెసరపప్పును దోరగా వేయించి తయారయిన వుప్మాపోపులో వేసి నీళ్ళుపోసి బద్దచితికే దాకా వుడకనిచ్చి ఆతరవాత రవ్వవేసి వుమ్మగిల్లింతర్వాత దించేయాలి. దీనికి పచ్చిమిర్చి వుపయోగించకూడదు. ఇది బెల్లంకాని—పంచదారగాని నంజుకోనితింటే రుచిగా వుంటుంది. పిల్లలు చాలా ఇష్టపడతారుదీన్ని. బియ్యం రవ్వతో చేసినా బాగా నేవుంటుంది.

పిల్లలు సంతోషంగాతినే మరోరకం—గానుసుగడ్డను తురిమి ఘుమ, ఘుమలాడే పోపులో వేసి నీళ్ళుపోసి తెర్లింతర్వాత రవ్వ వేసి వుడికింతర్వాత దించేయాలి. ఇది అమ్మకులేకుండా అంతా పాపలకే సరిపోతుంది—చేసింది. మరితీపిగా వుంటుందాయె—నేతిపోపు వాడితేనే మంచిది.

వీటన్నింటికి జీడిపప్పు లేకపోతే—వేరుశెనగపప్పుఅయినా వుపయోగించచ్చు–పోపులో.

జి. ఎస్. వాణి (వేటపాలెం)

వాలి. తరుచుగా లైట్ స్మెల్ నిచ్చే సెంటు కూడ వాడుతుండాలి. ఈ కాలము మల్లె పూలగురించి వేరె చెప్పనే అక్కర్లేదు. సాయంత్రము అవగానే ప్రతివారి తలల లోనూ తెల్లగావిచ్చిన మల్లెపూలు తమ సౌరభాన్ని నలువైపులకూ విరజిమ్ముతూ ప్రత్యక్షమౌతాయి. వేసవి వచ్చిందంటె, మల్లెల సువాసన, మామిడిపళ్ళ గుబాళింపు గుర్తుకి వస్తాయి. వాటిని ఎంత ఆదరిస్తామో శరీరపోషణకూడ అంత జాగ్రత్తగానూ నిర్వహించాలి. ★

వ్యాసాలూ —వ్యాఖ్యానాలూ

ఆమధ్య నేను వ్రాసిన 'పిల్లలూ పెంపకం' అనే వ్యాసాన్ని చదివి, మాఊళ్ళో ఒకళ్ళు అడిగారు ఆ విషయంలో నీకెంత అనుభవం ఉన్నదీ?, అని.

మన జీవితంలో ప్రతిరోజూ అనేక సంఘటనలనీ సమస్యలనీ ఎదుర్కొంటూ ఉంటాము. అనేకచోట్ల చూస్తూఉంటాము. మనం ఎదుర్కొంటూన్న సమస్యల్ని అనేకచోట్ల అనేకులు పరిష్కారం చేసుకోలేక సతమతమవుతూ ఉంటారు. ఆ అనేకులు పరిష్కరించుకోనేవి ఒకొక్కప్పుడు మనం పరిష్కరించుకోలేము. అందుకనే ఒకరికొకరు తమ ఆశయాలూ అభిప్రాయాలూ వ్యక్తీకరించుకొంటూ ఆ ఆశల్ని సఫలమయ్యేట్లు ప్రయత్నించడం ఎంతైనా అవసరం: ఇందుకు మన 'వనితాలోకం' శీర్షిక ఎంతైనా తోడ్పడుతోంది అనడానికి సందేహంలేదు. వనితల్లోగూడా కమ్మగా తీయగా కలతల్ని కరిగించి, ఉత్సాహం కలిగించేలా వ్రాసే రచయిత్రులు ఈనాడు అనేకమంది ఉన్నారని చెప్పడానికి మనం ఒకవిధంగా గర్వపడాలి. ఆ మాణిక్యంలాంటివారు దూరదూరాలవారు గూడా తమ ఆశయాలనూ, ఆశలనూ, అనుభవాలను ఉత్సాహంతో అందరికీ చెపుతున్నారు. ఈ శీర్షికని అందరూ తమ చేతనైనవిధంగా సజావుగా ఇతరులని ఆకర్షించేటట్లు చేస్తున్నారు. ఇందుకు మనం ఎంతైనా ఆనందించాలి.

స్త్రీలు వ్యాసాలు వ్రాయడంలో, కథలు వ్రాయడంలో ముందంజ వేసినా అనేకులు ఎన్నో కష్టాలకు గురిఅవాల్సి వస్తోంది. ఇక్కడ వ్రాస్తున్నవారికన్న ఇంకా బాగా వ్రాసేవారుగూడా ఉంటారు. కానీ... వారు స్వతంత్రంగా స్వేచ్ఛగా తమ మనసులో భావాల్ని చెప్పుకోలేరు. ఆమె కన్య అయితే కొందరు తల్లిదండ్రులు ఒప్పుకోరు" "పెళ్ళికాని పిల్లపేరు పత్రికల్లో పడటమేమిటి! ఇంతవరకు మేముకనీ-వినీ ఎరగం అని నాయనమ్మ దవడలునొక్కుకుంటుంది. నాన్న ఆమెమాటని బలపరుస్తారు. పెళ్ళి అయిన స్త్రీఅయితే (కొందరు) భర్త ఒప్పుకోడు. తనకంటె తెలివిగా తనభార్యసమస్యల్ని పరిష్కరించడం, ఆమె పేరు పత్రికల్లో పడటం అతనికి గిట్టదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురు అవడంవల్ల చాలామంది స్త్రీలు తమ భావాల్ని నలుగురికీ విశదంగా చెప్పలేక పోతున్నారు. ఎంతో దూరాన ఉన్నవారికి గూడా స్నేహం కలిగేది పత్రికలవల్లా రేడియోవల్లాను. ఈ రెండూ ఎంతో సహకరిస్తున్నాయి. వీటిని గూడా కొందరు సద్వినియోగం చేసుకోనియ్యక పోవడం చాలా విచారించవలసిన విషయం. కాని ఎవరు చెపితే ఏం లాభం కనుక?

వ్యాసం వ్రాయాలంటే ఏ విషయాన్ని తీసుకొనైనా వ్రాయవచ్చు. విషయం ఏమిటి అన్నదానికన్నా ఆ విషయాన్ని కవయిత్రి ఎంత గొప్పగా చిత్రించగలిగింది. అల్లా చిత్రించడంలో ఆమె ఉద్దేశ్యం ఏమిటి? ఏ దృక్పథాన్ని మనసులో పెట్టుకొని ఆమె ముందుకు సాగింది? అనేది ముఖ్యం. వ్యాసాన్ని వ్రాయడానికి కొంత అనుభవం కావాలి. అట్లా అని ప్రతీ విషయం స్వానుభవం కానక్కరలేదు. చదివినవీ, విన్నవీ, కన్నవీ, భవిష్యత్తులో తీరాలనిఅనుకొనేఆశలూ—ఇవిచాలు కొన్ని

నండూరి రాజ్యలక్ష్మి
(కానుమోలు)

కొన్ని వ్రాయడానికి. పుస్తకాలు మనకెంత విజ్ఞానాన్ని ఇస్తున్నాయోదాన్ని మాటలలో చెప్పడం కష్టమే: ఆ విజ్ఞానానికి తోడు కొంచెం విమర్శనాజ్ఞానం ఉంటే ఎంత చిన్న విషయాన్ని అయినా తీసుకొని చక్కగా వర్ణించవచ్చు.

*   *   *

"మనుష్యుడు గొప్పవాడు అనాల్నంటే తన మానవత్వాన్ని నిరూపించుకోవాలంటే డిగ్రీలు ముఖ్యంగాదు. ముందర మంచి స్నేహాలు చెయ్యడం, మంచి పుస్తకాలు చదవటం నేర్చుకోవాలి. వాటివల్ల మనం అనేక క్రొత్త విషయాలు నేర్చుకో గలుగుతాము. అనేక మంచి పనుల్ని చెయ్యగలుగుతాము. అందుకని ముందర మన జ్ఞానకోశాన్ని నింపుకోవాలి"

ఈ మాటలు మూడేళ్ళ క్రితం చదివాను. అయినా నేను మర్చిపోలేదు. మర్చిపోను గూడా.

మన 'వనితాలోకాని'కి అనేకమంది సోదరీమణులు ఉప్పొంగుతున్న ఉత్సాహంతో, ఎవరినో బాగు చేద్దామన్న కాంక్షతో రచనల్ని పంపిస్తున్నారు. సాధారణంగా ఎవరితప్పుల్ని వారు తెలుసుకోలేరు. ఏదో మాట్లాడేస్తారు. అవతలవ్యక్తి బాధపడుతున్న సంగతి వీరికి తెలియదు. (ఎదుటివాళ్లను బాధపెట్టాలని మాట్లాడే వారిసంగతి కాదు) అసలు ఎట్లా మాట్లాడాలో గూడా కొంతమందికి తెలియదు. ఇంకా కొంతమందికి ఎట్లానడవాలో గూడా తెలియదు. ఒకసోదరి 'మాటా-మాటతీరు' అని వ్రాసింది అనుకోండి. మాట్లాడటం చేతకానివ్యక్తి ఆవ్యాసం చదువుతుంది. 'బహుశా నామాటలవల్ల చాలామంది బాధపడుతున్నారేమో' అని ఆలోచిస్తుంది. ఇంక ముందుముందు అట్లా జరగకుండా ఆమె జాగ్రత్తపడుతుంది. మనం చేస్తున్న ప్రతిపనీ అందరికీ ఉపయోగపడుతుందనుకోవడం పొరపాటు - వనితల వ్యాసాలు అందరికీ కాకపోయినా కొందరికన్నా ఉపయోగ పడుతున్నాయని ఘంటాపథంగా చెప్పగలను. ఒకామె వంకాయ కూర గురించి వ్రాసింది అనుకోండి. చాలా మందికి అదీ తెలుసు. 'ఓయబ్బో! ఎవరికీ తెలియనట్లు వంకాయకూర గురించి వ్రాసిందే?' అని ఆశ్చర్యపోవడం, దాని మీద అనేకరకాలయిన వ్యాఖ్యానాలు లియ్యడం జరుగుతోంది. ఆ వంకాయకూర ఎక్కడో దూరదూరంలో ఉన్న ఆమెకు చేతకాకపోవచ్చు. ఆమెకేగాదు అనేక మంది ఆడపిల్లలకు పెళ్ళయ్యేదాకా వంట చేయడం చేతగాదు. వివాహం అవంగానే ఆమెభర్తతో ఎక్కడికో వెళ్లాలి. వంట రాదు. వండేవారులేరు. అటువంటప్పుడు ఆమె ఎన్నని ఎవర్నని అడిగిచేస్తుంది? ఎవరైనా ఒకసారి చెబుతారు. రెండు సార్లు చెబుతారు. మూడోసారి విసుక్కుంటారు. అలాంటి ఆపత్సమయంలో ఆ వంకాయకూర, బీరకాయ పచ్చడిపడ్డ పత్రికే ఎంతో 'ఆప్తబంధువు' అయి ఆమెను రక్షిస్తుంది. కూరల్ని పొదుపుచేయడం, అనేకరకాలుగా వండటం వ్రాస్తే, "ఆమె వ్రాసేదేమిటో తెలుసా! బీరకాయ తొక్కు వేయించి పచ్చడిచెయ్యటల, ఆనపకాయ తొక్కు పులుసుపెట్టటం ఇదేగా!" అని ఒకమాటు వెటకారంగా నవ్వి. ఆ విషయం గురించి గంటల తరబడి వ్యాఖ్యానించటం మనం చూస్తూనే ఉంటాము. రచయిత్రి తన ఉద్దేశ్యాలను ఎంతో ఉత్సాహంగా చెపితే ఆ రచనను ఈవిధంగా వ్యాఖ్యానించేసరికి ఒక్కసారి నిరుత్సాహపడుతుంది. అందరికీ వ్యాసాలు వ్రాయడం సరిగా చేతకాక పోవచ్చు. చదివేవారి మనస్సు ఆ వ్యాసంలోనే లీనమయ్యేట్లు వ్రాయలేక పోవచ్చు. అంత మాత్రంచేత ఆమె వ్రాసేందుకు అర్హురాలు కాదా? మనం వ్యాసం చదివేది ఎందుకు? మన తప్పుల్ని మనం దిద్దు



కే. లీలావతిగారు వ్రాసిన 'కలలు' అనే వ్యాసం చూచా బాగుంది. ఇంకా కొన్ని కొన్ని సంగతులు చెప్పడం మరిచిపోయూరే మోననిపిస్తుంది. ఉదాహరణకు: అర్ధనిద్రావస్థలో అర్ధజాగ్రదవస్థలో నున్న సమయంలో ప్రక్క నున్న వారు మాట్లాడుకొనే విషయాలు కూడా కొన్ని సందర్భాల్లో కలలుగానే కనిపించగలవు. తీరా లేచిచూస్తే వారు మాట్లాడుకొనే విషయాలు కలలో కనిపించిన దృశ్యాలు ఒకేమాదిరిగా ఉండటం కనిపెట్టి ఆశ్చర్య పోతాము.

—బి. లక్ష్మీనరసింహారెడ్డి.
(గుండాలిమర్గు, వరంగల్ జిల్లా)

* * *

వేరంటే విప్లవమా!

వల్లిగారు "సమిష్టి కుటుంబాలు..." బాగారాశారు. నిద్రమొహాన లేచిన దగ్గర్నుంచీ, నిద్రపోయేవరకు ఒకళ్ళని నిందిస్తు పడిపడుతూ ఉండేకంటే అదే ఉత్తమమైన మార్గం. ఒకళ్ళని ఒకళ్లు అర్ధం చేసుకుని మనలో మనం కాకపోతే, పైవాళ్లు ఎవరు వస్తారు? అని సర్దుకుని సమిష్టిగా పోతే ఇబ్బందిలేదు, ఒకళ్ళు లేవకపోయినా, మరొకళ్లు సర్దుకుని, ఆనందంగా, ఒకళ్ళు ఒకపని మరొకళ్లు మరోపని చేసుకుంటూ, ఒకళ్ళు ఒకమాట పొరపాటున జారినా. దాన్నే పట్టుకుని వెళ్ళాడక ఎక్కడి వక్కడ మర్చిపోయిఉంటే సమిష్టిసంసారంలో ఆనందం ఒంటరిగా లింగులిటుకు మంటూ ఉండే సంసారంలో ఉంటుందా? మనసులో తేడా రానంతసేపూ పర్వాలేదు.

ఇంక వేరుఅనంగానే, అదొక పెద్ద విప్లవమేమొ? కాలం,కర్మంకలసి వేరుంటే, ప్రపంచ కానికంతా కాలక్షేపమే? "ఏవమ్మా వేరున్నారుటా" అంటు ఎంత జంతువుని చూసినట్టు చూడ్డం ఏవమ్మా ఇంటింటా ఉంది ఓ పొయ్యి మా ఇంట్లో ఉంది మరోపొయ్యి ఏం? మీ అమ్మ వేరుండలేదా? మీ అత్తగారు వేరుండలేదా మీ అమ్మమ్మ వేరుండలేదా? పెద్ద వింతలా అడుగుతున్నావే" అంటే ఇబ్బందిలేగు. ఇంక కథాలేదు, కాని అలా తెగించిఎందరనగలరు? మనసులో బాధ పడతారుతప్ప.

ఆమెరాసినట్లు "ఆమాత్రం మోజులో ఉండగా వేరే ఉండామా? అంటే హాయో పదిమందిమీకలో గంచోతాగే సంసారంలో ఈఒంటెత్తుగుణాలేమిటో దేముడా ఒక్కత్తి! ఉన్న పిల్లతే ఒంటెత్తు గుణాలుంటాయేమోనని దిన్ని చేసుకుంటే దీనికీ వచ్చిందా పోయేకాలం; అంటూ ఇంటా "అదిగో ఆవిడే వేరెట్టింది పాపం పచ్చగా పదిమందీ ఉండే సంసారం" అంటూ బయటా అదేదోపరమ దుఃఖ సముద్రంలో తేలిపోతున్నట్టు. అదే ఒకత్తె ఉన్న పిల్లగానీ అంటే దిక్కుమాలిన బుద్ధులుపోతాయా! వద్దండి అని మొత్తుకుంటే వినక, కట్నం చూసుకుని కులుకుతూ చేసుకున్నారు. రాత! ఎవరు తప్పించగలరు? నాకన్న బిడ్డల్ని వేరుచెయ్యడానికే వచ్చింది" అంటూ అనేకరకాల సాధింపులు.

కొన్ని పెద్ద సంసారాల్లో గుట్టుగా పోనిస్తూ వీధిలో దర్జాలు సాగిస్తూ ఇంట్లో ఒకటికి పది చేసుకుతింటూ, (మగాళ్ళు తిడతారు అనుకునే ఆడాళ్ళు వాళ్ళమటుకి ఏ ఆవకాయ ముక్కో వేసిపెట్టి ఆస్తెంతో, అప్పెంతో తెలియక పైలా పచ్చీసుగా బతికి, పెద్దవాళ్లు కొన్నాకన్ను మూయగానే

కోడానికి. అంతేగాని వ్యాఖ్యానించడానికి గాదుగా. మనం దానిలో మంచినే గ్రహించాలి. తప్పుల్ని చదవద్దు. అందువల్ల వచ్చిన నష్టం ఏం లేదుగా. కఠినంగా దూకుడుగా తిట్టకుండా నెమ్మదిగా లోపాలు విమర్శిస్తు మీరు వ్యాసం వ్రాసే ఆ రచయిత్రి తనరచనని తన సోదరీ మణులు సహృదయంతో అర్థంచేసుకొన్నారని సంతోషిస్తుంది. తిరిగి ఆమెను ప్రోత్సహించిన వారము మనమే అవుతాము. ఈవిధంగా అందరం కలిసిమన్ని మనం సంస్కరించుకొంటూ, ఇంకొకరిని బాగుచేయడానికి మనం శాయశక్తులా ప్రయత్నిద్దాం! ★

అనేక ఆర్థిక బాధలకులోనై, అస్వంపాలైన బతికి చెడ్డ కుటుంబాలనేకం.

అందుచే, పెద్దలే, కలుగ చేసుకుని చిన్నవాళ్ళకి నిందలు రానీయక, వాళ్లువా(వహకముందు చూపుతో ఎవరిదార్ని వాళ్ళద ఉంచితే ఏ బాధా ఉండదు. ఏ మంటారుని

ఎస్. ఎస్. మహాలక్ష్మి (పి. డి. పి?

* * *

సులోచనగారు వ్రాసిన "మీవారింకా ఇంటికిరాలేదా?" అనేవ్యాసం చదివాను. చాలబాగా వ్రాశారు. చాల పరిశీలనా దృష్టితో వారు వ్రాశారు.

నిజంగా యీరోజుల్లో క్లబ్బుల్లోనే గాకుండా తదితరచోట్లకూడా పేకాట అధికమేనని చెప్పాలి. ఈ వ్యసనం ఉన్నవారు ఎంతచెప్పినా వినరు, ఇల్లాలు పడేబాధ అర్థంచేసుకోరు.

పి. లక్ష్మీజానకి, (కూనవరం.)

* * *

మగవాళ్లు ఆలస్యంగా యింటికి రావడానికి కొంతమంది, ఆడవాళ్లుకూడా కారణమంటాను. ఆడవాళ్లు ఇంట్లో నలుగురున్న తరువాత ఏవో తగాదాలు వస్తూనే వుంటాయి. అవన్నీ మగవాడికి చెప్పకుండా సర్దుకుంటే ఏ బాధా వుండదు. అంతేకాని ఇంటికి రాగానే అత్తగారుమీద చెప్పే కోడలు, కోడలుమీద చెప్పె అత్తగారు, తల్లిమీద చెప్పేకూతురు, కూతురుమీద చెప్పేతల్లి ఇలాటివన్ని వింటూంటే ఎటూ చెప్పలేక ఆ మగవాడికి ఉన్నమతి కాస్త పోయి, యింటికి రావటమంటె బెంగఅయి, ఏ కాఫీహోటలులోనో కాఫీత్రాగి క్లబ్బుకి వెళ్లి ఏ రాత్రి పదింటికో యింటికివచ్చి చేరుకుంటాడు: నిర్మొగమాటంగా వ్రాసినందుకు క్షమించండి.

మంగు సుభద్రమ్మ.

* * *

'మీవారింకా ఇంటికిరాలేదా' అన్న వ్యాసం వనితాలోకపు మేలు జాతి వ్యాసాల్లో ఒకటి. వ్యాసరచయిత్రి అయిన సులోచనగార్కి పత్రికద్వారా నా అభివందనాలందజేస్తున్నా.

ఇటువంటి వ్యాసాలే పంపమని సోదరీ మణులను కోరుచున్నాను.

కె. విజయలక్ష్మి, (భట్లపాలెం.)

* * *

"మీవారింకా ఇంటికిరాలేదా?" అన్న వ్యాసం సులోచనగారు ఎంతో చక్కగా వ్రాశారు. యీ విషయం సహజంగా లోకంలో జరుగుచున్నదే. ఈ వ్యాసం చదివిన తరువాతైనా యిటువంటి పనులకు అలవాటు పడ్డవారు కళ్ళు తెరుస్తారనుకుంటాను. వీరివల్ల ఎన్ని కుటుంబాలు నాశనమౌతున్నవో లెక్కలేకుండా వుంది. మళ్ళీ చూస్తే వీళ్లు చేసేది పెద్ద పెద్ద ఉద్యోగాలే.

మన అలవాట్లు

(41-వ పేజీ తరువాయి)

కోసమేనన్నట్లు మాట్లాడుతూ వుంటారు. ఆ పరిస్థితుల్లో మనం మూర్ఛపోయి నా వదిలెయ్యరు. సేదతీర్చి మళ్ళీ మూర్ఛపోయే దాకా మాట్లాడతారు.

ఇహ రెండోరకం వారు నలుగురి ఎదటా ఎన్నడూ మాట్లాడని వారవటం వలన మనం పలకరిస్తేసరి బుగ్గగొక్కుంటూనో, చీరకొంగు నములుతుంటూనే, జడ రిబ్బనువిప్పి తిరిగీ ముడేసుకుంటూనో గొణుగుతారు. మనం కూర్చోబెట్టి కొస్త ఆప్యాయంగా ఆదరించ బోతే కొలంగడిపెయ్యడానికి ఇల్లాంటి అస్తవ్యస్తపు అలవాట్లు సంజాకుంటూంటారు. వీరు బలవంతాన మాట్లాడబోయినా నోటి కన్నా ముందు చేతులు రకరకాలుగా తిరుగుతాయి: "మరే" అంటారు. తల గోక్కుంటారు. "అమ్మ..." అంటారు. జడ పీక్కుంటారు. "వుర్లో, వుర్లో...లేదు..." అంటారు. నారదులు సినిమాలో తంబుర మీటే మాడల్‌లో చేతులు గాలిలో ఆడిస్తారు. వీరికి నలుగురితో మాటలాడటం ఎంత దుర్భరమో నీళ్ళలోంచి లిప్టుయిచ్చి బయటకు పడేసి ఓ చేపనడిగి చూడండి తెలుస్తుంది.

ఈ రెండు తెగలవారూ ఎక్కడ దాపుంచినా పెద్ద చిక్కే. వారి ఎదట వున్నంతసేపూ ఇరవయ్యో శతాబ్దపు నాగరికత యావత్తూ స్తంభింపోయినట్లుంటుంది. మనం చేయగలిగిందల్లా వారి కనుచూపు మేరల్లో మన ఆకారాల్ని జూనిపించకుండా వుండటం మాత్రమే! ★



వీధి నాట్యం

చిత్రకారుడు: ఎ. వి. ఎస్. ఆర్. జోస్యులు-మంగళగిరి.

వనితా వాణి

గౌరవనీయమైన పరిసరాల్లో తిరిగేవారే. పైకిమాత్రం పెళ్ళంతో మంచివాళ్ళలా కనిపిస్తారు.

ఎం. కృష్ణకుమారి (సంగారెడ్డి)

* * *

"మీవారింకా యింటికిరాలేదా" అన్న వ్యాసం చాలా బాగుంది. ఈ వ్యాసాన్ని వ్రాసిన సులోచనగారికి నా అభినందనాలు.

యం. హనుమంతరావు (నర్సీపట్నం)

* * *

కుమారి ఆర్. నాంచారమ్మగారు వ్రాసిన "పరీక్షల్లో" అను వ్యాసము నా మనస్సును బాగుగా ఆకర్షించినది.

రచయిత్రికి వనితావాణిద్వారా నా అభివందనల తెల్పుచున్నాను.

అబ్దుల్ వహాబ్ (పొందూరు)

* * *

జి. కె. విజయలక్ష్మగాగు రాసిన సమాధానం దొరకని ప్రశ్న చాలా బాగున్నది వారికి నా అభివందనలు.

కుమారి బిశేషు (కుమారదేవం)

* * *

విద్యార్థులకొరకు ప్రత్యేకముగా రాసిన "పరీక్షల్లో" అనెడి వ్యాసము చాల బాగుంది. రచయిత్రి కుమారి ఆర్. నాంచారమ్మగారు పరీక్షలలో విద్యార్థుల మనస్తత్వమును వివరంగా తెలియపరిచినారు. ఆ వ్యాసము చదువుతుంటే మొన్న అయిన మా పరీక్షలు అందులో మా కంగారు, హడావిడి జ్ఞాపకము వచ్చినాయి. తీరికగా ఉన్న ఈ సమయములో ఈ వ్యాసము చాల ఆనందము కలిగించినది. ఇంత మంచి వ్యాసము వ్రాసిన కుమారి ఆర్. నాంచారమ్మగారికి నా హృదయపూర్వక వందనములు వనితావాణిద్వార అందజేయుచున్నాను.

యస్. కె. కుమారి. (బొబ్బిలి)

* * *

కుమారి ఆర్. నాంచారమ్మగారు వ్రాసిన 'పరీక్షల్లో' అనే వ్యాసం చాలా బాగున్నది. అందులో అచ్చంగా విద్యార్థులుగాని విద్యార్థినులుగాని పొందే అనుభవాల్ని చక్కగా వ్రాశారు.

కె. లీలావతిగారు వ్రాసిన 'కలలు' అనే వ్యాసం బాగున్నది.

రచయిత్రికి వనితావాణిద్వారా అభినందనలను తెల్పుచున్నాను.

కె. కిరణ్. (ఉదయగిరి) ★

గమనిక

22-4-59 వారపత్రికలో "రకరకాల వడియాలు" శీర్షికలో, గోధుమ వడియాలులో "అర్ధసవాసేరు పచ్చిమిరపకాయలు" సవాసేరుగానూ, బియ్యపునూక వడియాలలో "అర్ధఫలం పచ్చిమిరపకాయలు" అర్ధసవాసేరుగానూ, పెసరపప్పు వడియాలలో "రెండు ఫలాల పచ్చిమిరపకాయలు" రెండు సవాసేర్లుగానూ అచ్చయినది. ఈ పొరపాట్లను గ్రహించగలరని ప్రార్థన.

జి. లీలావతి, (వేటపాలెం).

★ సమస్య తీరింది ★

(34 వ పేజీ తరువాయి)

అనుకుని తనకు తట్టిన అమోఘమైన ఊహని ఆచరణలో పెట్టేయ నిశ్చయించుకున్నాడు. పిల్లిపిల్లను చంక నిడుకుని ఒక్క గంతులో ఆయింటి అరుగుమీద వ్రాలాడు, యింటి తలుపులు నెట్టి చూశాడు. ఊహూఁ! రాలేదు. వుత్సాహం ఒక్కసారిగా చల్లారిపోయింది. 'హోప్‌లెస్‌ఫెలో! యింట్లో ఏముందనే తలుపులు తాళాలుగూడా బిగించుక వచ్చావ్ ఎక్కడికో?!' అని తిట్టుకుంటూ ఆ అరుగు మీాగే కూలబడ్డాడు. పిల్లిపిల్లను ఒళ్లో పెట్టుకుని విచారిస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఎదురుగా వకీలుగారింటి గోడలో సైడు కాలువలోకి నీరుపోయే తూము కనిపించింది. అతను ఆనందపరవశుడై పోయాడు. 'ఇంక నీకేం భయంలేదమ్మా!' అని పిల్లిపిల్లనొక సారి బుజ్జగించాడు. వెంటనే పోయి పిల్లిపిల్లను మెల్లగా, దెబ్బతగలకుండా ఆతూము లోనుండి లోపలికి నెట్టి ఇక పరవాలేదని నిర్ణయించుకునీ లేచి నిలబడ్డాడు సంతృప్తితో ఎగురుమీాదనుండి కారే చెమటను తుడుచుకుంటూ ఆనందంతో వెనుదిరిగాడు. రెండడుగులు వేశాడో లేదో 'మ్యావ్. మ్యావ్!' మంటూ పరుగు పరుగునవచ్చి కాళ్ళనువాటేసుకుంది పిల్లిపిల్ల. అతనిలో ఒక మూలకోపం, ఒకమూల ఏడుపూ ఒక్కసారిగా ఉద్భవించాయి.

తారుమారయ్యాయి తన అంచనాలు! కసి కొద్ది కాలితో ఒక్కతాపు తన్నాలనిపించింది. ఆపిల్లిపిల్లను. కోపంగా దాని వంక చూశాడు. అమాయకమైన దానిచూపులు, జాలిగొలిపే దాని అరుపు అతనిలో కోపాన్ని ఒక్కసారిగా జాలిగామార్చేశాయి. దానిని మళ్లీ తిరిగి చంక నెత్తుకుని అరుగుమీాదొచ్చి కూలబడ్డాడు. మళ్ళీ పరిస్థితి మామూలే! ఎక్కడవున్నావే గొంగళీ అంటే వేసిన చోటే వున్నాననే సామెతయింది తనపని!

తిరిగి ఉపాయాంతారాన్ని అన్వేషించసాగాడు. కాని ఇంతలోనే మరోచిన్న విషయం జ్ఞప్తికొచ్చింది. 'శీతయ్య' గారి పాడుబడ్డ ఇంటివీధి కొట్టు తెఱచే వున్నట్లు చూశాడు రెండు మూడురోజుల క్రితం. ఇందాక తనకు జ్ఞప్తికే రాలేదు. ఆ చీకటిలో ఆ కొట్టు తనకు కన్పించలేదుగూడ.

శంకరం పిల్లిపిల్లతో సహా మళ్ళా లేచాడు. మళ్ళీ అతనిలో పోయిన వుత్సాహం ప్రవేశించింది. 'శీతయ్య' గారి వీధికొట్టు సమీపించాడు మెల్లిగ తడుముకుంటూ. తలుపు నెట్టి చూశాడు. తెరిచే వుంది. తలుపు తీసి లోపలికి తొంగి చూశాడు. గాఢాంధకారము! నిశ్శబ్దం! తలుపు తడిమిచూశాడు. గొళ్ళెం కూడా బాగానేవుంది. తలుపు గట్టిగానే వుంది. 'నీ అదృష్టం బాగుందిలే!' అని దాన్ని బుజ్జగించాడు. దానిని మెల్లిగా ఆ కొట్లో వదిలిపెట్టి తలుపులాగి బయటగొళ్ళెంపెట్టి సంతృప్తితో గూడిన ఒక భారమైన నిట్టూర్పు విడిచి బయటపడ్డాడు. 'నీ ఇల్లు పాడుపడితే పడిందిగాని యెన్ని అనాథ జీవరాసులకు ఆశ్రయమవుతున్నదో శీతయ్యా! నువ్వు చాల పుణ్యాత్ముడివిలే!' అనుకుంటూ తేలిక పడిన గుండెలతో ఇంట్లో కొచ్చి ప్రక్కమీద వ్రాలాడు.

ఇట్లా పడుకున్నాడో లేదో మళ్ళీ దాని అరుపు వినిపించిం దతనికి. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. టపటపా కొట్టుకునే గుండెలతో వినసాగాడు. ఆ అరుపు క్రమక్రముగా దగ్గరై మళ్ళీ దూరమవసాగింది. అతని మనసును ఆశ్చర్యం, కోపం, భయం, ఒక్కసారిగా పెనవేసుకుని అతన్ని ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. తానంత గట్టిగా గొళ్లెంబిగించితే ఈ వెధవగొడ్డు ఎట్లా బయటపడిందా అన్న సందేహం బాధించసాగింది. గబగబా లేచిపోయి నేరుగా ఆ కొట్లోనే పోయి పరీక్షించాడు. ఒకమూల పెద్ద పంది కొక్కు కన్నమొకటి కనిపించింది. 'అన్న' అని నాలిక కరుచుకున్నాడు. గబగబా వీధిలోకి వచ్చాడు. అప్పుడే పిల్లిపిల్ల చాలా దూరం పోయింది. దూరంగా దాని అరుపు వినిపించ సాగింది. సందుచివర లైటులో స్పష్టంగా కుంటుకుంటూ నడుస్తున్న దాని ఆకారం కనిపించింది.

అతని హృదయంలో చెప్పలేని ఆరాటం బయల్దేరింది. దానిమీాద ఎక్కడలేని జాలి, ప్రేమ, మమకారము అతనిలో కట్టలు త్రెంచుకు ప్రవహించాయి. ఆ ప్రవాహంముందు అన్ని ఆటంకాలు, భయాలుగూడ నిలువలేక పోయాయి. నాన్నగారు కాదన్నాగూడా, తానెన్ని కష్టాలు పడైనా సరే దాని కారాత్రి, ఆ రాత్రేకాదు! ఇంక సదా తనింట్లోనే దాని కాశ్రయ మివ్వాలని కృతనిశ్చయుడై ముందుకు నడవసాగాడు గబగబా! ఇంతలో ఒకకుక్క అరుపు, వేగంగా పక్కవీధులోనుండి శరవేగంతో పడుగెడుతున్న కుక్క ఆకారం ఎలక్ట్రిక్ లైటు కాంతిలో అతనికి గోచరమయ్యాయి. అతనిలో ఆరాటము, ఆందోళన, భయం అధికమయ్యాయి. గబగబా పరుగిడసాగాడు. ఇట్లా సందు తిరిగాడో లేదో భయంకరంగా అరిచిన పిల్లిపిల్ల అరుపు వినిపించింది. అంతే. నిశ్శబ్దం. మళ్లీ శబ్దంలేదు. అదేకుక్క తనముందునుంచే పరుగెత్తి పోయింది మళ్లీ.

వణికేకాళ్ళతో, వేగంగా స్పందించే హృదయంతో, ఆపుకుందా మనుకున్నా ఆగక ప్రవహించే కన్నీటితో తడబడే అడుగులతో వెళ్ళి చూశాడు శంకరం. ఎలక్ట్రిక్ దీపం క్రింద సైడ్ కాలువ ప్రక్క రక్తపు మడుగులో పడివున్నది పిల్లిపిల్ల కళేబరం! క్షణం క్రితందాకా తనకు ఎడతెగని సమస్యయై కూర్చున్న పిల్లిపిల్ల కళేబరం! సంతత ధారాపాతంగా కారే కన్నీళ్ళలో నుండి మసక మసకగా కనిపించింది ఆ భయంకరమైన దృశ్యం! మనస్సులోనే 'సమస్య తీరింది!' అని గొణుగుకున్నాడు. రెండు చేతులతో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ ఇంటివైపు పరుగుతీశాడు శంకరం. ★

బాలసాహితి

సహవాసిని

పడక కుర్చీ నింత
నడుమాన్చితినో లేదొ
మైకమై కనురెప్ప
లేకమై పోయినవి.

కమ్మని సువాసనల
గుమ్మైన గాలి నా
నాసా పుటమ్ములను
దూసుకొని పోయినది.

కన్నెత్తి చూడ నా
చిన్ని మేజామీద,
మున్నవంటి పదార్థ
మున్నటుల కనుగొంటి.

"కస్తూరివో? పునుం
గవుదో? జవ్వాదివో?
సందేహమాయె నా
మందబుద్ధికి" అనుచు
నింపాదిగానె ప్ర
శ్నించినాడను దాని.

"నిండు నీరము చిందు
కుండీలను వసందు

రోజాల నేస్తాన
రోజులున్న కతాన,
పరిమళమ్మది కొంత,
అరిమినది నాచెంత;

పనికిమాలిన బంక
పుట్టినోయీ నేను!

నీదు భావన వస్తు
వేదియును గానోయి!"

అని పలికె చెవియొద్ద
నల్లరేగడి ముద్ద.

మృత్తికా వాక్కులకు
చిత్తమందున మెచ్చి
అద్దిరా! యని కనుల
నద్దికొంటిని దాని.

★ సోమంచి సూర్యనారాయణశర్మ ★

అతనికంటే ఘనుడు...

పోరంకి ఆనందం

ప్లీడరు రామనాథం బరువైన శరీరాన్ని తేలిక కుర్చీలోంచి బలవంతంమీద లేవతీశాడు. లేవతీసేటప్పటికి రమణవచ్చి కాళ్లకు చుట్టేశాడు. రామనాథానికి రమణని చూస్తే చాలాప్రేమ. ప్రతీ తండ్రికీ కొడుకంటే ప్రేమ కలిగి ఉండడం సహజమే కానీ ఒకే ఒక్క కొడుకు అవడం మూలాన రమణంటే రామనాథానికి అమితమయిన ప్రేమ. రమణ చిలిపిచేష్టలూ, ఆరిందా తనమూ చూస్తే తగని ఆప్యాయత. వయసుకు ఏడేళ్ల వాడైనా డెబ్బై యేళ్ల వాడిలా నటించే ఆ నటన చూస్తే ఆయనకు చెప్పలేని ఆనందం.


దబ్బపండులాంటి పచ్చటి శరీరమూ, సిరాసముద్రంలాంటి నల్లటి జుట్టూ, శరీరచ్ఛాయని మించిపోయే పచ్చటి దుస్తులూ, జుట్టుతో పోటీ పడే నల్లటి కళ్లూ, చూస్తూంటే ఎవరికైనా సరే ముద్దువేస్తుంది. అటువంటిది తల్లీతండ్రీ ఆనందించడంలో ఆశ్చర్యంలేదు. ఎవరినైనా అనుకరించడం, తనకు తోస్తే ఏడిపించడం చక్కగా నేర్చుకున్నాడు రమణ. పెద్దవాళ్ల మాటలని ఎక్కడికక్కడ కంఠతాపట్టేసి అవసరమయినప్పుడు అతికేలా వాడుతూ ఉంటాడు. సాధారణంగా ఆనందించినా, అప్పుడప్పుడు "ముది కబుర్లూ — ముది వేషాలూ" అని విసుక్కుంటూ ఉంటుంది తల్లి సుశీల.

ప్లీడరు రామనాథం ఊళ్లో పలుకుబడి' బాగా ఉన్న పెద్ద మనిషి. తెలివైన వాడవడం వలన డబ్బుకూడా వెయ్యిపైచిలుకు పలుకుతుంది. నెల తిరిగేటప్పటికి అయిదారు వందలైనా బ్యాంకులో వెయ్యకపోతే ఏమీతోచదు రామనాథానికి. సుశీల కూడా భర్త తలలోని నాలుకై కూర్చుని బాగా ఆదా చేస్తోంది. భర్తచేత చేయిస్తోంది. ప్లీడరుగారు తన పుస్తకాల బీరువాలు చూసినప్పుడల్లా రమణ జడ్జీ అవాలనీ, అప్పుడు తను ఆనందించాలనీ కలలు కంటూ ఉంటాడు. నిజమౌతాయో...... అవవో అని విచారిస్తూ ఉంటాడు.


తండ్రి అలవాట్లన్నీ తనుకూడా ఆచరణలో పెడ్తూ ఉంటాడు. రమణ తండ్రి చేత కోర్టులో జరిగే విషయాలు, విశేషాలూ, వివరంగా చెప్పించుకుంటూ ఉంటాడు.

రమణకి యిరుగూ పొరుగూ స్నేహితులు చాలామంది ఉన్నారు. అందరూ యించుమించు ఏడెనిమిదేళ్ల వాళ్లే. వాళ్ల యింటి అరుగు మీదనున్న చిన్నగది వాళ్ల ఆట

రంగుల రాట్నం-3. వాల్ట్ డిస్నీ



"చిక్కీ అనేది కూడదమ్మా. అది కారట్ కాదు, ఏదోపిచ్చి మొక్క."



స్వేచ్ఛాజీవి

చిత్రకారుడు: గ్రంధి నరసింహారావు.
[బాలలసంఘం సభ్యుడు; రెండవ ఫారం విద్యార్థి, వల్లభాపురం]

★ అతనికంటె ఘనుడు ★

స్థలము. అక్కడ వాళ్లు బువ్వాలాటల లగాయతు కోర్టు ఆటల దాకా అన్ని ఆడుకుంటూ ఉంటారు. అప్పుడప్పుడు ఆ ఆటలు రామనాథమూ సుశీలా చూడడం కూడా తటస్థిస్తూ ఉంటారు. చూపినపుడు సంతోషిస్తూ వుంటారు. తప్పకుండా తమ అబ్బాయి జడ్జి అయిపోతాడని మురిసిపోతూ ఉంటారు.

అది కోర్టు. జడ్జి రమణ తన స్థానంలో కూర్చుని ఉంటాడు. రెండు ప్రక్కలా ప్లీడర్లనీ, 'క్లయింట్ల'నీ కూర్చోబెడతాడు. ఒక ప్రక్కన కమలా, మరో ప్రక్కన చిట్టిబాబు నిల్చుని ఉంటారు. అటూ యిటూ యింకా కొంతమంది జనం కూర్చుని ఉంటారు. ఎదురుగా కిటికీ దగ్గర కొందరు ప్రేక్షకులు ఉంటారు. జడ్జి రమణ వాళ్ల అమ్మగారి నల్లజాకట్టు ఒకటి కప్పుకొని, తెల్ల తలపాగా చుట్టుకుని ఉంటాడు. వాద ప్రతివాదనలు ప్రారంభిస్తారు.

(జడ్జి) రమణ: మీ గొడవ చెప్పండి యిప్పుడు, తీర్పు యిస్తాను.

కమల: నిన్న సాయంత్రం మా అన్నయ్య అయిన చిట్టిబాబు నా పెన్సిలు బలవంతంగా లాక్కున్నాడు.

రమణ: (జడ్జిఫోజులో) ఎక్కడ లాక్కున్నాడూ?

కమల: నాగుల చెరువుగట్టు మీద.

రమణ: సాక్ష్యం?

కమల: (ఒకడికేసి చూపిస్తూ) అడుగో ఆ వెంకట్రావే!

రమణ: ఏమంటావ్ వెంకట్రావూ! (అంటూ చిన్న కాగితం మీద ఏదో వ్రాసుకుంటూ ఉంటాడు.)

వెంకట్రావు: అవును... నేను చూశాను. వాళ్ల బాబిగాడు కూడా చూశాడు. కాని వాడిప్పుడు హాజరు కాలేదు.

జ॥ రమణ: నువ్వు కూర్చో... నువ్వు ఏమిచెప్పుకోవాలో చెప్పుకో ...టైమయిపోతోంది.

చిట్టిబాబు: నా పెన్సిలు నిన్న పొద్దున్న అది పారవెయ్యడంచేత నిన్న సాయంత్రం నేను దానిని లాక్కోవలసి వచ్చింది.

రమణ: సాక్ష్యం చూపించగలవా?

చిట్టిబాబు: మాఅమ్మా,నాన్నా బాగా ఎరుగుదురు కానీ...ఆ...మర్చిపోయా ఆ టైంకి వాళ్ల రాముడు మా యింట్లోనే ఉన్నాడు. కావలసివస్తే అడగవచ్చు.

రమణ: రాముడు యిప్పుడు యిక్కడ హాజరయాడా?

రాముడు: వచ్చేను... నిన్న ప్రొద్దున్న కమల చిట్టిబాబు పెన్సిలు పారవేయటంవల్ల వాళ్ల అమ్మా నాన్నా దాన్ని బాదుతూ ఉంటే నేను కళ్లారా చూశాను.

జడ్జీ రమణ: (ఓసారి బుర్ర గోక్కుని)... రెండుప్రక్కలా బలం బాగా ఉండడం మూలాన కోర్టు రేపటికి వాయిదా వేస్తున్నాను."

అందరూ బిలబిల లాడుతూ లేచిపోతారు. రమణే రోజూ ఎవళ్లో యిద్దరి ముగ్గురి మధ్య ఏవో గొడవలు కల్పించి యిలా ఆడిస్తూ ఉంటాడు. అది రమణకి సరదా. ఆట ప్రారంభించకముందే వాళ్లకందరికి సలహాలు యిచ్చేస్తాడు. తాను ఏఏ ప్రశ్నలు వేసేదీ, వాళ్లు ఎలా జవాబులు చెప్పవలసినదీ కూడా చెప్పేసేస్తాడు. ఇలా రోజూ ఆడుకోవటం వాళ్లకి పరిపాటి.

రోజులు మారాయ్. రామనాథం

గారు రిటైరు అయ్యారు, సుశీల సుశీలమ్మ అయింది. రమణకి "యం. బి. బి. యస్." పూర్తయింది. అక్కడే ప్రాక్టీసు పెట్టాడు. రామనాథంగారు రమణని 'బి. ఎల్' చెప్పించాలనీ, జడ్జి అవుతే చూచి ఆనందించాలని ఆశించారు. కాని రమణ డాక్టరు అయి కూర్చున్నాడు. రమణ బాగానే సంపాదిస్తున్నాడు. కొత్తవాడయినా తెలివయిన వాడవడం వల్ల జనం చాలామందే వస్తున్నారు. జనంతోపాటు ధనంకూడా వస్తోంది. పెళ్లి అయి నాలుగైదేళ్లు అయింది. ఈ నాలుగైదేళ్లలోను చాలా గడించి బ్యాంకులో వేశాడు. తండ్రికి తగ్గ కొడుకు అనిపించుకున్నాడు రమణ.

ఒక శుభముహూర్తంలో రామనాథంగారు ఓ మనవడికి తాతయ్య అయి కూర్చున్నారు. మనవణ్ణిచూసి తెగమురిసేవారు రామనాథంగారు. అచ్చం తండ్రిపోలికే అని సంబరపడింది సుశీలమ్మ. రమణ కుర్రవాడికి సుశీలమ్మ తండ్రి పేరు పెట్టాడు. ఆకాశానికి ఎగిరి గెంతింది సుశీలమ్మ, రామనాథంగారు కూడ సంతోషించారు.

ధనవంతులకి రోజులు యిట్టే గడిచిపోతాయి అంటారు. అది నిజమో అబద్ధమో తెలియదు. కాని సుదర్శనం అయిదేళ్ల వాడయిపోయాడు. రోజూ ఏదో వేళప్పుడు 'హాస్పిటల్'కి పోయి తండ్రి దగ్గర కూర్చుంటాడు. తండ్రిచేసే ప్రతీ చర్యని గమనిస్తూ ఉంటాడు. 'ఫలానా ఆయనకి నువ్వు చెవిలో పెట్టుకుని ఏదో చూశావు. ఎందుకు చూశా'వనో, 'ఇంకో ఆయనకి ఎవరికో చేతికి ఏదో రబ్బరు చుట్టి ఏంచూశా'వనో ఏవేవో తండ్రిని అడిగి అనుమానాలు తీర్చుకుంటూ ఉంటాడు సుదర్శనం. రమణ'సుధా' అని పిలుస్తూ ఉంటాడు కొడుకుని.

పోలికే కాదు...గుణాలు కూడా అచ్చం తండ్రివే అని అంటూ ఉంటుంది సుశీలమ్మ మనవణ్ణి చూసి, చిన్నతనంలో రమణ చేసే అల్లరులూ...ఆ చిలిపిచేష్టలూ గుర్తుకు తెచ్చుకుని వాటిని సుదర్శనం చేష్టలతో పోలుస్తూ ఉంటుంది.

ఒకరోజున సుదర్శనం అయిదారుగురు స్నేహితులను తీసుకొని వచ్చాడు, ఆడుకుందుకు. అందరూ కలిసి 'డాక్టరు ఆఫీసు ఆట' మొదలు పెట్టారు. డాక్టరుగా సుదర్శనం అతని కాంపౌండరుగా ప్రియమిత్రుడయిన రాముని పెట్టాడు. మరి నలుగురయిదుగురు పేషెంట్లని కూడా సంపాదించాడు. ఒకడు కడుపులో నొప్పి అంటూ పొట్ట చేతపట్టుకుని తయారయ్యాడు. వాడికి అక్కడే ఓ గాజు గ్లాసుడు మిక్స్చరులాంటి మంచినీళ్లు ఎక్కించాడు. మరొకడు గుండెల్లో పోటు అంటూ వచ్చాడు. తనదగ్గర ఉన్న బెడ్డింగు తాడుముక్కతోటి (అదే స్టెతస్కోపు) హార్ట్ పరీక్షించాడు. ఓసారి నాడి చూడాలనే వంకమీద వాడిచెయ్యి నలిపేశాడు. తర్వాత ఓ చిత్తుకాగితంమీద చిన్న పెన్సిలుపెట్టి ఏదో వ్రాసి అదే 'ప్రిస్క్రిప్షన్' అని యిచ్చాడు. మరో అమ్మాయి 'జ్వరం' అంటూ వచ్చింది. జేబులో ఉన్న సన్న పెన్సిలుపెట్టి రీడింగు చూసేశాడు, టెంపరేచర్ ఎక్కువగా కనిపిచడం చేత చీపురుపుల్ల (సిరంజి) నీళ్లలో ముంచి ఇంజక్షన్ కూడా చేశాడు.

ఇంజక్షను చేస్తూండగా సుశీలమ్మ హఠాత్తుగావచ్చి చూసింది. కుర్రాళ్లందరూ సిగ్గుతో చెల్లాచెదరయి పోయారు. మనవణ్ణి తనివితీరా ముద్దెట్టుకుంది. "తండ్రికి తగ్గ కొడుకురా...సుధా!" అని మనవడితో అని, "చూశావుటే మీా అబ్బాయి ప్రజ్ఞ...ఇంజక్షన్ చేసేస్తున్నాడు!" అంటూ కోడలిదగ్గరకి వచ్చింది. అది విన్న తాతయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ గది బయటకు వచ్చాడు. ★

★ ఆద్యంతాలు ★

[11-వ పేజీ తరువాయి]

ఆపాలని దంపతులు చూశారు. ఆమె యీసారి కొంచెం కఠినంగా అసమ్మతి ప్రకటించడం మనస్సుకి కష్టమనిపించింది. తన నిస్సారజీవితం తలుచుగుంటుంటే, రాధ హృదయాన్ని ఏదో మూగబాధ తడిగుడ్డని పిండిపెట్టినట్టు పిడపెడుతోంది. తనజీవితంలోకి చిట్టిప్రవేశ నిష్క్రమణాలు, ఏనాడో జీవించడం మానుకున్న పూలమొక్కకి ఎవరో దయదలిచి నీళ్ళుపోసి, అది చిగురువెయ్యగానే నీళ్ళు పొయ్యడం మానేసినట్టున్నాయి. మధు ఆమెను పిలిస్తే గదిలోంచి వచ్చింది. తుఫాను వెలిసిన ఆకాశంలా మొహం ఆమె మూగబాధని తెలుపుతోంది. దాని పరిష్కారపు తాళంచెవి అతని చేతిలో లేదు. ఎవరిచేతిలోనూ లేదు.

"పోనీ నువ్వూ భిలాయ్ వెళ్ళకూడదూ? కొన్నాళ్ళక్కడవుండి వద్దూగాని."

"..........."

"నా గురించి ఆలోచిస్తున్నావా? నేనెలాగేనా గడుపుకుపోగల్ను."

"ఎబ్బే, ఏం బావుంటుంది? ఛ.–అదీ కాకా, ఎన్నాళ్ళనీ వుండడం? అభిమానానికి అంతెక్కడనీ?" పెదాలమీద లేని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది.

"సరే, నీయిష్టం."

లోపల హేమ సామానంతా సర్దుకుంటున్న చప్పుడు రాధని మరీ క్రుంగదీసింది. ప్రకృతంతా తనకి విరోధంగానే పని చేస్తోంది! లోపలికివెళ్ళి తలుపువేసుకుని, నిద్రపోతున్న చిట్టిని బిగువుగా గుండెలికి హత్తుకుని పడుకుంది. చిట్టి సామీప్యం, రూపం, స్పర్శ గుండె లోతుల్లోంచి అలలుగా, కెరటాలుగా దుఃఖాన్ని విజృంభింపజేశాయి. యుగయుగాలుగా తనలో తను కుమిలిపోతున్న బాధనంతా తుఫానుగా వర్షిస్తూ ఏడుస్తున్న ప్రకృతి రాధ!

సాయంత్రం తలుపుతీసుకుని వచ్చేటప్పటికి మధు టిక్కెట్లతో అప్పుడే ప్రవేశించాడు. హేమ చిట్టిని ప్రయాణానికి బయలేరదీస్తోంది. రాధ గబగబ ముస్తాబై వచ్చేసరికి టాక్సీ వచ్చింది. అందరూ స్టేషనుకి చేరుకున్నారు. కంపార్ట్మెంట్ లో చోటు చూసుకుని కూచుంది హేమ.

"వెళ్ళగానే ఉత్తరం రాస్తావ్ కదూ? ఏం చిట్టీ, పిన్నికి నువ్వూ రాయాలి" అన్నాడు మధు. రాధ వెర్రిపిల్లలా చూస్తూనుంచుంది.

"అలాగే. ఎప్పుడో ఓసారి వీలుచేసుగుని యిద్దరూ రాకూడదూ?" అంది హేమ.

మధు నవ్వుతూ తలూపాడు. బండి కూత కూసింది. రాధ ఉండబట్టలేక పోయింది. ఒక్కసారి చిట్టిని ఎత్తుగుని గట్టిగా కావిలించుకుంది. దీనికంతా కారణం తెలుసుగున్న చిట్టి రాధ భుజాలమీద తల అదుముకుంటూ ఏడుస్తోంది. కాటిక అంతా పులుముకుపోయి కళ్ళు మరీ విశాలంగా కనిపిస్తున్నాయ్.

"అమ్మపిన్నీ, నువ్వూ రావూ?", అంది రాధ మొహం తనవెంపుకి తిప్పుగుని.

"అలాగేనమ్మా."

"ఎప్పుడూ?"

"నువ్వు బుద్ధిగా చదువుకుని పెద్దదానివై పెళ్ళి చేసుగునేటప్పుడు తప్పకుండా వస్తా."

"అమ్మో! అంతదాకా రావూ?" మొహంలో మొహం పెట్టి అడిగింది.

రాధ తలవంచుగుని ఏంచేస్తోందో మధుకి తెలుసు.

"బండి కదుల్తోంది. ఒదిలెకి యిచ్చెయ్ పిల్లని."

"ఎంత కఠినాత్మురాలివే అక్కాయ్," నవ్వడానికి వ్యర్థ ప్రయత్నంచేస్తూ అంది రాధ.

హేమ కళ్ళు చిట్లించి నవ్వుతూ చెయ్యి వూపింది. బండి కదిలింది. రాధ చిట్టికేసి ఆఖరిసారి చూసి, చెయ్యివూపి తలదించేసుగుని, పమిటికొంగు నోట్లో కుక్కుకుంటూ వెనక్కి తిరిగింది. ఈ దృశ్యాన్ని చూడలేక మధు పెద్దపెద్ద అంగలేసుగుంటూ వెళ్ళిపోయాడు ముందుకి.

* * *

నెల్లాళ్ళయాక, భిలాయ్ పోస్టల్ ముద్రతో ఒకఉత్తరం రాధకి తన కేరాఫ్ అడ్రెస్ తో కాలేజికిరాగానే మధు అప్రయత్నంగా కవరు చించాడు. చించాక పశ్చాత్తాప పడ్డాడు. ఎప్పుడూ రాధకొచ్చే ఉత్తరాలు చదవనివాడు, హేమ దగ్గర నుంచీ, (అదిదస్తూరీ తెలుస్తూనే ఉంది) అంగులో నెల్లాళ్ళ ఆలస్యం అయాకా రావడంతో కుతూహలాన్ని ఆపుకోలేకపోయాడు. చిట్టికూడా 'అమ్మపిన్ని'కి తప్పకుండా రాసిఉంటుంది. తనలా ఉత్తరాన్ని చించడమో, రహస్యంగా చదువుకూండడమో వెనకనుంచి రాధో, ఎవరో చూస్తే ఎలాగుంటుంది? ఈ ఆలోచన రాగానే సిగ్గుపడిపోయాగు. దౌర్బల్యానికి సంస్కారం ఒక్కొక్కప్పుడు లొంగిపోతుంది.

తీసి చదివినందుకు ప్రతిఫలంగా తగిలిన 'షాక్'నుంచిచాలాసేపుగాకోలుకోలేదు. ఉత్తరమంతా ముక్తసరిగా, నిందాగర్భితంగా నడిచింది. సారాంశం: చిట్టిభిలాయ్ వెళ్ళినప్పట్నుంచీ టైఫాయిడ్‌తో మంచమెక్కిందిట. రాత్రి నిద్రలో 'అమ్మపిన్నీ' అంటూ కలవరింతలతో ఏడవడం, రానురాను జ్వరంముదిరి 'డెలీరియం'లోకి దిగి, మూసిన కన్ను తెరవలేని అచేతనస్థితిలోకూడా 'అమ్మపిన్నీ'అని కలవరిస్తూనే పోయిందిట. టెంపరేచరు ప్రత్యక్షంగా ఎలాగూ కనిపిస్తూనేఉంది కనక డాక్టర్లే ఖుదర్పాలని హేమ పట్టుదల. చివర తగిలించిన ముక్కలే మధుని గుండెల్లో తన్నినట్టు బాధించాయ్.

"మధ్యలో ఎక్కడా దిగకుండా పెళ్ళినుంచి సరాసరి యిక్కడికే ఒచ్చేసిఉంటే, పిల్లదక్కేదేమో! ప్రాణం పోయేటప్పుడుకూడా కన్నతల్లిని విస్మరించడం ఏ కన్నతల్లి మరిచిపోగలదు?"

గుండె చేత్తో పట్టుకుని కూచుండిపోయాడు. హేమ అలారాసినందుకా? చిట్టికి నూరేళ్ళూ నిండినందుకా? రాధ యిదివిని ఏమౌతుందో అనా? దేన్నీ వెతికి పట్టుగోలేడు. హృదయం ప్రతిధ్వని పలకడంలేదు ఇంద్రియాలూ, బుద్ధీ బాహిరజ్ఞానాన్ని పోగొట్టుగుంటున్నాయ్. సృష్టి అర్థంలేని వికారస్వరూపంతో పళ్ళికిలిస్తోంది. శాంతనీ, చిట్టినీ ఎందుకిచ్చినట్టు? ఎందుకు లాక్కున్నట్టు? మానవజీవితంలో తర్కంలేదు.

ఉత్తరం వాసన చూశాడు. చిట్టి వాసన వేసింది. సరదాగా ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, నవ్విస్తూ ముచ్చటగా మూన్నాళ్ళలో జీవితాన్ని ముగించేసుకుని వెళ్ళిపోయిన చిట్టి ఒతికుండగా విలువకట్టలేనంత విలువైన చిట్టి! పోయినతరవాత, గుప్పెడు మట్టీ, గల్లటి ఎముకలూ, ఒకటిముప్పావు రోజుల సామీప్యం తాలూకు స్మృతులూ!

మనస్సు వెనకితిరిగి చూసింది. ఆ రోజు సాయంత్రం చిట్టివాళ్ళూ ఒచ్చారని రాధ పడ్డ వెర్రిఆనందం, హేమ కోడుతూంటే రోషపెళ్ళి చిట్టిని లాక్కోడం, ఆ గాఢ పరిష్వంగంలో రెండు నిండుహృదయాలు మూగబాధతో, మాడ్డంమానేసి నిశ్శబ్దంగా దర్శించడం, రాధ మొహాన్ని తన వెంపుకి తిప్పుకుని దిగులుగా చూసే చిట్టి, స్టేషనులోని అంత్యఘట్టం. చివరికి మిగిలినవి ఆద్యంతాల స్మృతులు!

రాధ! వెలిసిపోయి, కళాకాంతులు పోగొట్టుగుని ఎవరి నిర్దాక్షిణ్య ఫలితంగానో నేలరాలిన ఒక వాడినపువ్వు! ఆ పువ్వు మీదనుంచి విషాదానుభవాలు కర్కశంగా తొక్కుకుంటూ పోతున్నాయ్. ఉన్నట్టుండి ప్రపంచమంతా ఒక మహాశ్మశానం అయిపోతే ఆ బీభత్సవాతావరణంలో ఏకాంతంగా శిథిలాలమధ్య కూచుని సృష్టిని సింహావలోకనం చేసుకుని దానికి స్త్రీ హృదయం, కన్నతల్లి 'కడుపుతీపి' లేవని బాధపడుతుంది. శపించడానికి తను మునిపత్నో, దేవతాలలనో కాదు కనక తన ఆత్మతో తనురాజీపడి ఊరుకుంటుంది.

అనురాగం అవధిని దాటితే విషాదాంతంగా పరిణమించక మానదని థామస్ హార్డీ అంటాడు. చుట్టూ మత్తెక్కించే సౌందర్యభారంతో ప్రకృతి నవ్వుతూ చేతులెత్తి ఆహ్వానిస్తూంటే, ప్రపంచమంతా మిథ్యకనక సృష్టి సౌందర్యం అంతా మాయ అనుకుని కళ్ళుమూసుగు కూచోమనడం! రాధలాటి వ్యక్తులు ఇలా కృతంగా జీవించలేరు. నీళ్ళల్లోంచి తీసి గట్టున పడేసిన చేపల్లా అయిపోతారు.

నడుస్తున్నాడు. ఇల్లు ఒచ్చింది. రాధకి ఈ ఉత్తరంయిస్తే పర్యవసానం ఊహకందనిది. ఇవ్వకుండా, ఈ వార్త చెప్పకుండా ఊరుకుంటే ఎప్పటికైనా బయటపడితే తనకి నింద తప్పదు. ఇచ్చి ప్రమాదంలో పడ్డంకన్నా, నింద భరించడం చేతులారా కోరుకుని సంతోషంగా విషాన్ని మింగడం. చివరికి ఉత్తరం ఇవ్వలేదు. కాగితాల మడతల్లో దాచేసి, బీరువా మూసేశాడు. దొంగతనం చేసి బయట పడిపోతుందేమోనని బాధతో దొంగపడే అవస్థ ఎలాగుంటుందో అనుభవంలోకి బాగా వచ్చిందనుకున్నాడు. ఆ తరువాత రాధ చిట్టి ప్రసక్తి తెచ్చినప్పుడల్లా తన నేరానికి తను అనుభవించే బాధ ఒక ఆజన్మ శిక్షఅయి కూచుంది. ఒకటి రెండుసార్లు భిలాయ్‌నుంచి ఇంతదాకా ఉత్తరంకూడా రాలేదనీ, చిట్టిని చూడకపోతే ఉండలేనని నిశ్చయించుకుని రాధ చివరికి తన ఆత్మాభిమానాన్నికూడా త్యాగంచేసుకుని భిలాయ్ వెళ్ళి రావాలంటూ మొదలెట్టింది. ఈ కొత్త సమస్యతో మధు మరీ హడలిపోయాడు. ఆమె ప్రయాణ ప్రయత్నాన్ని మానిపించడానికి రకరకాల ఆటంకాలు ఆలోచించాడు. బతిమాలుకున్నాడు. ఆఖరికి వాయిదా వేస్తున్నాడు.

కాని మధు దొంగతనం దాగలేదు. ఒక రోజు సాయంత్రం కాలేజినుంచి తిరిగి ఒచ్చేసరికి రాధ చేతుల్లో మధుని వంచించిన దోషిలా ఒణికిపోతూ కనిపించింది ఆ ఉత్తరం. రాధ తలెత్తి అతన్ని చూసింది, ఆ చూపుల్లో జీవం, కాంతీ, రంగూ, భావం ఏదీలేదు. శుద్ధ వేదాంతిదృష్టి.

రాధదగ్గిర కూలబడ్డాడు.

"క్షమించవ్ రాధా? ఏ శిక్షా నా నేరానికి చాలదు. నీకేదైనా ప్రమాదం సంభవిస్తుందని చూపించలేను రాధా. క్షమించవ్?"

గొంతు ఒణికిపోతోందిఅస్థిరంగా. హఠాత్తుగా చచ్చిపోతే ఎంత బావుణ్ణనుకున్నాడు.

లోకానికి మొహం చూపించలేక శాశ్వతంగా కనపడకుండా, వినపడకుండా ఎక్కడికో మాయమైపోడానికి వెతికే మార్గం!

రాధ మళ్ళీ చూసింది. ఆమె పెదవులు విరక్తిగా పలుకుతున్నాయి.

"ఎంత పనిచేశారండీ! అక్క చిట్టిని నాకు దూరం చేసింది. మీరు ఆ వార్త వినడానికికూడా దూరంచేశారు!"

అందులో బాధలేదు. ఉద్రేకంలేదు.

అది ఆద్యంతాల స్మృతుల ప్రతిధ్వని. ★

★ కర్నూలు కబుర్లు ★

(16వ పేజీ తరువాయి)

తూంది. ఈక్యాంపులు మూడింటిలోకూడా పార్కు అనబడేది లేదు. ఈ సిమెంటు దిమ్మెలను తొలగించి, ఈప్రదేశాన్నంతా బాగుచేసి పార్కుగాని కాయగూరలక్షేత్రం (వెజిటబుల్ ఫారమ్)గాని ఏర్పాటు చేయమని స్థానిక ఎన్. జి. ఓ. సంఘంవారు తీర్మానించి ప్రభుత్వానికి సూచించారు. కాని భాగ్యనగరం బడా సాబ్‌లకు 'వినదగునెవ్వరు చెప్పిన' అన్న ఆర్యోక్తి అర్థం కాలేదేమో!

ఆదిలో ఈ క్యాంపుల్లోని ఇళ్ళ సర్కిళ్ళమధ్య ఒక నీటి ఫౌంటెన్, దాని చుట్టూ పిల్లలు ఆడుకోవడానికి ఇసుక, ఒకటి రెండు సీ-సా బల్లలూ అవీ వుండేవి. క్రమంగా అవన్నీ మాయమయిపోయి ఫౌంటెన్ల నిండా రాళ్ళు, ఫౌంటెన్ల చుట్టూ జిల్లేడు, పల్లేరు మొదలయిన మొక్కలు కన్పడుతున్నాయి. అప్పటి ఉపముఖ్యమంత్రి శ్రీ నీలంవారు తెరచారన్న విషయాన్ని చాటుతున్న పాలరాయి ఒకటి 'బి' క్యాంపు ఉత్తరదిశలోవుంది. దాని చుట్టూ ఒక పార్కులాటిదివుంది; కాని అక్కడ మచ్చుకోక గడ్డిపోచ కన్పించదు. అక్కడేపిల్లలు వుయ్యాల లూగడానికని నిర్దేశించబడిన స్తంభాలూ, కొక్కాలూ వున్నాయి. కాని ఉయ్యాలపీటలు గాని గొలుసులు గానిలేవు. ఆ ప్రక్కనే పిల్లలు ఎక్కి జారడానికి పన్నెండడుగుల ఎత్తుగలిగిన ఒక ఏటవాలు జారుడు బల్లలాటిది వుంది. రెండు పొడవయిన కర్రదిమ్మలమధ్య ఇనుపరేకులిని బిగించారు. ఈ బిగించిన వాటిలో ఏచీల వూడినా అజారుడురేకుల్లో ఒకటి పిల్లలకి పొడుచుకోకతప్పదు. ఇహ

★ కర్నూలు కబుర్లు ★

పిల్లలు ఈజారుడు రేకుమీద జారుతూ వేగంగా క్రిందకు వస్తే కఠినమయిన నేలమీద పడకతప్పదు. కారణం? అజారుడు బల్ల నేలను తాకేచోట ఇసుకఅన్నది కనపడదు. మద్రాసు మెరీనాబీచిల్లాటివి చూసినపుడు తెనుగుపిల్లలు ఆమాత్రం క్రీడా సౌకర్యాలకు నోచుకోలేదా అనిపించక తప్పదు.

క్యాంపులలోవారి శ్రవణానందానికని, రాజధానివున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వంవారు 1800 రూ. లు మంజూరుచేసి ఒక పెద్దరేడియోనూ, రెండు లౌడ్‌స్పీకర్లనూ ఏర్పాటుచేశారు. రాజధాని వున్నన్ని రోజులు మూడు క్యాంపులలోని ప్రజలూ ప్రతీసాయంకాలమూ ఈరేడియోని విని ఆనందించేవారు. రాజధాని వెళ్ళిన తర్వాత కొంతకాలంవరకు ఈరేడియో 'బి' క్యాంపు విద్యుచ్ఛక్తి కార్యాలయంనుండి పనిచేస్తూండేది. ఉన్నట్లుండి సంవత్సరంక్రితం ఒకరోజు ఈరేడియో వినపడడం మానేసింది.

ఇవన్నీ ఒక ఎత్తు. ఈ క్యాంపుల్లో నీటి సరఫరా ఒక ఎత్తు. అది రామాయణంలో సుందరకాండలాంటిది.

ఈ క్యాంపుల్లోని ఇళ్ళల్లో ఎ, బి, సి, డి, ఇ–అని ఐదు రకాలున్నాయి. ఆదాయాల్లో తేడా ననుసరించి ఉద్యోగులకు ఇళ్ళని కేటాయిస్తారు. అటెండర్లు, ప్యూన్లు లాటివారికి 'ఏ' టైపు ఇళ్ళు, దాదాపు వెయ్యిరూపాయల ఆదాయంకల పెద్ద ఆఫీసర్లకు 'ఇ' టైపు ఇళ్ళు, ఈ రెండు తరగతుల మధ్యవారికి బి, సి, డి, టైపు ఇళ్ళు-అని నిర్ణయించారు. ఒక్క 'బి' క్యాంపులో అన్ని టైపుల ఇళ్లూ కలిపి 700 దాకా వున్నాయి. వాటిలో ఆఫీసర్లుండే 'ఇ' టైపు ఇళ్ళు పది మాత్రమే! మిగతా ఇళ్లన్నిటిలోనూ ఇంటికొక్క కుళాయి చొప్పున వుంటే ఈ 'ఇ' టైపు ఇళ్లలో మాత్రం ఐదేసి కుళాయిల చొప్పున వున్నాయి. మిగతా ఇళ్లలోని కుళాయిలకు నీటిని తెచ్చే గొట్టంయొక్క (క్రాస్-సెక్షన్) వ్యాసం 1½ అంగుళాలైతే 'ఇ' టైపు ఇళ్లలోకి వెళ్ళే నీటిగొట్టాల వ్యాసం 6 అంగుళాలు! అంటే, మిగతా ఇళ్లల్లో ఒక్కనిముషం కాలంలో వచ్చే నీటికన్నా ఇరవైరెట్ల నీరు రాగల సౌకర్యం 'ఇ' టైపు ఇళ్ళల్లో వుందన్నమాట. 'ఏ' టైపు ఇంటిలోని ప్యూనూ, 'బి' టైపు ఇంటిలోని మహారాజశ్రీ గుమాస్తాగారూ 'నీటి ఛార్జీ' క్రింద నెలకు ఒక్కరూపాయు చెల్లిస్తారు. వీళ్ళిద్దరికన్న ఇరవైరెట్లు ఎక్కువ నీటి సౌకర్యంగల 'ఇ' టైపులోని వారు చెల్లించేదీ ఒక్క రూపాయేనన్న మాట!

ఈ నీటిగాధలే ఇంకా రెండున్నాయి. ...రాజధాని వున్నరోజులలో 'బి' 'సి' క్యాంపులు రెంటికి మాత్రమే రోజుకు 3 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేసేవారు. రాజధాని వెళ్ళిపోయిం తర్వాత 'ఏ, బి, సి' క్యాంపులు మూడింటికీ కలిపి 2 లక్షల గ్యాలన్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ మూడు క్యాంపులలోనూ ఇళ్ళన్నీ అలాగేవున్నాయి. వాటన్నిటి నిండా ప్రజలుంటున్నారు కూడాను! గత సంవత్సరందాక 36 వేల గ్యాలన్ల ఘనపరిమాణం కల్గిన రిజర్వాయరుతోనే రెండు పూటల నీళ్లు వస్తుండేవి. కొత్తగా ఒక లక్ష టన్నుల ఘనపరిమాణం కల్గిన రిజర్వాయరు నిర్మించిన తర్వాత సాయంకాలంపూట నీటి సరఫరా బొత్తిగా ఆగిపోయింది. విలోమ నిష్పత్తి అంటే ఇదే కాబోలు!

'రామాయణంలో పిడకల వేట'—ఏవిటంటే, ఈ క్యాంపులకు వాటికీ ఎక్కువగా నీరు సరఫరా చేయాలన్న దురుద్దేశంతో రెండు 'ఫిల్టర్–బెడ్'ల నిర్మాణాని కుపక్రమించి కొంత పని కొనసాగించారు. ఈలోపుగా రాజధాని ఇక్కడినుండి తరలిపోయింది. ఆ కారణంచేత ఇహ నీటి అవసరం అంత ఎక్కువగా వుండదని నిర్ణయించి, ఆ ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణాన్ని సగంలో ఆపేశారు బృహస్పతులు! ఇలాటి త్రిశంకు పథకాలమీద మనసొమ్ము ఎంత వమ్ము అవుతున్నదో తెలుసుకోవడం మన హక్కు అని భ్రమపడుతూ వుంటాం మనం.

ఇహ ఈ క్యాంపుల్లో రోడ్లరిపేర్లు చాల తమాషాగా వుంటాయి. ఏ గవర్నరో వచ్చినపుడు జరుగుతాయి; లేదా మార్చి నెల ఆఖరివారంలో జరుగుతాయి. అపుడిహ ఈ మరమ్మత్తు కార్యక్రమ సంచాలకులు అహోరాత్రాలు, పెట్రోమాక్సు దీపాలతో పని చేస్తుంటారు. సంవత్సరం పొడుగునా రోడ్ల ప్రక్కన నిద్రపోతున్న కంకరరాతి కుప్పలను కదిలించి, రోడ్ల మధ్య ఆ రాళ్ళను పోస్తారు. రోడ్ల ప్రక్కనున్న కాలువల్ని త్రవ్వి ఆ మట్టిని ఈ కంకర రాళ్ళమీద కప్పుతారు. దీనిమీద రోడ్ రోలర్‌ని ఒకటి రెండుసార్లు నడిపించి, ఇహ ఆ సంవత్సరానికి మరమ్మత్తుల గమ్మత్తయిపోయిందనిపించేసి, రంగంమీదనుండి తప్పుకుంటారు ఆ శాఖవారు. కారు వెళ్లినా, లారీ వెళ్లినా ఘట్టిగా గాలివీచినా ఈరోడ్లమీద మట్టి కాస్తా క్యాంపు ప్రజల ఇళ్ళల్లోకి, కళ్ళల్లోకి వెళ్ళిపోతుంటుంది. వర్షం వస్తే ఆ మిగిలిన మట్టి ప్రక్కనున్న కాల్వల్లోకి జారిపోతుంటుంది ఈ ఇంద్రజాలానికి 'రిపేరు' అని పేరు. ఈ రిపేర్ల పేరున ప్రతీ సంవత్సరమూ ఎన్నివేల రూపాయలను కాగితాల మీద చూపెడుతున్నారో, ఆ మొత్తంలో నిజంగా ఎంత శాతం ఖర్చు పెడుతున్నారో పెరుమాళ్ళ కెరుక !

ఈ క్యాంపుల్లో విద్యుచ్ఛక్తి సరఫరా ఒకటి మహారంజుగా వుంటుంది. 'పీక్ అవర్' (Peak Hour) అనబడేటువంటి సాయంకాలం ఆరు - రాత్రి తొమ్మిది ఘంటల మధ్యకాలంలో విద్యుచ్ఛక్తి లోడ్ (Load) 220 వోల్టులనుండి 180 వోల్టులకు దిగిపోతుంది. ఆ వేళల్లో ఈ వూరిలో ఎసి/డిసి రేడియోలు పలుకగా విన్నవాడు ధన్యుడు; ఆ వేళలో 60 వాట్లు బల్బు 30 వాట్ల బల్బులా వెల్గడం" తథ్యము. ఎందుకో అని కనుక్కుంటే 'ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ' చాలదట. క్యాంపుల్లో వాడబడే విద్యుచ్ఛక్తి మొత్తాన్ని సరఫరా చేయలేని తక్కువ శక్తి ట్రాన్స్‌ఫార్మర్ కారణమట. ఇటు ప్రజల కవస్థ, అటు - కొన్నివేల రూపాయల ఖరీదుచేసే ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఆరోగ్యానికీ, ఆయుర్దాయానికీ భంగమూనట! ఒకే దెబ్బకు రెండు పిట్టలంటే ఇదే ననుకుంటాను.

'బి' క్యాంపులో పిల్లలకు ఒక మాధ్యమిక పాఠశాలవుంది; దానికొక చక్కటి భవనం వుంది. దాని ప్రక్కనే ఒక పర్ణశాలలో ప్రాథమిక పాఠశాల నడుస్తుండేది. ఆ పర్ణశాల జీర్ణమయిపోయిన తర్వాత, పది నెలల నుండీ ప్రాథమిక పాఠశాలను (పి. డబ్లియు. డి. వారి నమూనా లుంచుకునే) రేకుల షెడ్‌లో నడుపుతున్నారు. వైద్యకళాశాలలకూ, ఇంజనీరింగ్ కళాశాలలకూ, లక్షలు గుమ్మరిస్తున్నవారు కేవలం ఒక ప్రాథమిక పాఠశాలకు భవనం లేకుండా చేయడంలో తాత్పర్యమేమిటి? దేశానికి ప్రాథమిక పాఠశాలలకన్న కళాశాలలే అవసరమనేనా!

ఆఖరున చెప్పుకోవలసింది రవాణా సౌకర్యం. ఈ క్యాంపులనుండి టౌనులోకి వెళ్ళడానికి ఒక్కటంటే ఒక్కటే బస్సుంది. దాని వేళలకు, మన అవసరాలకు పొత్తు కుదరదు.

ఇది మన మాజీ రాజధాని! ★



సినిమా

చలనచిత్రోత్సవం

ఏప్రిల్ 18 నుండి 22 వరకూ జరిగిన ఇటాలియన్ చలనచిత్రోత్సవంలో పాల్గొన్నవారెవరూ చాలారోజులవరకూ దీనిని మరచిపోరు.

ఆరేడేళ్ళనాడు మనదేశంలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగింది. ఇతర దేశాల మంచిచిత్రాలు చూచి ఆనందించాలని తహతహలాడే వారందరికీ అది మహదవకాశమైంది. ఆ ఉత్సవాలను ఆనాటిచిత్రాలను ఎవరు మరచిపోలేదు. కొంచెం ఎక్కువ అభిమానం ఉన్న సినీ జనులు వాటిలో మనకి పనికొచ్చే కథా కమామిషులను మరింత మననంచేసుకొని దేశవాళీ చిత్రాలలోకి ఫిరాయించారు. అప్పటి ఇటాలియన్ చిత్రం 'బైసికిల్ తీవ్స్' బొంబాయి దర్శక నిర్మాతల ఊహాపోహాలమీద పెద్దముద్ర వేసింది. నవవాస్తవిక శిల్పం మనచిత్రాలలోకి వ్యాపించింది. అలాగే జాపనీస్ చిత్రం 'యూకివారిసూ' కథ పండితసుఖ్‌రాంశర్మ ధర్మమా అని ఇంతవరకూ ఎన్నో ఫాన్సీ డ్రెస్సులు వేసుకుని సినిమాలు తీయించుకుంది. ఎన్ని అంటే నేను చెప్పలేను. బహుశా ఆయనా చెప్పలేరు. 'రోషమాన్'ను దక్షిణాదిన బాలచందర్ అనే దర్శకుడు 'తమిళించారు'. చాలాబాగా చేశారని చాలామంది అన్నారు. ఆ చిత్రానికి (అందనాళ్) ప్రభుత్వబహుమతికూడా లభించింది.

ఇంతకీ చెప్పవచ్చిన విషయం, ఇలా విదేశ చిత్రాలతో ఉత్సవాలు పెడితే మనవాళ్ళు అవి చెక్కెయ్యడానికి గంభీరంగా పోజులుపెట్టి బహుమతులందుకోడానికి చాలా సదుపాయంగా ఉంటుం



స్వస్తిశ్రీవారి జానపదచిత్రంలో 'రేచుక్క, పగటిచుక్క'లో ఎన్. టి. రామారావు, జానకి.

★ చలనచిత్రోత్సవం ★

వన్నది కాసేకాదు. రెండుదేశాల ప్రజలు ఒకరినొకరు అర్థంచేసుకోడానికీ, దరిమిలా తమ చిత్రాలను పరస్పరం చూపి కొత్త "అర్థం" కూడా చేసుకోడానికీ, మొత్తం మీద స్నేహం పెంపొందించుకోడానికీ ఇది యోగ్యమైనపని. పనిలో పనిగా కాస్తగుణ దోషాలనుకూడా పరటాయిచ్చుకుంటే పర వాలేదేమో.

ఇటాలియన్ చిత్రంలో కూడా దోషా లుంటాయా? అని మీరు ఆశ్చర్యపోనక్కర లేదు. సెన్సారువారిని కనుక్కోండి. వారు మొన్న ఉత్సవానికి వచ్చిన ఇటాలియన్ చిత్రాలలో కత్తిరించినవన్నీ అవే అయి ఉంటాయి.

సెన్సార్ కట్ అనగానే—అందులో ఇటాలియన్ చిత్రాల విషయంలో-బహుశా సెక్స్ట్రార్డినరీ సీనులు అయి ఉంటాయని కొందరు దురభిప్రాయపడవచ్చు.

అవి కాదని, ఇటాలియన్ దర్శకుడు లాటివాడా అన్నారు. మొత్తానికి సెన్సారు వారు ఇలా కొన్నిభాగాలు కత్తిరించడం తమకు ఆశ్చర్యం కలిగించిందనీ, తమదేశంలో చలనచిత్రకళాకారులు సెన్సారు పద్ధతికి శుద్ధ వ్యతిరేకులనీ ఆయన చెప్పారు.

నిజానికి వ్యతిరేకించడం విషయంలో అగ్రస్థానం మనదే అవుతుంది.

మొత్తానికి ఇటాలియన్ ఉత్సవం చాలా బాగా జరిగింది. నాలుగు చిత్రాలు — స్కాండల్ ఇన్ సారెంటో, హెరాడ్ ది గ్రేట్, దిగర్ల్ ఆఫ్ పాలియో, ది రివోల్ట్ ఆఫ్ ది గ్లేడియేటర్స్-ప్రదర్శించారు. ఉత్సవ నిర్వాహకులు 'యూనిటాలియా' సంస్థ మన కళాకారులకూ భారత ఫిలిం నిర్మాతల సంఘాలవారు ఇటాలియన్లగౌరవార్థమూ విందు చేశారు. సినిమా పెద్దలేకాక, గవర్నరు శ్రీ ప్రకాశ, 'ఇటాలియన్ కౌన్సల్ డా॥ విటో రియోలావిసన్, తదితర పురప్రముఖులూ పలువురు వచ్చారు ఇటలీనుండి వచ్చిన బృందంలో ముఖ్యులు యూనిటాలియా ఫిల్మ్ డైరెక్టరు జనరల్ లిడియో బాజినీ, దర్శకులు అల్బర్ట్ లాట్వాడా, డినో రిసీ, నిర్మాత మార్కో వికారియో, తారలు రోసానా (హెలెన్ ఆఫ్ట్రాయ్) పొడెస్టా, ఫ్రాంకో బెటోజా.

* * *

మనదేశంలో విడుదలయే విదేశీ చిత్రాలు హాలివుడ్ వే. మహాఅయితే బ్రిటన్వి. అంతకు మించి, యూరప్ దేశాల చిత్రాలేవి ఇటు రావటంలేదు. అవి రవడానికీ, మనవి ఆ దేశాలు వెళ్ళడానికీ సదుపాయం చేయాలని చాలా రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇటలీకి సంబంధించినంతవరకూ ఇన్నాళ్ళకి ఈ వ్యవహారం దారినపడేలా ఉంది. ఆ దారిచూపిన భారతీయ చిత్రాలు సత్యజిత్ రాయ్ తీసిన పథేర్ పాంచాలి, అపరాజిత.

వీటిని, శాంతారాంచిత్రం, దో ఆంఖే, బారా హాత్ ను ఇటలీలో విడుదల చేయబోతున్నారు. ముఖ్ముందు ఇతర భారతీయ చిత్రాలకుకూడా ప్రవేశం లభిస్తుందని అంతా ఆశిస్తున్నారు.

ఆషిక్

తెలుగు దర్శకనిర్మాత ఎల్. వి. (ఛోటీ బహెన్) ప్రసాద్ రూబెన్ డూబే ప్రొడక్షన్స్ కొత్త చిత్రం 'ఆషిక్'కు దర్శకత్వం స్వీకరించారు. రాజ్ కపూర్, పద్మిని నటించే ఈ చిత్రానికి గతవారం ప్రారంభోత్సవం పూజ జరిగింది. అభిభట్టాచార్య, నంద షేబీనాజ్, జోకర్ జానీవాకర్ ఇతరనటులు సంగీత దర్శకులు శంకర్, జైకిషన్లు.

ప్రసాద్, ప్రస్తుతం ఆంధ్రలోని ఒక ప్రకృతి చికిత్సాకేంద్రంలో విశ్రాంతి తీసుకొంటున్నారు. ఆయనరాగానే షూటింగ్ ఆరంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. —టచ్ స్టోన్.



వ్యస్తిశ్రీవారి 'రేచుక్క పగటిచుక్క' చిత్రంలో రంగారావు, కన్నాంబ.

సినిమాలూ నృత్యాలు



కళ, వ్యాపారం కలసి సాగే మిశ్రమ పరిశ్రమ సినిమా. అందువల్ల జరుగతగినది ఏది అన్న ప్రశ్నను అలా ఉంచి జరుగుతున్నకథ ఏమిటి అని పరిశీలిస్తే, అన్నిటా ఈ రెండు లక్షణాలకూ సమన్వయం కుదర్చడానికే కృషి సాగుతోందనే విషయం విశదమవుతుంది.

ఈమాట అన్నిటితోపాటు నృత్యాలకూ వర్తిస్తుంది. ఈనాడు నృత్యం సినీమాలో ఒక ముఖ్యాంశమని చెప్పకతప్పదు. ఇప్పుడు, ఈనృత్యాలు ఎంత అభివృద్ధిని సాధించాయి, ఏ స్థాయిలో ఉన్నాయి, దీనికి నృత్యదర్శకుడు ఎంతవరకు బాధ్యుడు అనేది చర్చించ తగినవిషయం.

ప్రమాణ నిర్ణాయకులు ఎవరు?

చిత్రాలలో ప్రదర్శింపబడుతున్న నాట్యనృత్తనృత్యములు శాస్త్రీయమైనవా? కావా? అన్న ప్రశ్న నిజానికి ఈనాటిది కానేకాదు. దీనిని గురించిన వాదోపవాదాలు చర్చలు చాలా కాలమునుంచి సాగుతునే ఉన్నవి. ఇదమిత్థముగా ఈ విషయాన్ని ఎవ్వరూ సిద్ధాంతీకరించి చెప్పలేరు. సినీమాలలో ప్రదర్శితమవుతున్న ఈ నాట్యాలు శాస్త్రీయమైనవా! కావా? అన్న విషయాన్ని నిర్ణయించుకోవలసినది ప్రేక్షకులు కారు. కంటికింపుగా ఉంటే చాలు. ప్రజలు మెచ్చుకుంటారు. వారికి ఇందులో ఎంతవరకు శాస్త్రముందో అవసరము లేదు. ఫలానా నృత్యం ఏ బాణీకి సంబంధించినదీ, ఎంతవరకు శాస్త్రీయమైనది అనేది సామాన్యప్రేక్షకులకు తెలియనూ తెలియదు; అంత చర్చ వారికి అవసరము లేదు. ఇది శాస్త్రీయమో అశాస్త్రీయమో తెలుసుకొనవలసినది, నిర్ణయించగలిగేది, నిర్ణయించుకోవలసినది శాస్త్ర పరిజ్ఞానము ఉన్నవారు మాత్రమే. వారు ప్రమాణాలు నిర్ణయించి ఆమేరకు కళస్థాయిని నిలిపితే, అదే ప్రజాబాహుళ్యం అభిరుచులను మంచి మార్గాన పెట్టి అభివృద్ధికి దోహదం చేయడం అవుతుంది.

నాట్యము సంప్రదాయసిద్ధముగా వస్తున్న కళ. గురుముఖముగా అభ్యసించి దివారాత్రాలు కృషి చేస్తేనే కాని అందులో ప్రత్యేకతను సాధించటము కష్టము. గురుపీఠాన్ని అధిష్టించిన ఆచార్యులు శిష్యులకు శాస్త్రీయమైన నాట్యాన్ని సంప్రదాయానుగుణంగా బోధించడంలో యేలోటూ వుండదు. గురుముఖంగా అభ్యసించబడిన ఈ నాట్య సంప్రదాయమే చలన చిత్రాలలోని నాట్యాలకు పునాది. అదే బలముమీద అదే శిక్షణ మీద సంప్రదాయముమీద ఈ సినీమా నాట్యాలు కూడా జీవం పోసుకోవాలి లేకపోతే గత్యంతరము లేదు.

నేల విడిచి

నేలను విడిచి సాము చేయగలమా? చలన చిత్రాలలో నాట్యాన్ని రూపొందిస్తున్న నాట్య దర్శకులు కూడా తమకు తెలిసినంత వరకు ఎక్కడా హద్దు జారిపోరని అనుకుంటా. కథాభాగములోని సన్నివేశాన్ని గురించి బాగా ఆకళింపు చేసుకుని పరిమితమైన కాలములో పండిత పామరులను రంజింపజేసేదిగా కూర్చుకోవడము శాస్త్రాధారము లేకుండా జరిగేపనేనా?

కథావస్తువు కనుగుణంగా హావభావ అంగవిన్యాసాలను జోడించుకొని కాలానుగుణంగా కొద్ది మార్పులతో పాత్రౌచిత్యానికిభంగం కలుగకుండా సంప్రదాయానుసారంగా నృత్యాలను గూర్చి సుశిక్షణ యివ్వవలసిన గురుతరబాధ్యత నాట్య దర్శకునిది.

సమన్వయం

సన్నివేశానికి రాసినపాటలో కవిపొందుపరచిన భావానికి సంగీత దర్శకులు రాగతాళాలనేకాక నాట్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని లేదా నాట్యదర్శకుని ఉద్దేశములు (జతులు గాని, నడకలు గాని) చక్కగా అవగాహన చేసుకుని చర్చించి సంగీతము కూర్చినప్పుడే. అటు నాట్యమూ ఇటు సంగీతమూ చక్కని స్థాయి నందుకొనగలవు. అభినయానానందకరముగా రూపొంది ప్రజాదరణ పొందగలవు. పండితుల ప్రశంసలూ అందుకోగలవు. అటు ఆర్టిస్టులు ఇటు దర్శకులూ కూడా, నిర్ణయించిన హద్దులను మీరపోకుండా లభించిన పరిధిలోనే ఈ విధంగా నృత్య సంప్రదాయాన్ని మన్నిస్తూ, తమ నైపుణిని, వ్యక్తిత్వాన్ని ప్రదర్శనంలో ప్రస్ఫుటంగా చూపవలసి ఉన్నది.

తెరమీద నాట్యదర్శకుని పేరు మీరు చూస్తూనే ఉన్నారు. నాట్యదర్శకుని బాధ్యత ఎంతవరకు ఉంటుందో మీరు గ్రహించగలరు.

కత్తిమీద సాము చేయుడ మెలాటిదో చిత్రాలలో నాట్యదర్శకుని వృత్తికూడా అలాంటిదే అంటారు.

సంప్రదాయం, కళాసృష్టి

పాశ్చాత్య చిత్రాలలోని నాట్యాలలో ఎప్పుడూ నూతనత్వము కనిపిస్తూనే ఉంటుంది. మన చిత్రాలలోని నాట్యములలో అట్టివి కనిపించకపోవడానికి కారణము ఏమిటి? అని మాట్లాడడము మీరు వింటూనే ఉంటారు. మనదేశములోనే విభిన్న సంప్రదాయాలు ఆచరణలో ఉన్నవి. ఉదాహరణకు శాస్త్రీ

సినిమాలో నృత్యాలు

లోనూ భిల్లు, కోయ మొదలగువారు చేయు నవేశపూరితమైన నృత్యాలలోను ముద్రాభినయము ఉన్నదా లేదా? అని మనము పాటించటం లేదు.

మన చిత్రాలలో అధునాతనమైన ఒక క్లబ్‌దృశ్యంగాని, ఆ తరహాకు చెందిన సన్నివేశముగాని వచ్చినపుడు, మన సంప్రదాయముకదా అని భరతనాట్యభంగిములు చూపలేముకదా. మనకు కావలసినది ఫలానా సన్నివేశానికి అనుగుణమైన నాట్యము ఉన్నదా, లేదా అనేది. ఇక్కడ నాట్య దర్శకునికిగల అవధులు అంతే.

దోహదం

సర్వ ప్రపంచానికి భావరాగ తాళములు ఒకటే అయినప్పటికి వారివారి భాషా సంస్కృతి సంప్రదాయములను బట్టి కళలు కూడా రూపు ధరిస్తూ ఉంటాయి. అలాగే పాశ్చాత్య నాట్యములలో విజ్ఞాన వికాసాలకూ ప్రాధాన్యము ఇచ్చుటచే నూతనత్వము తెలియుచున్నది. మనసంప్రదాయానికి కొన్ని హద్దులు వున్నాయి. ఆ హద్దులలోనే మన నాట్యాన్ని కూడా నూతన విధానాలలో ముందుకు తీసుకురావటానికి మనము చాలా కృషి చేయవలసి ఉన్నది. ఈ కృషికి కావలసిన దోహదాన్ని తగిన ప్రోత్సాహాన్ని అటు ప్రభుత్వము ఇటు ప్రజలు అందజేస్తే మన నాట్యాలుకూడా మంచి స్థాయికి వస్తాయి. అట్టి నాట్యాలను చిత్రాలలో ప్రవేశపెట్టడానికి ఎంతో వీలు కలుగుతుంది.

ఈనాటి చిత్రపరిశ్రమలో నాట్యాలకు ప్రముఖ స్థానమున్నప్పటికి కళాభిమానము గల నిర్మాతలను వదలి మిగిలిన నిర్మాతలు ఈ కళకు ఎంతవరకు దోహదమిస్తున్నారు అనేది విచారించవలసి ఉన్నది. నృత్య దర్శకుడుకూడా కేవలము కళాదృష్టితోనే వ్యవహరిస్తు కూర్చుంటే కాలంగడుపడం కష్టం. అది సాకుగా తీసుకున్న నిర్మాతలు ఒకరిని మార్చి ఇంకొకరిని వ్యాపారదృష్టిలో ఉపయోగించుచున్నారు. కొంతమంది నిర్మాతలైనా ఈకళను గుర్తించగలవారు ఉండబట్టే చిత్రాలలో నృత్యదర్శకునికి ఒక స్థానమనేది కలుగుచున్నది.





చలనచిత్ర నృత్యదర్శకత్వం

సినిమాలో నృత్య దర్శకునికి కామెరా అనుభవము కూడా అవుసరము. కొంత పరిజ్ఞానమైన తప్పక కావలసి ఉంటుంది. అలాగే ఎడిటంగ్ గురించీ తెలిసి ఉండాలి ఒక విన్యాసము చూపునపుడు లేక చక్కని ముఖభావమును ప్రదర్శింప జేయునపుడు కనీసము దుర్భిణీయంత్రములోనైనా చూచుకొని తాను అనుకొన్న భావము ఎంతవరకు ప్రస్ఫుటమగుచున్నది, తాను చూపదలచిన కదలికలలో దేనికి ప్రాధాన్యం ఇవ్వవలసినది ఛాయాగ్రహణ దర్శకునితో కలసి ఆలోచించుకొంటూ చక్కని నృత్యములు తీసుకోనవచ్చును.

దర్శకునికి నృత్యదర్శకునికి కూడా దృక్పధాల సమన్వయం ఉండడం ముఖ్యం. ఒకరిభావాల నొకరు అర్థము చేసుకొని చర్చించుకొని కార్యరంగములో సమిష్టిగా వ్యవహరించాలి. అప్పుడే కళ దృష్ట్యానూ వ్యాపారరీత్యానూ కూడా చిత్రములలోని నాట్యాలు వన్నెకెక్కగలవు.

నృత్యదర్శకుని అభిప్రాయములను, భావాలను అంగవిన్యాసములను గ్రహిస్తూ తగిన దోహదమిస్తూ తనలోని కళాతృష్ణను క్రోడీకరించుకొని నర్తకులు కూడా అన్నివిధాలా నృత్య దర్శకునికి బాసటగా ఉండాలి. కళ ఒకరిసొమ్ముకాదు కాన, అట్లు ఒకరినొకరు అర్థముచేసుకొని చక్కని ప్రదర్శన మిచ్చిన కళామతల్లి కార్తికపౌర్ణమినాటి చంద్రుని వలె వెలుగొందుతుంది. రచయిత, నృత్య దర్శకుడు, దర్శకుడు—వీరందరి భావాలకూ, తమభావాలను జోడించి, నృత్యం చేసే నటీనటులు ప్రేక్షకులకు అందిస్తారు. అంత ముఖ్యమైన భూమిక వారిది.

ఈనాటి ప్రముఖపాత్రలు వహిస్తున్న వారందరుకూడా నృత్యదర్శకునికీ దోహదం చేస్తున్నారని తలుస్తా. అందువల్లనే సినిమా నృత్యాలు సజీవంగా నడుస్తున్నవని చెప్పవలసి వస్తున్నది.

ఎడిటింగ్


ఆర్టిస్టుయొక్క చలనక్రమ విధానాన్ని

గుర్తుంచుకొని విన్యాసమునుంచి విన్యాసానికి వెళ్ళుసమయములో కప్పదాటులు రాకుండా ఎక్కడికక్కడ చేస్తూ 'పాట్సు'ను కూర్చుకోవలసిన బాధ్యత నృత్యదర్శకునిదే. అలా నిర్వహించిననాడే చిత్రాలలోని నృత్యము సాఫీగా సాగుతుంది. లేకపోతే ఫిలిమ్ ఎడిటరూ ఆ తరువాత ప్రేక్షకులూ నానా యాతనలూ పడవలసివస్తుంది. ముఖ్యంగా ఎడిటింగ్ గురించి నృత్యదర్శకుడు తెలుసుకోవలసిన అవశ్యకత వున్నదా లేదా? ఒక నాట్యములో ఎనిమిది అవృతములుగల జతిగాని, లేక ముక్తాయిగాని మనము చూపునపుడు, ఆ ఎనిమిది అవృతములకూ ఎన్ని సెకండ్లు అవుతుంది, ఒక నిమిషములో ఎన్ని అడుగుల ఫిలిం నడుస్తుందీ అనేది చూడాలి. అది గుర్తుంచుకొని ఆ కాల పరిమితినిబట్టి ఎనిమిది అవృతముల ముక్తాయినీ, ఒకేసాటులో చూసిన బాగుండదు. కొన వాటిని కొన్ని భాగములుగా తీసుకొని పాదములు కొంతసేపు, ముఖభంగిమలు కొంతసేపు, హస్తాదివిన్యాసములు కొంతసేపుగా విభజించుకొని, ఆయా అంగచలనములకు ప్రాధాన్యత నిర్ణయించుకొని తాను ఇచ్చిన ప్రధాన భాగములను ఎడిటరుగారికి చెప్పి ఆప్రకారం కూర్పించుకొనని యెడల చిత్రములోని నృత్యం రాణించదనియే చెప్పాలి.

సందర్భశుద్ధి

చిత్రములలోని నృత్యాలు సహజంగా రూపొందాలంటే కథాభాగంలో అవి కలిసేట్టుగా ఉండడం అవసరము. అసహజ సన్నివేశాలలో నాట్యములు చొప్పించకుండా కేవలము వినోదముకొరకే నాట్యములను ఉపయోగించకుండా, పరిమిత పద్ధతులలో ఉపయోగించిననాడే చలనచిత్రాలలో నాట్యములు వన్నెకెక్కగలవు. గొప్పఫలితాలు సాధించగలవు. ఈ విషయములో నృత్యదర్శకుడు ప్రత్యేకశ్రద్ధతో పనిచేయాలి. నృత్యదర్శకుడు అన్నివిధములైన నృత్యసన్నివేశాలనూ పుష్టికరంగా సృష్టించడానికిగాను తాను గురుముఖంగా తెలుసుకొన్న సంప్రదాయాన్ని అనునయంచేసుకుంటూ ఇతర సంప్రదాయములు గూడా దృష్టిలోనుంచుకొని తదనుభవాన్ని తాననుభవించి ప్రదర్శింపజేస్తూ పైజెప్పిన వారందరితోను సన్నిహితంగా నడుచుకుంటూఉన్ననాడే నృత్యదర్శకుడుకూడా. ఉత్తమస్థాయిని అంగుకోగలడు. చిత్రాలలోని నృత్యాలనుగూడా ఒకస్థాయికి తీసుకువచ్చినవాడౌతాడు.

మన చిత్రాలలోని నృత్యాలను ఉత్తమ శ్రేణికి పెంచి ఉత్తమ కళారీతుల్ని ప్రవేశపెట్టి వ్యక్తిత్వము, చైతన్యముగల నృత్యాలను నిర్వహిస్తే అవి ప్రజారంజకములవుతాయి. ఆ రోజు పండితులను సహితము మెప్పిస్తాయని నా నమ్మకం. ★



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'ఇల్లరికం' చిత్రంలో ఆదోని లక్ష్మి, రేలంగి, రమణారెడ్డి.

చిత్రలేఖలు

ఆర్యా,

కాపీరైటరుగారి మాటే రైటు. అసలు కాపీరైటు అన్న మాటలోనే కాపీ చాలా రైటైన పని అనిన్నీ, కాపీ ఒక రైటు (హక్కు) అనిన్నీ, తాత్పర్యాలు దాంకుని ఉన్నాయి అని పెద్దల క్రిటికా తాత్పర్యాలు ఘోషిస్తున్నాయి. అందువల్లనే ఇరుగు పొరుగుల కథలూ, పాటలూ కాపీ కొట్టడం జరుగుతోంది. కాగా సాటివారి గుణదోషాలలో గుణాల్ని పరిగ్రహించమన్నారు గాబట్టి, డబ్బు గణించే గుణముందని ఋజువైన వాటినే గ్రహించడం గొప్ప విషయం. అందులో స్వారస్యం అందరికీ ఏం తెలుసు?

కాపీరైటింగేల్.

* * *

ఆర్యా,

విదేశీ చిత్రాలలో హాలీవుడ్ బ్రిటిషు చిత్రాలు దేశంలో విడుదల కావడంవల్ల దేశీయ పరిశ్రమకు వచ్చిపడిన అరిష్టం అందరికీ తెలిసినదే. ఏ సీను, ఏ పాట, ఏ కథ ఎందులోదో ప్రతివాడూ పసిగట్టి, మన పిక్చర్లను తిట్టిపోస్తున్నాడు. జరిగిందేదో జరిగింది. ఇటుపై ఇటలీ జపాన్ చిత్రాల ఫెస్టివల్సు ముమ్మరంగా జరిగేలావున్నాయి కాబట్టి మాదొక విజ్ఞప్తి. ఈ ఉత్సవాలకు పెద్ద పబ్లిసిటీ గట్రా ఇచ్చి అదేపనిగా అందరికీ చూపించెయ్యడం ఏమంత మంచి పనిగాదు. కొందరు రచయితలకూ, దర్శకనిర్మాతలకూ మాత్రమే ప్రవేశం ఇస్తూ టూకీగా బొంబాయిలో తేమిల్చెయ్యాలి. మళ్ళా మద్రాసు, బెంగుళూరు అనడం న్యాయం కాదు. మద్రాసు వాళ్ళు ఎలాగా ఏ కథ అయినా బొంబాయి ఫిలిం శంఖంలోంచి వచ్చి తీర్థం అయేదాకా ఆగేవాళ్ళే కాబట్టి ఆ ప్రాడ్యూసర్లు ఆనక హిందీ ఫిలిములు చూశాకనే 'ముందడుగు' వేస్తారు. అందువల్ల ఈ యూరప్ దేశాల చలనచిత్రోత్సవాలనైనా ఫిలింవాళ్ళకే పరిమితం చేయగోరుచున్నాను.

కొందరు కథార్థులు.

ఆంగ్లా కాంక్ష

ఆర్యా,


సిలోన్ రేడియోలో ఇంగ్లీషు, అమెరికన్, స్పానిష్ రికార్డుల ప్రసారం తక్షణం రద్దు చేయించ గోరుచున్నాను. శ్రోతలు అవి కూడా మేమిచ్చిన ట్యూన్‌లే అని ఆరోపిస్తూ ఫాన్ లెటర్లు గుప్పిస్తున్నారు.

—బొంబే మ్యూజిక్ డైరెక్టర్

ఆర్యా,

సిలోన్ రేడియోలో బొంబాయి ఫిలిం మ్యూజిక్ రికార్డులు పెట్టడం తక్షణం ఆపించ గోరుతున్నాము. శ్రోతలు అవి కూడా మేమిచ్చిన ట్యూన్‌లే అని ఆరోపిస్తూ ఫాన్ లెటర్లు గుప్పిస్తున్నారు

సౌతిండియన్ ప్రొడ్యూసర్, మరియు హిట్ రికార్డర్. ★



ఏప్రిల్ 19 న అన్నపూర్ణావారి 'మాంగల్యబలం' చిత్రం శతదినోత్సవాలు జరుపుకొంది. శ్రీ నాగయ్య అధ్యక్షతను జరిగిన సభలో శ్రీమతి అంజలీదేవి, అన్నపూర్ణ, నవయుగ సంస్థల తరఫున బహుమతులను పంచిపెట్టి ఆయా కళాకారులను అభినందించారు. (ఎడమనుండి) దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు, రచయిత శ్రీ ఆత్రేయ, నవయుగ ఫిలింస్ అధిపతి శ్రీ కె. శ్రీనివాసరావు, నిర్మాత శ్రీ డి. మధుసూదనరావు.

వార్తావరణం

మే నెల విడుదల కాగల చిత్రాలతో, వాటివెనక కాచుకున్న వాటి పేర్లతో 'విడుదల కార్యక్రమాల కాగితాలు, కిటకిటలాడిపోతున్నాయి.

చాలా చిత్రాలు తయారై విడుదలకు కాచుకుని ఉండగా మరికొన్ని కొత్తగా తయారయ్యాయి. కొన్ని కొద్దిరోజులలో సిద్ధం కాబోతున్నాయి. విడుదలకు ఇన్ని సిద్ధంగా వున్నందువల్ల దానికితోడు ఫిలిం కోటాలు అందనందువల్ల సగంలో వున్న వాటి నిర్మాణం కొంచెం నిదానంగా సాగుతోంది. అందువల్ల స్టుడియోలుకూడా సరంభంతో ఊహు అదే పనిగా కలకలలాడిపోవడం లేదు. రెండు నెల్ల క్రితంలా సెట్లకోసం విపరీతమైన రద్దీ లేదు. స్టుడియో ఎగ్జిక్యూటివ్‌లు ఊపిరి తీసుకోడానికి కొంత సదుపాయంగానే ఉంది.

మే నెల సగం తిరిగేసరికి, పెద్ద నటులూ, దర్శకులూ వేసవి విడుదులకు తరలిపోయి విశ్రాంతి తీసుకోవాలని కార్యక్రమాలు నిర్ణయించుకుంటున్నారు. తెలుగుతారలంతా అంజలీదేవి, భానుమతి, సావిత్రి, నాగేశ్వరరావు మొదలగు వారంతా ఊటీ, కొడైకెనాల్, కుర్తాళం వగైరా విశ్రాంతి కేంద్రాలకు వెళ్తారు. ఎన్.టి. రామారావుకు ఇంకా పని బాగా రద్దీగా ఉన్నందువల్ల ఆయన ఈ నెలలో ఊరు వదలడానికి వీలు పడకపోవచ్చు.

* * *

మే 1-న ప్రసాద్ పిక్చర్స్ వారి సాంఘికం 'ఇల్లరికం' విడుదల అవుతోంది. నాగేశ్వరరావు, జమున, గుమ్మడి, రమణారెడ్డి ఇందులో నటులు. రచయిత ఆరుద్ర. సంగీతం చలపతిరావు. దర్శకత్వం తాతినేని ప్రకాశరావు.

ఆ రోజునే వరలక్ష్మి ఫిలింస్ వారి జానపదం 'వీరభాస్కరుడు' విడుదల అవుతోంది. ఉదయకుమార్, ఎస్వరలక్ష్మి యిందులో ముఖ్య పాత్రధారులు. సంగీతం సాలూరి హనుమంతరావు. దర్శకుడు కె. బి. నాగభూషణం.

* * *

మే 16-న, స్వస్తిశ్రీ వారి భారీ జానపదం 'రేచుక్క పగటిచుక్క' వస్తుంది. రామారావు, రంగారావు, రేలంగి, రాజనాల జానకి మొదలగు వారంతా పాల్గొన్న ఈ చిత్రానికి దర్శకుడు కె. కామేశ్వరరావు. రచన సముద్రాల జూనియర్. సంగీతం టి.వి. రాజు. ఛాయాగ్రహణదర్శకుడు రెహమాన్. భారీ సెట్లు గల ఈచిత్రంలో పెద్ద సన్నివేశాలను తీయడానికి విదేశాల నుండి ప్రత్యేకమైన కామెరా లెన్సులు తెప్పించి ప్రశంసనీయమైన ఫలితాలు సాధించారని రషెస్ చూసినవారు చెబుతున్నారు.

మే తొలివారంలో విడుదల కాగల మరో చిత్రం విశ్వరూపావారి సాంఘికం 'కూతురు కాపురం'. జగ్గయ్య, జమున నాయికానాయకులు. దర్శకుడు శోభన్‌రావు. సంగీత దర్శకుడు రమేష్ నాయుడు.

మరి ఒకటి రెండు చిత్రాలు కూడా ఈ నెలే రావాలని ఉవ్విళ్లూరుతున్నాయి గాని చిత్రాల బలాబలాలూ, థియేటర్లు దొరకడం వగైరాల మీద వాటి కార్యక్రమాలు ఆధారపడి వున్నాయి.

జూన్‌లో రాగల చిత్రాల్లో పొన్నలూరి వారి జానపదం 'దైవబలం', గీతా పిక్చర్స్ వారి 'ఋష్య శృంగ', నవశక్తి వారి 'మా యింటి మహాలక్ష్మి', పద్మశ్రీ పిక్చర్స్ వారి 'శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం' ముఖ్యమైనవి.

చలనచిత్ర రాజధానిలో

ఏప్రిల్ 19. ఉదయం. ఊరంతా సందడిగా ఉంది. వీధరుగుమీద కూర్చుని పత్రికకోసం ఎదురుచూస్తున్న ఓ పెద్దాయన వీధంట హుషారుగా వస్తున్న నలుగురు యువకుల్ని చూసి, "అబ్బ! అట్టె, అట్టె, ఏమిటీ హడావుడీ" అన్నాడు. ఆ వరకూ ఆ జట్టు ఆ యిల్లు దాటే వెళ్ళిపోయింది. వాళ్ళ వెనకాల ఉన్న ఓ పదేళ్ళ చిన్న పిల్లడు వటుకు వెనక్కి తిరిగి "సినిమా స్టార్లొస్తున్నారండీ మెడ్రాస్ నించీ" అని తిరిగి పరుగందుకుని వాళ్ళ అన్నలతో అడుగు కలిపాడు...

తెలుగు ఫిలిం పరిశ్రమకు 'ఫ్రంట్ ఆఫీసు' అయినందువల్ల అక్షరాలా ఫిలిం కాపిటల్ అనిపించుకున్న విజయవాడకు ఉత్సవ దినం. చెన్నపట్నంలో ఉన్న సినీమా నటులందరూ (ఈఅతిశయోక్తిని మహా అయితే రెండుతో భాగించవచ్చు.) ఆనాడు ఆ వాడలో దిగారు.

వారు: అంజలీదేవి, సావిత్రి, రాజసులోచన, జి. వరలక్ష్మి, సూర్యకాంతం, నాగేశ్వరరావు, రంగారావు, నాగయ్య, రమణమూర్తి, రమణారెడ్డి, ఆదుర్తి, ఆత్రేయ, కొసరాజు, ఘంటసాల, మాధవపెద్ది సత్యం, సుశీల, సెల్వరాజ్.

కారణాలు: అన్నపూర్ణావారి 'మాంగల్య బలం' శతదినోత్సవాలు; ఊళ్ళో కొత్తగా పుట్టిన హాలు.

కొత్త సినీమా

ఈ హాలు పేరు అలంకార్. ఇది ఎయిర్ కూల్డ్ థియేటర్. ఈ సదుపాయం ఉన్న తొలి హాలు సర్కారు ప్రాంతానికి ఇదే. దాదాపు నాలుగులక్షల ఖర్చుతో 900 మంది కూర్చునేందుకు వీలుగా గాంధీనగర్‌లో పచ్చవ పాపయ్యగారు నిర్మించిన ఈ చలనచిత్ర ప్రదర్శనశాలకు, 'శత చిత్ర సుందరి' అంజలీదేవి ఆరోజున ప్రారంభోత్సవం జరిపింది. మాంగల్యబలం ఉత్సవానికి వచ్చిన నటులూ, ఇతర కళాకారులేకాక మద్రాసునుండి మరికొందరు సినీ పారిశ్రామికులు కూడా ఉత్సవానికి వచ్చారు.

'అలంకార్' సినిమా ప్రారంభం 'బెజవాడా' పౌరులకు 'చల్లటి' వార్త.

శతదినోత్సవం

సాయంకాలం గాంధీజీ మ్యునిసిపల్ హైస్కూలు ఆవరణలో నిర్మాతల (అన్నపూర్ణా), డిస్ట్రిబ్యూటర్ల (నవయుగ) సంయుక్త ఆధ్వర్యాన 'మాంగల్య బలం' శతదినోత్సవం అతివైభవంగా జరిగింది.

ఏడు కేంద్రాల (విజయవాడ, గుంటూరు నెల్లూరు, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం) ఉత్సవాలూ కలిపి విజయవాడలోనే జరిగినందువల్ల ఆ యా కేంద్రాల నుండి పలువురు వచ్చారు. దాదాపు 50 వేల మంది ప్రజలు సభకు హాజరై ఇది ఉత్సవం అనిపింప చేశారు.

పౌరాణికాలం వచ్చినా జానపద కథాజాలం చుట్టుముట్టినా సాంఘికం తీయాలని ఆలోచించే నిర్మాత మధుసూదనరావుగారికి ఈ చిత్రంలో హాట్ ట్రిక్ చేసిన ఘనత దక్కింది. ఈయన తీసిన మూడు సాంఘికాలు వరసగా శతదినోత్సవాలు చేసుకున్నాయి. రెండు రాష్ట్రపతి ప్రశంసా పత్రాలు అందుకున్నాయి. ఈ రెండూ ఆదుర్తి సుబ్బారావు అనే యువ దర్శకుడిని ప్రముఖుల శ్రేణిలో నిలిపాయి.

ఘంటసాల ప్రార్థన తరువాత, శత దినోత్సవ సభకు ప్రసిద్ధనటుడు, గాయకుడు, దర్శకుడు, సంగీత రచయితఅయిన నాగయ్యగారు అధ్యక్షత వహించి ఈ చిత్రంలో పాల్గొన్న యావన్మందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అన్నపూర్ణా సంస్థ చిత్రనిర్మాణంలో సత్సంప్రదాయాలు నెలకొల్పిందని ప్రశంసించారు.

బహుమతులు

తరువాత, నవయుగ ఫిలింస్ వారు మాంగల్యబలం నటీనటులకు, దర్శక నిర్మాతలకు, టెక్నిషియన్‌లకూ సన్మానపత్రాలు సమర్పించారు. వారందరికీ అన్నపూర్ణా పిక్చర్స్‌వారు, నవయుగవారు ఇచ్చిన రజత పాత్రలను, ఫలకాలను అంజలీదేవి అందచేసి అభినందించింది.

ఈ విజయ పరంపరకు కారకులైన నిర్మాత మధుసూదనరావుగారి కార్యదక్షతను ప్రశంసించింది.

తన మేనల్లుడి వివాహం జరిపిస్తూన్నందువల్ల రేలంగి ఒక్కరే సభకు హాజరుకాలేక పోయారు.. ఆయన బహుమతిని సూర్యకాంతం అందుకుంది.

సూర్యకాంతం మాటలాట

నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు, సూర్యకాంతం, రమణారెడ్డి, రాజసులోచన మొదలగువారంతా సన్మానానికి తగు రీతిన కృతజ్ఞత తెలిపారు. రమణారెడ్డి సూర్యకాంతం ఉపన్యసించలేదు.

"మేము మాటాడడానికి రాలేదు; మిమ్మల్ని చూసి కృతజ్ఞత తెలుపుకోడానికి వచ్చాం. మీరూ ఉపన్యాసాలూ వినడానికి రాలేదు. చూడ్డానికి వచ్చారు: ఈ భేటీకి ఇంత భారీఏర్పాట్లు చేసినవారు అభినందనీయులు" అన్నారు రమణారెడ్డి.

"-అయినాకాపోయినా, మహాసముద్రంలా ఉన్న ఈ సభలో మాటలాడడం అంటే మాటలా!" అంది సూర్యకాంతం.

19 వ తేదీరాత్రి, అతిథుల గౌరవార్థం నవయుగ ఫిలింస్ వారు విందు చేశారు. పుర ప్రముఖులు స్థానిక డిస్ట్రిబ్యూటర్లు ఎగ్జిబ్యూటర్లు పాల్గొన్నారు.

కొత్త చిత్రం

శ్రీ భవానీ ప్రొడక్షన్స్‌వారి తొలిచిత్రం "శ్రీశైల మల్లికార్జున మాహాత్మ్యం"కు కేంద్ర ఉపమంత్రి బి. ఎస్. మూర్తిగారు ఏప్రిల్ 25 న విజయా స్టుడియోలో ప్రారంభోత్సవం జరిపారు. 'గౌతమబుద్ధ' నాటక రచయితగా, సినిమా రచయితగా ప్రేక్షకులకు పరిచితుడైన కొండముది గోపాలరాయశర్మ ఈ చిత్రానికి నిర్మాత. రచన, దర్శకత్వం ఆయనే నిర్వహిస్తున్నారు.

జయభేరి

బ్రాహ్మణుల ఇంట పుట్టి బచ్చెనవాళ్ళ పిల్లతో అనురాగాన్నీ, శాస్త్రీయ సంగీతంలో పెరిగి 'పామర జనరంజని రాగాన్నీ' జీవితంమీద ప్రసరించబోయిన కాశీనాథ్ అనే చిన్నవాడి వృత్తాంతాన్ని శీవిగా ఆవిష్కరిస్తూ శాస్త్రీయ సంగీతాన్నీ తజ్ఞాన్యాన్నీ, బ్రాహ్మణ్యాన్నీ తదన్యాన్నీ చర్చిస్తూ పి. పుల్లయ్యగారు తీసిన చిత్రం 'జయభేరి'కి వాక్యానువాదాన్ని నవలరూపంలో నిర్మాత శ్రీ వాసిరెడ్డి నారాయణరావు ప్రచురించారు. చిత్రంలోని సంభాషణలనూ, మధురగేయాలనూ పొందుపరుస్తూ శ్రీ మధుమూర్తి ఈ నవలను వ్రాశారు. చలనచిత్రంలోని ఛాయాచిత్రాలు సందర్భోచితంగా జోడించి పుస్తకాన్ని అలంకరించారు. చూడతగిన పుస్తకం.

క్రౌన్‌సైజున 120 పుటలున్నాయి. త్రివర్ణ ముఖచిత్రం. వెల 60 నయాపైసలు. దొరికే చోటు విశాలాంధ్రప్రచురణాలయం, విజయవాడ-2. ★



'వచ్చినకోడలు నచ్చింది' చిత్రంలో సూర్యకాంతం, రేలంగి.

★ న్యూఢిల్లీ లేఖ ★

(7-వ పేజీ తరువాయి)

రెట్టింపు ధరతో భారత దేశంలో తయారైన కార్లను ఆయన పాకిస్తానీలచేత ఎలా నిర్బంధించికొనిపిస్తారో చూచితీరాల్సినవిషయం. నిజానికి శ్రీ లాల్ బహాదూర్‌కి అసలు విషయమేమో తెలుసుకోవాలనే కుతూహలం లేనట్లువుంది. అసలు విషయం ఏమిటి? శ్రేయోరాజ్య సిద్ధాంతం మూలంగా భారత దేశంలో కార్మికుల జీతాలు పెరిగిపోయి, భారతీయ వస్తువులు ధరల విషయంలో ఇతర దేశాల వస్తువులతో పోటీచేయలేకపోతున్నాయి. భారతదేశాన్ని శ్రీ లాల్ బహాదూర్ గారిశాఖ అమ్మకందార్ల మార్కెట్ గా తయారుచేసి పెట్టింది. కాని ప్రపంచ మార్కెట్ అంటే కొనుగోలుదార్ల మార్కెట్ అన్నమాట. అందుచేత శ్రీ లాల్ బహాదూర్ ఉండి ఉండి ఇలా బెదిరించటం నిష్ప్రయోజనం. ఈ బెదిరింపుల్ని ఖాతరుచేసేవాళ్ళు లేకపోగా అంతా నవ్వి పోతున్నారు.

ఎగుమతులు వృద్ధికాకుండా నిరోధించే అడ్డంకులు అనేకం ఉన్నాయి. ఒకటి పెరిగిపోతున్న కార్మిక వేతనాలు. రెండు కాంగ్రెసుపార్టీ సిద్ధాంతాలు. ఇదివరకు భారత దేశపు వస్తువులు నాణ్యం సంగతి ఎలా ఉన్నా చవకగా దొరుకుతాయనేది మన ఎగుమతులకి మంచి ప్రోత్సాహకరంగా వుండేది. ఇప్పుడావున్న ఒక్క సౌకర్యమూ పోయింది కార్మికుల జీతాల పుణ్యమా అని.

కాంగ్రెసు సిద్ధాంతాలమూలాన పరిస్థితులెలా చెడిపోయాయో చూడాలంటే భారతీయవస్త్రాలను దృష్టాంతంగా తీసుకోవచ్చు. మిల్లుబట్టలవల్ల వచ్చేలాభాలు ఖాదీపరిశ్రమకి సహాయం చేయటానికి వుపయోగపడుతున్నాయి. ఇదన్నీ, కార్మికుల జీతాలున్నూ, కలిసి బట్టల ధరలను పెంచివేశాయి. ఇక్కడిలా వుండగా, భారత దేశంతో స్నేహంగా వుంటున్న పొరుగురాజ్యం చైనా సువాసన వేసే బట్టలు మార్కెట్ లోకి ప్రవేశ పెట్టింది. ఈ బట్టలు ఉష్ణదేశాలలో ప్రజలకు హాయిగా వుంటాయి. చైనావారి "అద్భుత పురోగమనం" కార్మిక శాసనాలన్నిటినీ తుడిచిపెట్టిపారేసింది. ఇది ఇలావుంటే ఆగ్నేయాసియాదేశాల్లో భారత దేశం చైనాతో ఎలా పోటీ చేయగలదు?

విదేశీవర్తకం ఒకవేపురహదారిలాంటిది కాదు. భారతదేశం తన ఎగుమతుల దిగుమతుల వ్యాపారాన్ని సమానం చేసుకోవాలని ఎంతగా ప్రయత్నిస్తోందో ఇతర దేశాలూ అలాగే ప్రయత్నిస్తాయి. అందుకనే, భారతదేశం దిగుమతులను తగ్గించేసేటప్పటికి ఎగుమతులుకూడా వాటంతటవితగ్గిపోయాయి.

ఇదంతా అలావుంచి, భారతదేశంలోనే పెద్దమార్కెట్ అభివృద్ధిఅయి కూర్చున్నది. ఈమార్కెట్ అవసరాలు నెరవేరటంలేదు. ఈ మార్కెట్‌లో భారతీయ వర్తకులు తమ సరకులమ్ముకుని లాభాలు తీయటానికి అపారమైన అవకాశాలుండగా, విదేశాలకు ఎగుమతిచేసి నష్టంపొందాలని వారిని నిర్బంధించటం అనుచితం. ★

చెప్పుదెబ్బ

ఒకాయన్ని కుక్క కరిచింది. డాక్టరుకు చూపించడం ఎందుకులే అని బద్ధకించాడు. కోతిపుండు బ్రహ్మరాక్షసి అయింది. ఇకలాభంలేదని డాక్టరు వద్ద కెళ్ళాడు. డాక్టరు కరిచిన కుక్కని తెప్పించి పరీక్షించి "ఇది పిచ్చికుక్కయ్యా! వెంటనే ఎందుకు నాకు చూపించలేదు? ఇహ లాభంలేదు" అన్నాడు.

అప్పుడాయన డాక్టరుగారి బల్లవద్దకూచుని కాగితం తీసుకుని రాయడం మొదలెట్టాడు.

డాక్టరు సానుభూతిపూర్వకంగా అతని భుజం మీద చెయ్యేసి "అలా నిరాశపడిపోతె ఎలా? చెప్పలేం. నయమయినా అవచ్చు—అప్పుడే విల్లురాయడం ఎందుకు?" అన్నాడు.

"విల్లుకాదండీ - నేను ఇహ కరవదలచుకున్న వాళ్ల పేర్లు జాబితా వేసుకుంటున్నా"

ఏడుకొండలవాడా!

(28-వ పేజీతరువాయి)

చుట్టుపక్కలవాళ్లు కూడా పరుగెత్తుకొచ్చారు నిద్రమొహాలతో.

జగపతి అట్టానే నిలబడ్డాడు—శిల్పం కొట్టిన రాయిలాగ. పరుగెత్తి పారిపోవటానికి ప్రయత్నించలేదు. పట్టుబడ్డాడు.

ఆ ప్రక్కింటి వీరయ్యా, సుబ్బరామయ్యా కమతగాడూ, రామచంద్రయ్యా—అంతా కూడి జగపతి చేతుల్ని కవ్వంతాడుతో గట్టిగా కట్టారు. వూళ్లో వున్న అవుటు పోస్టు పోలీసుస్టేషనుకు అర్ధరాత్రే తీసికెళ్ళారు జగపతిని.

"ఏడుకొండలవాడా! వెంకటారమణా! ఇది నీ చిద్విలాసమే నాస్వామీ! దొంగతనం చేద్దామని రాలేదు. కాని దొంగవొచ్చినట్టుగా నేవొచ్చాను. దొంగలాగానే పట్టుపడ్డాను. నాలో మిగిలివున్న చెడుకీ, పాపానికీ, దుర్మార్గానికీ— ఈ జైలు తగినశిక్ష. ఇదే ఆఖరుసారిగా జైలుకు వెళ్ళడం." అనుకున్నాడు జగపతి పోలీసుస్టేషనుకు నడుస్తూ.

కరణంగారి భార్యకు, వాళ్లు జగపతిని అటు తీసుకెళ్ళగానే—డ్రాయరుమీద పెట్టి వున్న గోవర్ధన గొలుసూ, వొంకీల గాజులూ శ్రీవారి మొక్కుబడి తాలూకువి అగుపించాయి. ఆవిడ ఆశ్చర్యానికి అంతులేదు. భర్తను కేక వేసింది.

"ఏమండీ! చూశారా! రెండు నెలల క్రితం దొంగలెత్తుకుపోయినగలు—యిప్పుడు యీ డ్రాయరుమీద పెట్టివున్నాయి. ఈ నగలు ఏడుకొండలవాడివి. నిలువు దోపిడీగా యిస్తానని మొక్కుకున్నవి. చూశారా! ఏడుకొండలవాడి లీలా విశేషము! మనుషుల్ని మనుషులు మోసం చేసుకున్నా, దొంగతనం చేసుకున్నా—ఏడుకొండలవాడు కనిపెడుతూనే వుంటాడు. మంచీ చెడూ మధ్య రత్నంలాగ నిలిచి—పరికిస్తూనే వుంటాడు. దారితప్పి నడిచేవాళ్ళను సరైనదారికి తెస్తూనే వుంటాడు. ఏడుకొండలవాడా! వెంకటారమణా! ఆపద్బాంధవా! ఆనంద స్వరూపా! భూలోకవైకుంఠ నాథా! భక్తజనపాలకా.. " అంటూ కరణంగారి భార్య ఆ నగల్ని హృదయానికి గట్టిగా హత్తుకున్నది. ఆవిడ హృదయంలో ఆనందం ఉప్పొంగింది. భక్తిపారవశ్యముచే ఆవిడ శరీరం అటూ ఇటూ తూగింది.

కరణంగారు ఆనందబాష్పాలను భరించలేక—పై పంచతో కళ్ళు అద్దుకున్నారు.

ఆ ఇంట్లోని పడమటగదిలోని పూజా మందిరంలోని—శ్రీవెంకటేశ్వరస్వామి..."

★

అందువల్ల రామాయణం నుండి 1959 మార్కు రమణీయ ప్రేమాయణందాకా ఇదే వరస కాబట్టి ప్రజ్ఞ చూడాల్సింది పిండిలో కాదు; పొంగరం పొయ్యడంలోనే అనిన్నీ, చిత్రం పాత కొత్తలలో కాదు అందులో రచించిన బొమ్మలోననిన్నీ నరసభూపాలుడు అంటారు.

ఇలా బొమ్మలుకట్టిన రకరకాల రచయితలలో కొందరివేరంగు వెలిసిపోకుండా నిలచాయి. ఇందులోవాళ్లు రంగూ రంగూ కలిపి కొత్తరంగుతెచ్చారు. రెండూ రెండూగుణిస్తే ఐదూ ఆరూకావచ్చునని భయపెట్టి నాలుగేలే అని ధైర్యంచెప్పి సంతోషపెట్టారు. మాటా మాటా ఢీకొట్టిఅందులోంచి మూడో మాటని, నాలుగో అర్థాన్ని, ఐదో తాత్పర్యాన్నీ పుట్టించారు.

"అలా అయితే ఈసారి అదే పేర్లతో అదే పాత్రల్ని పెట్టి కొత్త కథ చెబుతాను పట్టు మరి" అంటూ కవ్వించి మరీ నవ్వించిన వుడ్‌హౌస్ అలాటివాడు. మాటని కొనగోట మీటి 'సరిగమకాలు' పలికించిన భమిడిపాటి అలాటివాడు. తెలుగువాడిని పొట్ట చెక్కలయేలా నవ్వించిన కామేశ్వరరావు గారి ప్రహసనాలు చాలావాటికి మూలాలు రాసిన మంచి ఫ్రెంచి నాటక రచయిత మోలియర్ అలాటి వాడు.....

కాంతా కనకాలు రెండిటినీ తీసుకొని, వాటికై మనుషులు పడే, పెట్టే అల్లరితో మోలియర్ అల్లిన ప్రహసనాలు ప్రపంచ ప్రసిద్ధాలు. అన్నిటిలోనూ చిన్నవాడు చిన్నదాన్నే పెళ్ళి చేసుకుంటాడు. పెళ్ళి పీటలమీద ఈ గమ్యానికి చేరేవరకూ మోలియర్ మానవగణావ గుణగణాలను అందరినీ అలరించేలా వెక్కిరిస్తాడు. అలా వెక్కిరించేటపుడు కూడా ఆయన 'వాక్యం' చూట్టానికి వికారంగా ఉండదు. లోకరీతిని చెబుతున్నపుడు పెద్ద కుంచెతో రంగులు వేస్తూనే, చిన్న సన్న కుంచెతో నగిషీ చెక్కుతాడు. 'పిసినిగొట్టు' ప్రహసనం ఈ కోవలోది.

ఇలాటివి ఎస్పరాంటో భాషలోకూడా బాగుంటాయి. అంతమాత్రాన జాను తెనుగు తర్జుమా చేయడం మహాపాపం అవదు. జాన తెలుగులో—కొన్ని సందర్భాలలో నట్టి తర్జుమా తెలుగులో సాగిన ఈ అనువాదం, పాఠకుడికి నవ్వొచ్చి పొట్ట చెక్కలయే ప్రమాదం లేకుండా కాపాడుతుంది. ★

పుస్తక సమీక్ష

నాలుగు నాటికలు

నాలుగునాటికలు:—అనువాదం: శ్రీమతి అద్దేపల్లి వివేకానందాదేవి. వెల రూ. 1-25. పబ్లిషర్సు: అద్దేపల్లి అండుకో, సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము. డిస్ట్రిబ్యూటర్సు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, సికిందరాబాదు.

ఈపుస్తకం నాలుగు ఉత్తమ నాటికల గుచ్ఛం. ద్వేషానికి సమాధానం ద్వేషం కాదనీ, కరుణతో ద్వేషవిషాన్ని ప్రేమామృతంగా మార్చవచ్చుననీ ఆదర్శ మానవవాదం బోధించే ప్రసిద్ధనాటిక "బిషప్స్ కాండిల్ స్టిక్స్" అనువాదం (అయ్యవారి వెండిసెమ్మెలు) ఒకటి.

యుద్ధంలోకి దిగినప్పుడల్లా 'ఈయుద్ధంతో యుద్ధాలన్నిటినీ అంతం చేస్తాం' అని పాశ్చాత్యరాజ్యాలు ఇప్పటిదాకా ఆత్మవంచన చేసుకుంటున్నాయి. కాని ప్రతి యుద్ధమూ మరోయుద్ధానికి దారితీస్తోంది. అయితే ఈ సారి ప్రపంచయుద్ధం వస్తే యుద్ధాలే కాకుండా ప్రపంచం కూడా అంతమైపోతుందని హెచ్చరించే "ది లాస్ట్ వార్" అనువాదం (కడసారి యుద్ధం) ఈ గుచ్ఛంలో రెండో మణి.

మూడో నాటిక "జేన్ వాగన్"లో వస్తువు మాతృప్రేమ. అసలు మాతృత్వమేఎరగని స్త్రీ దారివేరు. మాతృత్వం చవిచూసి వంచితురాలైన స్త్రీజీవితం మెరుపు మెరిసిన తరవాత కలిగే అనుభవంలాంటిది. తనపిల్లను కోల్పోయిన జేన్ వాగన్ తన భర్తకు మరో స్త్రీవల్ల కలిగిన బిడ్డనుతనదిగానే అంగీకరించి బ్రతుకు వెలితిని నింపుకోవటం ఈ నాటిక ఇతివృత్తం.

ఆఖరు నాటిక "లుక్రీజియా బోర్జియాస్ లిటిల్ పార్టీ" (సీజరు చెల్లెలు) చాలా ఉషారైన నాటకం. మెఫిస్టోఫిలిస్‌కు మారుపేరైన మెకియవెలీ, అతని శిష్యుడు సీజర్ బోర్జియా, లియనార్డో డా విన్సీ ఇందులో వస్తారు. సీజర్ చెల్లెలు లుక్రీజియా ఏర్పాటు చేసిన విందులో వీళ్ళూ, మరికొందరు స్త్రీ పురుషులు కలుసుకుంటారు. డా విన్సీని ఇంజనీరుగా మాత్రమే ఎరిగిన సీజర్ అతడు శత్రుపక్షానికి ముందుముందు ఉపయోగపడిపోతాడేమోనని సారాలో విషం కలిపి చంపబోతాడు. కాని దానిబదులు డా విన్సీ తయారుచేసిన మరొక మాదకద్రవం సారాలో కలిసి అందర్నీ నిరపాయమైన శృంగార చేష్టల్లోకి దించుతుంది. లేకపోతే, అప్పటికింకా పూర్తికాని అద్భుతచిత్రం 'మోనాలిసా' మనకి లభించిఉండేదికాదు. ఈ నాటిక కల్పితంకాక నిజంగా జరిగిందే అయితే, ఇలాటి ఎన్నివిందుల్లోనో డా విన్సీ పాల్గొనబట్టే "లాస్ట్ సపర్"లాంటి అత్యుత్తమచిత్రం రచించి ఉంటాడనిపిస్తుంది.

మొత్తానికి ఈ నాటికలన్నీ (రచయితలువరుసగా నార్మన్ మాకెనెల్, నీల్ గ్రాంట్, ఫ్లారెన్స్‌హోవెల్, ఎ.జె. టాల్బట్) ఉత్తమ శ్రేణికి చెందినవే. అనువాదమటుకు ఆ శ్రేణికి బహుదూరంలోని శ్రేణికి చెందినది. ఇంగ్లీషు రచనలను, ముఖ్యంగా ప్రయోగానికి ఉద్దేశించిన నాటికలాటి వాటిని తర్జుమా చేసేటప్పుడు ఇంగ్లీషుతెలుగులో కాక వచ్చి తెలుగులోకే అనువదించటం ముఖ్యం.

హాస్యానికి ఆనకట్ట

పిసినిగొట్టు: మోలియర్ ప్రహసనానికి అనువాదం. రచన పి. సుందరరావు. క్రౌన్ సైజు 112 పుటలు వెల ఒక రూపాయి. ప్రచురణ దాచేపల్లి కిష్టయ్య అండ్ సన్స్; వేంకటేశ్వర బుక్ డిపో, సికిందరాబాద్.

"బ్రాయ్ మీట్స్ గర్ల్...అంతకన్న ఇంకేముంది" అన్నాడు వాది 'ప్రేమాయణాల'లో గుట్టును ఒక్క ముక్కలో టూకీగా రట్టు చేస్తూ.

"చిత్తం చిత్తం. బాయ్ గర్ల్ వెంట కాపోతే మరెవరివెంట పడతాడండి" అన్నాడు ప్రతివాది కారంగా వెటకారంగా.

సారస్వత వ్యాసంగ రంగస్థలంమీద ఇది చిరకాలంగా తరచూ వినబడుతున్న సంభాషణే. నాటికీ నేటికీ కూడా నూటికి బోలెడన్ని నాటకాలలో, నవలలలో రచయితలు అబ్బాయి అమ్మాయిని కలుసుకోడంతో ఆఖరయే వృత్తాలే రాస్తున్నారు. పంగరం గరంగరాలు సాగుతున్నకొద్దీ అదే కథతో కొత్త కొత్త పొంగరం గరంగరాలు పోస్తున్నారు. "జీవితం ఇంతే కాదు; ఇంకా బోలెడుంది" అని వీళ్ళని కొప్పడి లేచేవాళ్లు పరదారాగమ నేతివృత్తంలోకి ఆ మిగతా జీవితాన్ని కుదించేసి పొంగరం గరంగరాలు పోస్తున్నారు.

8 వ పేజీలో "గవ్వలతో బొమ్మలు" ఫోటోలు, వ్యాసమూ పంపినవారు బి. వత్సల (మద్రాసు) అని గమనింప ప్రార్థన.


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S. Sambhu Prasad



వాణీ చతుర్ముఖులు

చిత్రకారుడు : గోటూరి నరసింహమూర్తి.


ఆమె సౌందర్యవతి...
ఆమె పాండ్స్‌ను ఉపయోగిస్తుంది



మీ ముఖమును మృదువుగా మరియు మనోహరముగా ఉంచుకొనుటకు

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌ను వాడండి

తేలికైన మరియు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీము చర్మమునకు రక్షణనిచ్చి దానిని చక్కగా మరియు మనోహరముగా ఉంచుతుంది. అది జిగురుగా ఉండదు మరియు రాసుకొన్న మరుక్షణము లోనే కనపడకుండాపోతుంది. పాండ్స్ వ్యానిషింగ్ క్రీమును పౌడరు అద్దుకొనే ముందు వాడితే పౌడరును గంటలతరబడి అంటుకొని ఉండేలా ఉంచుతుంది.



చర్మమును శుభ్రపరచే క్రీమ్
ప్రతి రాత్రి మీ ముఖమునకు పాండ్స్ కోల్డ్ క్రీమును రుద్ది రాసుకోండి. అది చర్మమును శుభ్రపరుస్తుంది మరియు మీ లావణ్యమును కాపాడుతుంది

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు ఎస్ ఎ.లో స్థాపించబడినది)